www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 16 No | విజయవాడ, గురువారం 17 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs

కేంద్రం నుండి వచ్చింది రూ. 9654 కోట్లే

- గత రెండేళ్లకన్నా 4వేల కోట్లు తక్కువ
- నేడు సిఎస్ కీలక సమీక్ష

2

సుప్రీం కోర్టు జడ్జీలుగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, దినేష్ మహేశ్వరి



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు జడ్జీలుగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, దినేష్ మహేశ్వరిలను కేంద్ర ప్రభుత్వం బుధవారం ఖరారు చేసింది. ఈ నెల 10న సుప్రీంకోర్టు కొలిజయం వీరిద్దరి పేర్లు సిఫార్సు చేసిన తరువాత అనేక వివాదాలు తలెత్తాయి. ముఖ్యంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సీనియారిటీపై జస్టిస్ సంజీవ్ కిషన్ కౌల్ ప్రశ్నలు లేవనెత్తారు. ఇతర హైకోర్టు జస్టిస్, జడ్జీల కంటే ఖన్నా సీనియారిటీ తక్కువగా ఉందని ఆయన ఆరోపించారు. ఈ వివాదాలు ఇలా ఉన్నా ప్రభుత్వం వీరిద్దరి పేర్లును ఖరారు చేస్తూ బుధవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీచేసింది.

కర్ణాటకలో కమలం కుట్ర!

- ఫిరాయింపులకు తెర తీసిన బిజెపి
- రాష్ట్రపతి పాలనకు యత్నాలు!
- ముంబయి హోటల్లో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్, జెడిఎస్ సర్కార్‌కు మద్దతు ఉపసంహరించిన ఇద్దరు స్వతంత్రులు
- కొద్దిరోజుల్లోనే సంక్షోభం సమసిపోతుంది: కుమారస్వామి







ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కర్ణాటకలో కాంగ్రెస్- జెడి(ఎస్) ప్రభుత్వాన్ని కూలదోయడానికి బిజెపి 'ఆపరేషన్ లోటస్' పేరుతో కుట్రలు ముమ్మరం చేసింది. ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తోంది. అది సాధ్యం కాకుంటే రాష్ట్రపతి పాలన విధించేందుకు ప్లాన్ బి పథకాన్ని సిద్ధం చేసినట్లు సమాచారం. ముంబయి, ఢిల్లీ కేంద్రాలుగా ఎమ్మెల్యేలతో శిబిర రాజకీయాలకు ఇప్పటికే తెర తీసింది. కేంద్రంలో మోడీ- అమిత్ షా డైరక్షన్‌లో కర్నాటక బిజెపి అధ్యక్షుడు యడ్యూరప్ప ఈ నాటకాన్ని నడిపిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు కాంగ్రెస్ అసంతృప్తి ఎమ్మెల్యేలను ముంబాయిలోని ఒక హోటల్‌లో వుంచారు. మరోవైపు కుమార స్వామి సర్కార్‌కు తమ మద్దతు ఉపసంహరిం చుకుంటున్నట్లు ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ప్రకటించారు. త్వరలోనే సంక్షోభం సమసిపోతుందని కర్ణాటక ముఖ్యమంత్రి కుమార స్వామి చెప్పారు. త్వరలోనే శుభవార్త వింటారని పార్టీ ఎమ్మెల్యేలతో బిజెపి నేత ఎడ్యూరప్ప అన్నారు.

(వివరాలు) 8లో

ఫెడరల్ రాజకీయం

- జగన్‌తో కేటిఆర్ భేటీ
- త్వరలో కెసిఆర్‌తో చర్చలు
- ఫ్రంట్‌లోకి రావాలని ఆహ్వానం..
- సానుకూల స్పందన



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. వైసిపి, టిఆర్ఎస్‌ల మధ్య సన్నిహిత సంబంధాలు పెరుగుతున్నాయంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత నంతరించుకుంది. బుధవారం మధ్యాహ్నం దాదాపు గంటన్నరపైగా ఈ సమావేశం జరిగింది. అంతకుముందు టిఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు నేరుగా జగన్‌తో ఫోన్లో మాట్లాడారు. ఫెడరల్ ఫ్రంట్‌పై చర్చిండానికి తన తరపున కెటిఆర్ వస్తున్నారని ఆయన చెప్పారు. త్వరలో ఈ ఇరువురు నేతలు ముఖాముఖి చర్చలు జరపనున్నారు. భేటీ అనంతరం ఈ విషయాన్ని కెటిఆర్‌తో పాటు జగన్మోహన్‌రెడ్డి ధృవీకరించారు. 'విజయవాడలోనే జగన్మోహన్‌రెడ్డిని కేసిఆర్ కలుస్తారు. త్వరలోనే ఈ సమావేశం జరుగుతుంది' అని కెటిఆర్ చెప్పగా, 'కెసిఆర్‌తో త్వరలో చర్చలు జరుగుతాయి. ఆ తరువాతే తుది నిర్ణయం తీసుకుంటాం' అని జగన్ అన్నారు. ఈ సమావేశంలో దేశ రాజకీయాలతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

కేసిఆర్ ప్రయత్నాలను స్వాగతిస్తున్నాం : వైఎస్ జగన్

రాష్ట్రాల హక్కుల సాధనకోసం కెసిఆర్ చేస్తున్న ప్రయత్నాలను

మిగతా9లో

అది ద్రోహుల కూటమి

- మోడీ చేతిలో కీలుబొమ్మ ఫెడరల్ ఫ్రంట్
- జగన్‌కు రాష్ట్ర ప్రజలు బుద్ధిచెబుతారు
- మంత్రులు లోకేశ్, యనమల, దేవినేని, కిమిడి, శిద్ధా,నక్కా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్, కెటిఆర్ భేటీపై మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. నాలుగున్నరేళ్ల విభజన చట్టంలోని అనేకాంశాల్లో ఏపీకి రావాల్సిన వాటా దక్కకుండా అడ్డుకున్న తెలంగాణా సిఎం కేసీఆర్‌తో కలిసి జగన్ ఆంధ్రా ద్రోహుల ఫ్రంట్ ఏర్పాటు చేశారని ట్విట్టర్‌లో విరుచుకుపడ్డారు. ఢిల్లీ మోడీ, ఆంధ్రా

మిగతా9లో

మైనార్టీలపై చిన్నచూపు!

- బడ్జెట్ కేటాయింపు తక్కువ
- ఖర్చు చేసింది స్వల్పమే

12

మోడీ వ్యాఖ్యలు

రాజ్యాంగం, సుప్రీంపై దాడి చేయడమే

శబరిమలపై ప్రధాని వ్యాఖ్యలకు సిపిఎం ఖండన

న్యూఢిల్లీ : శబరిమలపై కేరళ ప్రభుత్వాన్ని నిందిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం నాడు చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగంపైన, సుప్రీం కోర్టుపైన నేరుగా దాడిచేయడమేనని సిపిఐ(ఎం) పేర్కొంది. పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం నాడిక్కడ ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. శబరిమల విషయంలో కేరళ ప్రభుత్వవైఖరి సిగ్గుచేటు అని మోడీ చేసిన వ్యాఖ్యలను సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. 'సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయవద్దని ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని మోడీ హెచ్చరించడమే ఇది' అని పొలిట్ బ్యూరో వ్యాఖ్యానించింది. మోడీ ప్రధాన మంత్రిలా కాకుండా ఒక ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా మాట్లాడారని విమర్శించింది. 'మోడీ వ్యాఖ్యలు చాలా ఆందోళనకరంగా ఉన్నాయి. భవిష్యత్‌లో బిజెపి లేదా ఆర్ఎస్ఎస్ భావాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పులిస్తే వాటిని అమలు చేసే ప్రభుత్వాలపై దాడి చేస్తామని మోడీ తన వ్యాఖ్యల ద్వారా బెదిరి స్తున్నారని" పొలిట్ బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది. రాజ్యాంగం, లౌకిక, ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసం ఉన్నవారంతా మోడీ వ్యాఖ్యలను ఖండించాలని పిలుపు ఇచ్చింది. మంగళవారం కేరళలోని కొల్లంలో పర్యటించిన ప్రధాని మోడీ వామపక్షాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పొలిట్‌బ్యూరో ఈ ప్రకటన చేసింది.

సూర్యాపేట వద్ద కారు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

2

కోడి పందేలు @ రూ.300 కోట్లు

- పట్టని పోలీసులు
- యథేచ్ఛగా పేకాట, గుండాట, మద్యం విక్రయాలు
- డబ్బులు పోయి ఇద్దరు గుండెపోటుతో మృతి
- మీడియా కెమెరామెన్‌పై దాడి



ప్రజాశక్తి - యంత్రాంగం

సంక్రాంతిలో భాగంగా ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు సహా పలు జిల్లాల్లో పండగ మూడు రోజులూ కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. సొమ్ములు పోవడంతో తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన ఇద్దరు గుండెపోటుతో మృతిచెందారు. ఈ మూడు రోజుల్లోనే రూ.300 కోట్లకుపైగా పందేలు సాగాయని అంచనా. పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒక్కో రోజూ రూ.50 కోట్లు చొప్పున మూడు రోజుల్లో రూ.150 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో మూడురోజుల్లో రూ.50 కోట్లు వరకూ పందేలు సాగాయని చెబుతున్నారు. ఈ మూడు రోజులూ పోలీసులు కన్నెత్తయినా చూడకపోవడంతో బరుల వద్ద గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం నందమూరు గరువులో బుధవారం పందేలు చిత్రీకరిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా కెమెరాను ధ్వంసం చేసి దాడికి తెగబడ్డారు. జీలుగుమిల్లి మండలంలో బరి వద్ద జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రెండు ప్రాంతాల్లో బరులను పోలీసులు మూయించివేశారు. మిగిలినచోట్ల యథావిధిగా పందేలు సాగాయి. నరసాపురం ప్రాంతంలో కోడిపందేల శిబిరాల వద్ద టిడిపి నాయకులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహించారు. ఈసారి ప్రతి మండలంలోనూ ఒక్కో పెద్ద బరి ఉండటం విశేషం. చాలాచోట్ల టిడిపి నేతలు సంక్రాంతి సంబరాల పేరిట చేసిన ఏర్పాట్లు వద్దే కోడిపందేలు నిర్వహించడం విశేషం. ఐ.భీమవరం, భీమవరం, పెదగరువు ప్రాంతాల్లో అతి పెద్ద బరులు ఏర్పాటు చేశారు. గతంలో పందేల విషయంలో ఒకరు కోర్టుకు వెళ్లడానికి కారణమైన వెంప గ్రామానికి అరకిలోమీటరు దూరంలోని భీమవరం రూరల్ మండలం పెదగరువులో నాలుగు రోజుల క్రితమే ఏర్పాట్లు పెద్దఎత్తున జరిగాయి. అయినా పోలీసులు అటువైపు కన్నెత్తీ చూడలేదు. తూర్పుగోదావరి జిల్లాలో భోగి నాడే రూ.20 కోట్ల వరకూ పందేలు సాగగా, మూడురోజుల్లో రూ.50 కోట్ల వరకూ పందేలు జరిగాయని అంచనా. అల్లవరం మండలం గోడి, గోడిలంక, కొమరగిరిపట్నం ప్రాంతాల్లో ఈ మూడు రోజుల్లో రూ.20 కోట్ల మేర జరిగాయని అంచనా. ఆత్రేయపురం, రావులపాలెం, ఉప్పలగుప్తం, ఎస్.యానాం ప్రాంతాల్లో, పిఠాపురం, గొల్లప్రోలు, కోటనందూరు, కోరుకొండ మండలం రాజానగరం, దివాన్‌చెరువు, శంఖవరం, ప్రత్తిపాడు, గొల్లప్రోలు, పిఠాపురం, కాత్రేనికోన

మిగతా9లో

థెరిస్సాకు గట్టి ఎదురుదెబ్బ

- పార్లమెంట్‌లో 230 ఓట్ల తేడాతో వీగిన బ్రెగ్జిట్ డీల్
- ప్రతిపక్షాలతో చేతులు కలిపిన 118 మంది కన్సర్వేటివ్ ఎంపీలు
- అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన లేబర్ పార్టీ



లండన్: బ్రిటన్ ప్రధాని థెరిసామేకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఐరోపా కూటమితో ప్రధాని థెరెస్సా మే కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటిష్ పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్ మంగళవారం 432-202 ఓట్ల తేడాతో తిరస్కరించింది. 230 ఓట్ల భారీ తేడాతో డీల్‌ను తిరస్కరించడం బ్రిటన్ పార్లమెంటు చరిత్రలోనే ఒక అసాధారణం. ఆమె సొంత పార్టీ కన్సర్వేటివ్స్‌కు చెందిన వంద మందికిపైగా ఎంపీలు ఈ డీల్‌కు వ్యతిరేకంగా ఓటు చేయడం మరో విశేషం.

(వివరాలు) 9లో

ప్రజాతంత్ర హక్కులను అణచివేసే చర్య

- ఆనంద్ తెల్తుంబేపై కేసులు ఎత్తివేయండి : డిఎస్ఎంఎం డిమాండ్
- సంతకాల సేకరణకు పిలుపు

న్యూఢిల్లీ : ప్రొఫెసర్ ఆనంద్ తెల్తుంబేపై పూనే పోలీసులు తప్పుడు కేసులు బనాయించడాన్ని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ తీవ్రంగా ఖండించింది. ప్రజాతంత్ర హక్కులను, నిరసన తెలిపే హక్కును అణచివేసే చర్యగా దీనిని పేర్కొన్న డిఎస్ఎంఎం తప్పుడు కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కేసును వెనక్కి తీసుకోవడంతో పాటు, గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్‌గా తన వృత్తిని ప్రశాంతంగా కొనసాగించుకునే వీలు ఆనంద్ తెల్తుంబేకు కల్పించాలని కోరారు. బీమా-కొరెగావ్ సంఘటనలో వాస్తవానికి దళితులే బాధితులని, కానీ ఆ సంఘటన సాకుతో మేధావులైన వరదరాజన్, ఆనంద్ తెల్తుంబే వంటి వ్యక్తులపై కేసులు బనాయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వ ఒత్తిడితోనే పూనే పోలీసులు ఈ కేసు

మిగతా9లో

'మెటీరియల్'పైనే మక్కువ



ఉపాధి హామీలో తగ్గుతున్న వేతనం వాటా

కాంట్రాక్టర్లకు లబ్ధి కోసమే!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా పని తీరు చూపిస్తోందని తమ భుజాలు తామే చరుచుకుంటున్నారు. కాని, ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలకు పని కల్పించడంపై కాకుండా కాంట్రాక్టర్లకు లబ్ధిచేకూర్చే మెటీరియల్ కాంపొనెంట్ వినియోగంపైనే ప్రభుత్వం శ్రద్ధ చూపడం గమనార్హం. ఉపాధి హామీ పథకంలో 2018-19 ఆర్థిక సంవత్సరం డిసెంబరు చివరి వారానికి లేబర్ బడ్జెట్ రూ.4,911.10 కోట్లు వినియోగించాల్సి ఉండగా రూ.3,887.57 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అదే మెటీరియల్ బడ్జెట్ రూ.2,591.72 కోట్లకుగానూ లక్ష్యాన్ని మించి రూ.2,670.41 కోట్లు ఖర్చు చేశారు. అంటే వేతనం భాగం లక్ష్యం 79.1 శాతం మాత్రమే చేరుకోగా మెటీరియల్ కాంపొనెంట్ మాత్రం 103.03 శాతం ఖర్చు చేశారు. అంటే ఒక ఊళ్లో పేదలకు పని కల్పించడానికి వంద రూపాయలు ఖర్చు చేయాలని నిర్ణయిస్తే 79 రూపాయలే ఖర్చు చేసి, మెటీరియల్‌కు వంద ఖర్చు చెయ్యమంటే 103 రూపాయలు ఖర్చు చేశారన్నమాట. కాబట్టి పేదలకు పని కల్పించి

మిగతా9లో



మృతిచెందిన కవిత, ధనూష



కారులోనే మృతిచెందిన మురళీకృష్ణ

సూర్యాపేట వద్ద కారు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- పండగ తిరుగు ప్రయాణంలో విషాదం

ప్రజాశక్తి-నూజివీడు

సంక్రాంతి పండగ కోసం ఎంతో హుషారుగా హైదరాబాద్ నుండి వచ్చారు. ఆత్మీయులతో అనుబంధాలను మదినిండా నింపుకుని తిరిగి హైదరాబాద్‌కు కారులో వెళుతుండగా...ప్రమాదానికి గురై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. తెలంగాణా రాష్ట్రంలోని సూర్యాపేట వద్ద బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి సేకరించిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన పిఎసిఎస్ ఉపాధ్యక్షులు అక్కినేని వర ప్రకాష్‌రావు కుమార్తె కవిత (38), అల్లుడు రావి వెంకట మురళీకృష్ణ (48), మనుమరాలు రావి ధనూష (16), మనుమడు యువనీత కృష్ణ సంక్రాంతి పండగ కోసం వచ్చి అనంతరం బుధవారం ఉదయం బయలుదేరారు. సూర్యాపేట బైపాస్ రోడ్డులో కొమరమండ వద్ద వారు ప్రయాణిస్తున్న కారు టైర్ పంచరై డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న మరో రెండు కార్లపై పడింది. దీంతో మురళీకృష్ణ, కవిత, ధనూష మృతిచెందారు. మురళీకృష్ణ కారులోనే ఉండిపోగా, భార్య,కుమార్తెలు వందమీటర్ల దూరంలో ఓ మురుగు కాల్వలో పడిపయారు. యువనీత కృష్ణ గాయాలతో బయటపడ్డాడు. మురళీకృష్ణ హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగిగా, కవిత సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తున్నారు.

కొద్ది గంటల ముందు వరకూ తమతో హాయిగా గడిపి మృత్యువు చేరుకోవడంతో వరప్రకాష్‌రావు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాద వార్త విని పోతురెడ్డిపల్లి సహా పొరుగు గ్రామాలకు చెందిన వారు సైతం కంటతడిపెట్టారు.



పెరగనున్న చలి, పొగమంచు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కొద్దిరోజుల పాటు ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో పొగమంచు సహా చలి కూడా పెరిగే అవకాశాలున్నాయి. అదే సందర్భంలో పగటి ఉష్ణోగ్రతలు కూడా పెరగనున్నాయి. ఉత్తరాదిన పశ్చిమ ఆటంకాలే దీనికి కారణమని విశాఖ వాతావరణ శాఖ విశ్రాంత శాస్త్రవేత్త రాళ్లపల్లి మురళీకృష్ణ ప్రజాశక్తికి తెలిపారు. పశ్చిమ నుంచి తూర్పునకు ఈ గాలులు ప్రయాణం చేస్తున్నందున ఉత్తరాదిలో చల్లగా ఉండడం, వాటి మూలాన వచ్చే గాలులు దక్షిణాదిపైనా ప్రభావం చూపుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో గాలి చల్లగానూ, కొన్నిచోట్ల పొగమంచు కూడా ఉంటుందని వివరించారు. ఆకాశం కొన్నిచోట్ల నిర్మలంగా ఉండే అవకాశాలున్నాయని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. లి-నింగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు నియామితులయ్యారు?
2. దేశంలో అతిపెద్ద స్టార్టఆఫ్ (start up) ఎక్కడ నిర్మించారు?
3. ఇండియన్ ఆర్మీడే ను ఏ తేదీన జరుపుతారు?
4. ప్రపంచంలోనే అతిపెద్ద సౌర విద్యుత్ కర్మాగారం ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు?
5. నేషనల్ యూత్ డే ను ఏ రోజున జరుపుకుంటారు?

సమాధానాలు 7లో

కేంద్రం నుండి వచ్చింది రూ. 9654 కోట్లే

- గత రెండేళ్లకన్నా 4వేల కోట్లు తక్కువ
- నేడు సిఎస్ కీలక సమీక్ష

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం అందించే ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రానికి ఇప్పటివరకు కేవలం రూ.9,654 కోట్లు మాత్రమే వచ్చింది. ఇది గత రెండేళ్లలో వచ్చిన నిధుల కన్నా దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలు తక్కువ. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించనుంది. మొత్తం 27 శాఖలకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నెలాఖరు వరకు రూ.9,273 కోట్లు, రాష్ట్ర రహదారులకు మరో రూ.377 కోట్లు వచ్చాయి. అదే 2016-17లో రూ.13,329 కోట్లు, 2017-2018లో రూ.13,191 కోట్లు అందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంకా మూడు నెలలు మాత్రమే ఉండడంతో నిధులను రాబట్టుకునే మార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారు.

ఇలా నిధులు తగ్గడానికి కారణం మీరంటే మీరంటూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లడం లేదని, వినియోగ ధ్రువ పత్రాలు



(యుసిలు) కూడా అన్నీ రానందున నిధులు ఇవ్వడానికి కేంద్రం నిరాకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన నిధులను పరిశీలిస్తే అత్యధికంగా గ్రామీణాభివృద్ధికి రూ.3,242 కోట్లు రాగా, వ్యవసాయానికి రూ.1,004 కోట్లు, పాఠశాల విద్యకు రూ.871 కోట్లు, వైద్య ఆరోగ్యశాఖకు రూ.996 కోట్లు, గృహనిర్మాణానికి రూ.579 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.538 కోట్లు, స్త్రీ శిశు సంక్షేమానికి రూ.749 కోట్లు, సాంఘిక సంక్షేమానికి రూ.299 కోట్లు చొప్పున రాగా, ఇతర పథకాలకు మరికొన్ని నిధులు వచ్చాయి. ఇలా ఉండగా, జాతీయ బ్యాంబూ మిషన్, జాతీయ ఆహార భద్రతకు సంబంధించిన నిధులకు, ప్రధానమంత్రి కృషి సంచయ్ యోజన, జాతీయ ఆగ్రో ఫారెస్ట్రీ, గ్రీన్ ఇండియా, వన్యప్రాణుల ఆవాసాల పథకం, నదుల ఎకో పర్యాటకం,టెరిటరీ క్యాన్సర్ కేర్‌సెంటర్, యుజి పెంపుదల, ట్రామా కేర్ సెంటర్, పలు స్కాలర్‌షిప్పులు, గ్రామ స్వరాజ్ అభియాన్ వంటి వాటికి ఇంకా వినియోగ ధృవీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంది. అలాగే అత్యధికంగా గ్రామీణ, పట్టణ గృహనిర్మాణ పథకాలకు వచ్చిన నిధుల్లో రూ.245 కోట్లకు యుసిలు ఇవ్వాల్సి ఉండగా, ఇళ్ల నిర్మాణ పురోగతి నివేదికలు కూడా ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. వెనుకబడిన తరగతుల సహాయానికి ఇంకా రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు వెళ్లలేదు. అలాగే కొల్లేరు సరస్సు ప్రాంతంలో అక్వా ఎకో సిస్టమ్‌ను మెరుగుపరిచేందుకు, జాతీయ నదుల పరిరక్షణ, ఆగ్రో మెరైన్ పథకం, ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన, ఆపరేషన్ గ్రీన్‌టాప్ఎ పారామెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు, అంతర్‌రాష్ట్ర రోడ్డు అనుసంధానం ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపించాల్సి ఉంది. కాగా ఈ అంశాలపై ఎపి భవన్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పటికప్పుడు కేంద్ర ఆర్థికశాఖతో చర్చించడం, ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ప్రోగ్రెస్ రిపోర్టులను సిద్ధం చేయాలని యోచిస్తున్నారు. వీటిపై గురువారం ప్రత్యేకంగా సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా నిర్ణయించారు.

తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షునిగా దేవినేని అవినాష్

పది అనుబంధ విభాగాలకు అధ్యక్షులను ప్రకటించిన చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు దేశం పార్టీ అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి ప్రకటించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షునిగా దేవినేని అవినాష్ (కృష్ణా జిల్లా), తెలుగు మహిళ అధ్యక్షురాలిగా పోతుల సునీత (ప్రకాశం)ను నియమించారు. అలాగే తెలుగురైతు అధ్యక్షునిగా కంభం విజయరామిరెడ్డి (నెల్లూరు జిల్లా), బిసి సెల్ అధ్యక్షునిగా బోనబోయిన శ్రీనివాసయాదవ్ (గుంటూరు), ఎస్సీసెల్ అధ్యక్షునిగా ఎంఎస్ రాజు (అనంతపురం), ఎస్టీసెల్ అధ్యక్షునిగా ఎంవివి ప్రసాద్ (విశాఖ), మైనార్టీ సెల్ అధ్యక్షునిగా ఇంతియాజ్ అహ్మద్ (కర్నూలు), క్రిస్టియన్ సెల్ అధ్యక్షునిగా మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యుయేల్ (గుంటూరు), టిఎన్‌టియుసి అధ్యక్షునిగా బి నరేష్‌కుమార్ రెడ్డి (చిత్తూరు), అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలిగా భీమినేని వందనాదేవి(గుంటూరు)ని నియమించారు.

ఫెడరల్ ఫ్రంట్ కోసమే టిఆర్‌ఎస్‌తో చర్చలు

వైసిపి అధికారప్రతినిధి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్డీఎ, యుపిఎ ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసేందుకే వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డితో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చర్చించారని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు తెలిపారు. విజయవాడలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్‌తో పొత్తుకు ప్రయత్నించిన చంద్రబాబు తాము కేవలం చర్చలు జరిపితేనే ఆక్రోశానికి లోనవుతున్నారని, కెసిఆర్‌తో పొత్తుకు ఆయనెందుకు ప్రయత్నించారని ప్రశ్నించారు. 'టిడిపి పొత్తు పెట్టుకుంటే రాష్ట్ర ప్రయోజనాల కోసం..మేం పొత్తు పెట్టుకుంటే ప్రయోజనాలను తాకట్టుపెట్టినట్లా? ప్రత్యేక హోదాకు మద్దతిస్తామని పార్టీతో చర్చించడం తప్పా?' అని వ్యాఖ్యానించారు. జాతీయ రాజకీయాల వేదిక కోసం పద్ధతిగా చర్చించామని, రాష్ట్రాభివృద్ధికి ఏయే మార్గాలున్నాయనే దానిపై ఆలోచిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే వైసిపి ప్రధాన ధ్యేయమని, రెండు రాష్ట్రాల కలయిక వల్ల కేంద్రం భయపడి హోదా ఇచ్చే అవకాశముందని చెప్పారు. వైఎస్ షర్మిలపై టిడిపి పనిగట్టుకుని విష ప్రచారం చేస్తోందని, వ్యక్తిగత ఆరోపణలు చేసే లక్షణం తమకు లేదని చంద్రబాబు చెప్పడం ఆశ్చర్యకరమన్నారు. రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వాలను దెబ్బతీయడమే చంద్రబాబు లక్షణమనేది ఆయన చరిత్ర చూస్తే అర్థమవుతుందన్నారు. పనిగట్టుకుని అసత్యప్రచారం చేయడం నీచమైన చర్య అని, దానికి ప్రతిఫలం అనుభవిస్తారని చెప్పారు. జగన్‌పై దాడి కేసులో ఎన్ఐఎ విచారణతో వాస్తవాలు బయటకొస్తాయనే చంద్రబాబు గగ్గోలు పెడుతున్నారన్నారు.

ఫెడరల్ ఫ్రంట్‌కు మోడీ డైరెక్షన్

- తెలుగు రాష్ట్రాలకు పెను ప్రమాదం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడీ డైరెక్షన్లోనే ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలు సాగుతున్నాయని, దీంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రా ల్లోనూ బిజెపి కనుమరుగవడంతో కెసిఆర్, జగన్ ద్వారా ప్రమాదకరమైన రాజకీయాలకు తెర తీస్తున్నారన్నారు. మోడీకి అనుకూలంగా పనిచేసేందుకు కెసిఆర్, జగన్ మంతనాలు జరుపుతున్నారని, దీనిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కెసిఆర్, జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే బిజెపితో బహిర్గతంగా పొత్తుపెట్టుకుని ఎన్నికల్లోకి వెళ్లాలన్నారు. కెసిఆర్‌తో కలిస్తే వైసిపి పాతాళానికి పోవడం ఖాయమన్నారు. ప్రత్యేక హోదా కోసం తాము ముందు నుంచి కేంద్రంపై పోరాడుతున్నామని, జగన్ ఎవరిపై పోరాడారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆంధ్రాకు వచ్చి జగన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణా ప్రభుత్వం ప్రజలకు గొప్ప సేవలందిస్తున్నట్లుగా ఆయన వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని, అక్కడ కెసిఆర్ లాంటి దొరలకు నాయకులు సేవలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ కోసం బిసిలు, యాదవులంతా పనిచేయాలంటూ తలసాని చెప్పడం సరికాదన్నారు. తనకు అవమానం జరిగిందని హైదరాబాద్‌లో పోలీసుల్ని వైఎస్ షర్మిల ఆశ్రయించారని, దీనిపై సిఎం చంద్రబాబు స్పందించిన వైఖరి సరిగా లేదని అన్నారు. షర్మిలకు ఆంధ్రా పోలీసులు న్యాయం చేస్తారని సిఎం చెప్పి ఉంటే హుందాగా ఉండేదన్నారు. ఇప్పటికైనా షర్మిలకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా కోట్లాది రూపాయిల కోడిపందాలు కొనసాగుతుంటే ముఖ్యమంత్రి, హోం మంత్రి ఏం చేస్తున్నారని, కోడి పందాల్ని అరికడతామంటూ మైకులు పట్టుకుని ప్రచారం చేసిన పోలీసులు ఏమయ్యారని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పిజె చంద్రశేఖరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి ఓబులేసు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఏపీలో టిఆర్‌ఎస్ పోటీ చేయదు

వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో టిఆర్ఎస్ పోటీ చేయదని వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ఫెడరల్ ఫ్రంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీలు మాత్రమే భాగస్వాములుగా ఉంటాయన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సిఎం కెసిఆర్ ఆలోచనా విధానం బాగుందన్నారు. రాష్ట్రాల హక్కు కోసం కేంద్రంతో పోరాడేందుకు ఒక వేదికగా ఫెడరల్ ఫ్రంట్ నిలుస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌లో ఏ ప్రాంతీయ పార్టీలైతే భాగమవుతాయో...వారికి మద్దతుగా ఫెడరల్ ఫ్రంట్ ప్రచారం చేస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేవారికే వైసిపి మద్దతుంటుందన్నారు. ఇటీవల హోదాపై కేసిఆర్ కూడా స్పష్టత ఇచ్చారని, రాష్ట్రానికి హోదా సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. జగన్, కేటిఆర్‌ల మధ్య జరిగిన చర్చలు ప్రారంభం మాత్రమేనని, త్వరలో కేసిఆర్ స్వయంగా జగన్‌తో చర్చలు జరుపుతారని చెప్పారు. యూపిఎ, ఎన్డీయేలకు భిన్నంగా ఫెడరల్ ఫ్రంట్ ఉండబోతుందని, రాష్ట్రాల హక్కుల పరిరక్షణే ఈ కూటమి అంతిమ లక్ష్యమని అన్నారు.

పది మంది కెసిఆర్‌లొచ్చినా టిడిపికేం కాదు

- షర్మిల నా కూతురులాంటిది
- ఎంపి జెసి దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



తెలంగాణ సిఎం కేసీఆర్‌తో పాటు మరో పది మంది కేసిఆర్‌లు వచ్చినా ఏపీలో టిడిపిని చేయగలిగిందేమీ లేదని అనంతపురం ఎంపి జెసి దివాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వైయస్ షర్మిల తన కూతురుతో సమానమని, ఆమెను విమర్శించి ఉంటే ఆ పాపం తనకు తగులుతుందని అన్నారు. ఉండవల్లి గ్రీవెన్స్‌హాల్‌లో బుధవారం జెసి సోదరులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాంతర వివాహం చేసుకున్నందుకు గతంలోనే వైయస్ కుటుంబాన్ని అభినందించానన్నారు. కులాంతర వివాహానికి అనుమతిచ్చిన వైయస్ కుటుంబం నేడు కులాలను రెచ్చగొట్టడంపైనే విమర్శించానన్నారు. రానున్న ఎన్నికల్లో మా కుమారుడు, మా తమ్ముడు కుమారుడు పోటీ చేయాలనుకుంటున్నారని దివాకర్‌రెడ్డి చెప్పారు. జగన్, కేసిఆర్ ఇప్పుడు కలవడమేంటీ? ఏడాది నుంచే కలిసి పనిచేస్తున్న విషయం అందరికీ తెలుసని అన్నారు. ఇవాళ జగన్, కేటిఆర్ భేటీ అయి కొత్తగా ఏం మాట్లాడకుంటారని తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులూ ఉండరని, టిడిపికి ఢోకా లేదని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో బిసీలకు నాయకుడు లేక పోవడమేమిటి? మరి యనమల ఎవరు? అంటూ ప్రశ్నించారు. రాయలసీమకొస్తే బీసీలు ఎవరి వైపు ఉన్నారో చూపిస్తానని దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఫెఢరల్ ఫ్రంట్ గురించి మాట్లాడుతూ ఫ్రంట్ లేదూ... పాడూ లేదూ అని ఎద్దేవా చేశారు. ఒక్కోసారి ఒక్కో పెద్ద మనిషికి కోపం వస్తుందని, ఇప్పుడు కేసిఆర్‌కు కోపం వచ్చిందని అన్నారు.

షర్మిల ఫిర్యాదుపై విచారణ వేగవంతం

- గతంలో అరెస్ట్ చేసిన వారినీ విచారిస్తున్నాం
- సైబర్ క్రైం అడిషనల్ డిసిపి రఘువీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్న వారిపై వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ వేగవంతం చేసినట్లు సైబర్ క్రైం అడిషనల్ డిసిపి రఘువీర్ తెలిపారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నవారితో పాటు దాని వెనుక ఉన్న వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరుతూ షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలసి ఇటీవల హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు పోస్టులు పెడుతున్న సైట్లపై దృష్టి సారించారు. దీనిపై సైబర్ క్రైం అడిషనల్ డిసిపి రఘువీర్ బుధవారం మీడియాతో మాట్లాడారు. షర్మిలపై కొన్ని యుట్యూబ్ చానాళ్లు, ఫేస్‌బుక్ గ్రూప్‌లలో ఎక్కువగా అభ్యంతరకర పోస్టులు పెట్టారని తెలిపారు. వాటికి సంబంధించి 10 వరకు సైట్లను గుర్తించామన్నారు. వీడియోలు, పోస్టులకొచ్చిన కామెంట్లు, యుఆర్ఎల్‌లపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే విచారణ కోసం స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, యుట్యూబ్, ఫేసుబుక్ నుంచి కొంత సమాచారం రావలసి ఉందన్నారు. వీడియోలు తయారు చేసిన వాళ్లతో పాటు దీని వెనుక ఉన్న వాళ్లను కూడా గుర్తించి, వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై అప్పట్లో ముగ్గురుని అరెస్ట్ చేశామని, ఇప్పుడు కూడా వాళ్ల ప్రమేయమేమైనా ఉందా అన్న కోణంలో విచారణ జరుపుతున్నామని చెప్పారు. 15 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేస్తామని రఘువీర్ తెలిపారు.

ప్రత్యేకం

మౌలిక అంశాలు గాలికి

- క్రమశిక్షణా చర్యల్లో ఆర్టీసి తీరిది
- ఉద్యోగ భద్రతపై సిబ్బందిలో సందేహాలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి సిబ్బంది క్రమశిక్షణా చర్యల్లో మార్పులు చేసిన యాజమాన్యం మౌలిక అంశాల్ని మాత్రం గాలికొదిలేసింది. చేయని తప్పులకు కూడా సిబ్బందిపై చర్యలు తీసుకునేలా ఉన్న కొన్ని శిక్షలను మార్పు చేయడాన్ని విస్మరించింది. దీంతో తమ ఉద్యోగ భద్రతపై సిబ్బందిలో సందేహాలు నెలకొన్నాయి. క్షేత్ర స్థాయిలో పరిశీలనల్లో తమ దృష్టికొచ్చిన విషయాలు, కార్మిక సంఘాల నుంచి వచ్చిన అభ్యంతరాల ఆధారంగా పలు మార్పులు చేశామని చెబుతున్నా అభ్యంతరాల్లో కొన్నింటిని మాత్రమే తీసుకుని శిక్షల్లో మార్పులు చేసింది. మోటార్ వాహన చట్టం (ఎంవి యాక్ట్)లోని సెక్షన్ 124 ప్రకారం బస్సులో టికెట్ తీసుకోవాల్సిన బాధ్యత ప్రయాణికులదే అయినా కండక్టర్‌పై చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల చేసిన మార్పుల్లో ఈ అంశాన్ని పట్టించుకోలేదు. ప్రయాణికుడు టికెట్ తీసుకున్న ప్రాంతం దాటి ప్రయాణిస్తే దానికి కూడా కండక్టర్‌నే బాధ్యుని చేస్తున్నారు. టైర్, స్ప్రింగ్, షటర్ వంటి చిన్న నష్టాలకు సిబ్బంది బాధ్యులు కాదని చెబుతూనే, బస్, సంస్థ ఆస్తి వంటి పెద్ద నష్టాలకు విధించే పెనార్టీలను పెంచేశారు. వాటికి చార్జ్‌షీట్ ఇవ్వనున్నారు. ఛార్జి వసూలు చేయని కేసుల్లో సీటింగ్ కెపాసిటీ కంటే ఎక్కువ ఉంటే, సిటీ బస్సుల్లో రూ.20లోపు, ఇతర సర్వీసుల్లో రూ.30లోపు తేడా ఉంటే ఒక పాయింట్ కేటాయించనున్నారు. సిటీ బస్సుల్లో రూ.20 నుంచి రూ.50, ఇతర సర్వీసుల్లో రూ.30 నుంచి రూ.100 తేడా ఉంటే రెండు పాయింట్లు, సిటీ బస్సుల్లో రూ.50పైన, ఇతర సర్వీసుల్లో రూ.100 పైన తేడా ఉంటే చార్జ్ షీట్ ఇవ్వనున్నారు. సీటింగ్ కెపాసిటీకి సమానంగా లేదా తక్కువ మంది ఉంటే సిటీ బస్సుల్లో రూ.20లోపు, ఇతర సర్వీసుల్లో రూ.30లోపు తేడా ఉంటే రెండు పాయింట్లు కేటాయించనున్నారు. సిటీ బస్సుల్లో రూ.20 నుంచి రూ.50, ఇతర సర్వీసుల్లో రూ.30 నుంచి రూ.100 తేడా ఉంటే ఛార్జ్‌షీటు, సిటీ బస్సుల్లో రూ.50పైన, ఇతర సర్వీసుల్లో రూ.100 పైన తేడా ఉంటే చార్జ్ షీట్‌తో పాటు ఒక ఏడాది పాటు ఇంక్రిమెంట్‌లో కోత విధించనున్నారు. ఛార్జీ వసూలు చేసి టికెట్ ఇవ్వని కేసుల్లో మేజర్-1 తప్పునకు ఛార్జ్‌షీట్, ఒక ఏడాది ఇంక్రిమెంట్‌లో కోతతో పాటు టికెట్ మొత్తానికి పది రెట్లు వసూలు చేయనున్నారు. మేజర్-2 తప్పునకు ఛార్జ్‌షీట్, రెండేళ్ల ఇంక్రిమెంట్‌లో కోతతో పాటు టికెట్ మొత్తానికి పది రెట్లు వసూలు చేయనున్నారు. బస్ క్యాష్‌లో రూ.30 నుంచి రూ.60 తేడా ఉన్నా ఒక పాయింట్, రూ.60కి మించి తేడా ఉంటే రెండు పాయింట్లు కేటాయించనున్నారు. ప్రయివేట్ క్యాష్ రూ.200లోపు ఉంటే ఒక పాయింట్, రూ.200 పైన ఉంటే రెండు పాయింట్లు ఇవ్వనున్నారు. ఆరు పాయింట్లకు చార్జ్‌షీట్ ఇచ్చిన తరువాత, దానికి సంబంధించిన శిక్షను ఉద్యోగి అమలు చేశాక, ముందులాగా పాయింట్ల కొనసాగింపు కాకుండా రెండో సెట్‌గా పాయింట్లను కేటాయించనున్నారు. మైనర్-1, మైనర్-2 తప్పులు పునరావృతమైనా అదే స్థాయి తప్పులుగా పరిగణిస్తారు. మేజర్ స్థాయి తప్పులు పునరావృతమైతే శిక్ష స్థాయి పెరగనుంది.

టెండర్లు పూర్తి కాని ఎన్‌టిఆర్ సుజల

- 17 ప్యాకేజిలలో ఎనిమిదింటికే టెండర్లు
- పనులు ప్రారంభమయ్యే దెప్పుడో?
- స్వజల్‌కు అనుసంధానంపై తేల్చని ప్రభుత్వం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం నాలుగేళ్లయినా ప్రజలకు అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. తాజాగా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో 103 క్లస్టర్లలో రూ.402.37 కోట్ల వ్యయంతో హబ్ అండ్ స్పోక్ విధానంలో ఈ పథకాన్ని ఏర్పాటు చేయడానికి గత ఏడాది జనవరి 29 ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. పథకంలో భాగంగా 17 మథర్ ప్లాంట్లతోపాటు 2,655 రూరల్ డిస్పెనింగ్ యూనిట్లు (ఆర్‌డియు) ఏర్పాటు చేయాల్సి ఉంది. 20 లీటర్ల సురక్షితమైన తాగునీరును రూ.2 లకే అందించాల్సి ఉంది. ఏడాదైనా ఈ ప్లాంట్ల ఏర్పాటు టెండర్ల దశ నుంచి ముందుకు కదలడం లేదు. ఇప్పటి వరకూ కేవలం ఐదు జిల్లాల్లో 54 క్లస్టర్లకు మాత్రమే టెండర్లు పిలిచారు. వీటిలో అనంతపురం జిల్లాలో 22, నెల్లూరు జిల్లాలో 14, కర్నూలు జిల్లాలో 8, కడప జిల్లాలో 5, గుంటూరు జిల్లాలో 5 క్లస్టర్లు మాత్రమే ఉన్నాయి. టెండర్లు ప్రక్రియ పూర్తి చేసిన పనులు ప్రారంభించడానికి మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉందని అధికారులంటున్నారు. మరో 9 మథర్ ప్లాంటకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.100 కోట్లు మాత్రమే కేటాయించారు.

మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వజల్ పథకాన్ని గత ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టింది. 115 జిల్లాల్లో కలుషిత నీటి సమస్య ఉన్న 27,500 ఆవాసాల్లో రూ.వెయ్యి కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరాకు పథకాలు ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కొరత ఎదుర్కొంటుండటంతో ఎన్టీఆర్ సుజల పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వజల పథకంలో అనుసంధానం ఆలోచనలో ఉన్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్లాంట్ల ఏర్పాటులో జాప్యం కారణంగా ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు తీరప్రాంత గ్రామాల్లోని ఉప్పునీరు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులే గత శాసనసభ సమావేశాల్లో మంత్రి నారా లోకేష్‌ను కోరారు. మొదటి దశలో ప్లాంట్ల ఏర్పాటు పూర్తయిన అనంతరం రెండవ దశలో తీర ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తితో ఉన్నారు.


శ్రీకాకుళం జిల్లా రాజాంలో వస్త్రదానం చేస్తున్న జిఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు


కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో కోడి పందేలు నిర్వహిస్తున్న పందెం రాయుళ్లు


గుంటూరు జిల్లా పెదనందిపాడులో బాలల కర్రసాము

ఘనంగా సంక్రాంతి వేడుకలు

- చిత్తూరు జిల్లాలో జల్లికట్టు జోరు
- శ్రీకాకుళంలో జిఎంఆర్ వస్త్రదానం


చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో నిర్వహించిన జల్లికట్టులో పశువులను నిలువరిస్తున్న యువత

ప్రజాశక్తి యంత్రాంగం

సంక్రాంతి పండగలో భాగంగా మంగళ, బుధ వారాల్లో ఇటు గ్రామీణంలోనూ, అటు పట్టణాల్లోనూ వివిధ వేడుకలు జరిగాయి. మంగళవారం పెద్దలను స్మరించుకుంటూ కుటుంబసభ్యులకు, పేదలకు వస్త్రదానం చేశారు. రంగువల్లులతో కూడిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, ట్రస్ట్‌ల పేర వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

తమిళనాడు సంప్రదాయాన్ని చిత్తూరు జిల్లా యువత ఆనవాయితీగా నిర్వహించడంతో కోడెగిత్తలు రంకేశాయి.. కనుమ పండుగ రోజు ఎ.రంగంపేటలో జల్లికట్టు వేడుక కోలాహలంగా జరిగింది. పశువుల వెంట పరుగులు తీసిన 20 మంది యువకులకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరికి గ్రామస్తులే ప్రథమ చికిత్స చేశారు. చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో పశువుల పండుగ పురస్కరించుకుని జల్లికట్టును వేడుకగా నిర్వహించారు. వేకువజామున పశువులను అందంగా అలంకరించి పూజలు చేశారు. పశువుల కొమ్ములకు చెక్కపలకలు, టవళ్లు కట్టారు. జల్లికట్టు వేడుకను తిలకించేందుకు చంద్రగిరి, యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, తిరుపతి రూరల్, తిరుపతి, రామచంద్రాపురం, పాకాల మండలాల నుంచి మహిళలు, యువకులు పెద్దఎత్తున హాజరయ్యారు. పశువులను పట్టుకునేందుకు యువత హైరానా పడ్డారు. పలు పశువులపై యజమానులు పందేలు నిర్వహించారు. పందేలు కాచిన పశువులను నిలువరించేందుకు యువకులు విశ్వప్రయత్నాలు చేశారు. కొంతమంది నిలువరించి కొమ్ములకు ఉన్న చెక్క పలకలను, టవళ్లను తీసుకుని విజయగర్వంతో పురవీధుల్లో చిందులు వేశారు. పోలీసులు, గ్రామపెద్దలు ఈ పోటీలు వద్దని సూచిస్తున్నా యువకులు మాత్రం పట్టించుకోకుండా ప్రతిఏటా ఆనవాయితీగా నిర్వహిస్తూనే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా పదివేల మందికి అన్నదానం చేశారు..

సంక్రాంతిని పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త, జిఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు తన స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా రాజాంలో సుమారు 15 వేల మందికి వస్త్రదానం చేశారు. జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యాన జిఎంఆర్ ఐటి ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పేదలతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచీ సాధువులు హాజరయ్యారు. భోగి రోజు రాత్రికే వీరందరూ రాజాం చేరుకోగా, వీరికి వసతి, భోజన సౌకర్యాలను కల్పించారు. సంక్రాంతి రోజు ఉదయం ఏడు గంటల వరకూ వచ్చిన పేదలకు ఫౌండేషన్ సభ్యులు టోకెన్లు అందజేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మహిళలకు చీర, దుప్పటి, పురుషులకు పంచె, దుప్పటిని మల్లికార్జునరావు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం ఎక్కువగా ఉందన్నారు. పేదల కళ్లలో ఎంతోకొంత ఆనందం నింపడానికే ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

తాను చేస్తున్న వస్త్రదానానికి ఇంతమంది పేదలు వస్తుంటే ఒకవైపు బాధగా ఉన్నా, వారికి ఎంతోకొంత సేవ చేసే అవకాశం కలిగినందుకు ఆనందంగానూ ఉందన్నారు. కార్యక్రమంలో జిఎంఆర్ కుటుంబసభ్యులతోపాటు జిఎంఆర్ విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు, జిఎంఆర్ ఫౌండేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.


మల్లికార్జునరావు అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

మల్లికార్జునరావు అంత్యక్రియలు

పేదల పక్షపాతి : మధు నివాళి

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

సిపిఎం సీనియర్ నాయకులు, గుంటూరు జిల్లా బాపట్ల డివిజన్ మాజీ కార్యదర్శి డాక్టర్ దొప్పలపూడి మల్లికార్జునరావు (77) అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. అస్వస్థతతో ఆయన సోమవారం రాత్రి 11 గంటలకు మృతి చెందారు. సిపిఎంలో సుదీర్ఘకాలంపాటు కొనసాగిన ఆయన బాపట్లలో 50 ఏళ్లుగా ప్రజావైద్యశాలను నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. బాపట్ల, కర్లపాలెం, కాకుమాను, చందోలుతో పాటు అనేక మండలాల ప్రజల్లో డాక్టర్ మల్లికార్జునరావు ప్రజావైద్యులుగా గుర్తింపు పొందారు. సిపిఎం అగ్రనాయకులు మోటూరు హనుమంతరావు, లావు బాలగంగాధరరావు, కొరటాల సత్యనారాయణ తదితరులతో కలిసి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ సైన్స్ మ్యూజియం, డార్విన్ గార్డెన్‌ను తన నివాసంలో ఏర్పాటు చేశారు. వీటన్నింటితోపాటు సైన్స్, మానవ ఆవిర్భావం, వైద్యునిగా తన జీవితంపైనా పలు పుస్తకాలు రచించారు. తాను మరణించాక తన భౌతికకాయంపై సిపిఎం జెండాను ఉంచాలని, అనంతరం దాన్ని ఇంట్లో భద్రంగా దాచాలని ఆయన గతంలోనే చెప్పినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. మల్లికార్జునరావుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, గుంటూరు తూర్పు, పశ్చిమ జిల్లాల కార్యదర్శులు పాశం రామారావు, గద్దె చలమయ్య, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ, వేగేశన ఫౌండేషన్ చైర్మన్ నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి నివాళులర్పించారు.


డాక్టర్ మల్లికార్జునరావును పేద ప్రజల పక్షపాతిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు అభివర్ణించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మల్లికార్జునరావు మృతికి ఆయన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. 'కార్మికవర్గానికి, పోరాడే ప్రజలకు ఆయన నిజమైన స్నేహితుడు. అంకితభావం కల మార్క్సిస్టు' అని నివాళులర్పించారు. స్వార్థరహితంగా పేదలకోసం మల్లికార్జునరావు సేవలు అందించారని, ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకుపోతామని పేర్కొన్నారు.


దగ్ధమవుతున్న బస్సు

బస్సును తగులబెట్టిన మావోయిస్టులు

ప్రజాశక్తి-చింతూరు (తూర్పుగోదావరి)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా గీదం పోలీస్‌స్టేషన్ పరిధిలో మావోయిస్టులు బుధవారం బస్సును తగులబెట్టారు. ఆ జిల్లా ఎస్‌పి అభిశిక్ పాల్వ్ కథనం మేరకు.. గీదం నుంచి సింగడ్ వెళ్తున్న ఒక ప్రయివేట్ బస్సును మావోయిస్టులు కాసోలి సిఎఎఫ్ క్యాంప్ సమీపంలో అడ్డగించారు. బస్సులో ప్రయాణికులను కిందికి దింపి డీజిల్ ట్యాంకును పగులగొట్టి తగులపెట్టారు. పోలీసు భద్రతా దళాలు రంగ ప్రవేశం చేసి, మావోయిస్టులను వెంబడించారు. ఈ క్రమంలో ముగ్గురు మావోయిస్టులు పట్టుబడ్డారని ఎస్‌పి తెలిపారు. వారి నుంచి కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

140 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పెదకాకాని (గుంటూరు జిల్లా)

గంజాయిని తరలిస్తున్న ముగ్గుర్ని గుంటూరు జిల్లా పెదకాకాని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను డిఎస్‌పి రామకృష్ణ బుధవారం వెల్లడించారు. కేరళ రాష్ట్రం కాసర్ గౌడ్ జిల్లా మీర్జా గ్రామానికి చెందిన వల్లి డిసౌజా, ఆర్.ఎస్.హరిజిత్, మహమ్మద్ ఫయాజ్ అనే ముగ్గురు అద్దెకు కారు తీసుకుని దానికి నకిలీ నబంర్ ప్లేట్‌ను అమర్చి తూర్పుగోదావరి జిల్లా తుని నుండి గంజాయిని తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందిన పోలీసులు వీరిని పెదకాకాని వై జంక్షన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. 70 ప్యాకెట్ల గంజాయి (140 కిలోలు) స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.4.5 లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

విశాఖ సమస్యలు పట్టని ఎమ్మెల్యేలు

- ఏడు సెగ్మెంట్లలో అపరిష్కృతంగా 'ప్రజా సమస్యలు'
- పట్టని ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర రాజకీయాల్లో విశాఖకు ప్రత్యేక స్థానముంది. విభజన తర్వాత ఆర్థిక రాజధానిగా వెలుగొందుతోంది. రాజకీయంగా కూడా చూసినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖకు అధిక ప్రాధాన్యమిస్తూ పర్యటనలు చేస్తున్నారు. పట్టణ మధ్యతరగతి నివాసముండే విశాఖ నగర రాజకీయాలను తనదైన శైలిలో ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తూ ప్రజాసమస్యలను పట్టించుకో వడం లేదు. విభజన హామీల అమలు ప్రభావం విశాఖపైనా పడింది. రాష్ట్రాన్ని కుదిపేసిన టిడిపి నేతల 'భూ కుంభకోణం', విశాఖకు రైల్వేజోన్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనుల సమస్య, డిసిఐ ప్రయివేటీకరణ, పోర్టు కాలుష్యం, సింహాచలం పంచ గ్రామాల సమస్య, అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు కాకపోవడం వంటివాటిని అమలు చేయలేక చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ డోలాయమానంలో పడింది. విశాఖ నగర పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పెద్ద ఎత్తున సమస్యలు తిష్ట వేశాయి. వీటిల్లో ఆరుగురు టిడిపికి చెందిన వారే (ఒక్క ఉత్తరంలో బిజెపి) 2014లో గెలుపొందారు.

తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం : ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబు (టిడిపి) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ భూ భాగోతాలు ఎక్కువ. సముద్ర తీరం చుట్టూ ఈ అసెంబ్లీ నియోజకవర్గం ఉంటుంది. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జెడ్) పరిధిలో ఉంది. కానీ బీచ్ చుట్టూ అక్రమ కట్టడాలతో వర్ధిల్లుతోంది. 2012 సంవత్సరం నాటి సిఆర్‌జెడ్ చట్టానికి తూట్లు పొడిచారు.

ఉత్తరం: అసెంబ్లీ సెగ్మెంట్‌లో జాతీయ రహదారి చుట్టూ ఈ అసెంబ్లీ సెగ్మెంట్ ఉంటుంది. ట్రాఫిక్ సమస్యలు అనేకం ఉన్నాయి. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాతీయ రహదారి ఉన్నా ఎక్కడా ఒక బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. 2012 నాటి బస్ షెల్టర్ హామీలను కూడా నిర్వహించలేదు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జాతీయ రహదారిలో నిర్మాణం జరిగితేనే ట్రాఫిక్ సమస్య ఈ సెగ్మెంట్‌లో పరిష్కారమవుతుంది.

పశ్చిమం: ఈ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రధానంగా జాతీయ రహదారిలోని ఎన్ఎడి కొత్తరోడ్డు వరకూ ఉంటుంది.. పెతకం శెట్టి గణబాబు (టిడిపి ఎమ్మెల్యే) ఎన్ఎడి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వ పథకాల్లో టిడిపి శ్రేణులకే దక్కడంతో ప్రజానీకంలో చర్చ జరుగుతోంది.

దక్షిణం: వైజాగ్ సిటీని అల్లాడిస్తున్న ప్రధాన సమస్యల్లో పోర్టు కాలుష్యం ఒకటి. అసెంబ్లీ సెగ్మెంట్ అంతా కాలుష్యంతో నిండి పోతోంది. ఏళ్లతరబడి పోర్టు నుంచి వెలువడే కాలుష్యంపై చర్యల్లేవు. వృత్తి రీత్యా



మత్స్యకారులే అత్యధికంగా నివసిస్తున్న సెగ్మెంట్ ఇది. ఈ సమస్యను సిట్టింగ్ టిడిపి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పరిష్కరించలేదు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐఎల్) ప్రయివేటీకరణకు కేంద్రం 2017లో పన్నిన కుట్రలపై సొంత నియోజకవర్గమైనా వాసుపల్లి, టిడిపి యావత్ పార్టీ నుంచి స్పందన లేదు. ఉద్యోగ, కార్మికులపై స్థానిక ఎమ్మెల్యే పట్ల నిరసన వ్యక్తమైంది.

గాజువాక: ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ప్రజా సమస్యలు కోకొల్లలుగా ఉన్నా టిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పట్టని రీతిన వ్యవహరిస్తున్నారు. తన తండ్రి గతంలో చేసిన భూ కబ్జాలకు ఆయన వత్తాసు పలుకుతున్నారు. గాజువాక పరిధిలో పరిశ్రమలు, కార్మికులు అధికం. ఇళ్ల సమస్య ప్రధానంగా వేధిస్తోంది. ప్రభుత్వ పరంగా ఇళ్లను మంజూరు చేయించడంలో పల్లాపై విమర్శలున్నాయి. ఇక్కడ పలు పరిశ్రమలతో సహా ఆర్ఐఎన్ఎల్ (స్టీల్‌ప్లాంట్) ఉంది. సొంత గనుల కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గనుల కేటాయింపు జరగడం లేదు. 2019 ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యాన ప్రజాసమస్యలపై ప్రణాళికలు వేస్తున్నాయి.

భీమిలి : ఈ నియోజకవర్గం నుంచి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భూ కబ్జాలకు ప్రధాన కేంద్రం ఇది. విశాఖలో రూ.20వేల కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రయివేటు భూములు కబ్జాకు గురయ్యాయి. మంత్రి గంటాపై భూకుంభకోణాలు, అవినీతికి సంబంధించి మరో మంత్రి అయ్యన్న పాత్రుడు ఆరోపణలు గుప్పించిన సందర్భాలున్నాయి. గడచిన నాలుగేళ్లలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగింది. ఇక్కడ మరో టిడిపి ఎంపి అవంతి శ్రీనివాస్ ఈసారి ఎమ్మెల్యేగా పోటీపడడంతో వీరిద్దరి మధ్య విభేదాలు రచ్చకెక్కాయి.


పెందుర్తి : నియోజకవర్గంలో సింహాచలం దేవస్థానం భూముల సమస్యను చంద్రబాబు ప్రభుత్వం వివాదాస్పదంగా మార్చేసింది. సిట్టింగ్ టిడిపి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిపై అవినీతి ఆరోపణలు, ఫార్మా కంపెనీ యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహ రిస్తారన్న విమర్శలున్నాయి. పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధితో వ్యవహరించ నందున బండారుపై రాజకీయంగా నీలినీడలు అలముకుంటున్నాయి.

మహోన్నతుడు బ్రదర్ జోసఫ్ తంబి

బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

ప్రజాశక్తి-ఉంగుటూరు

జోసఫ్ తంబి మహనీయులని విజయవాడ పీఠాధిపతులు రైట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు డిడి అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు పెదఅవుటపల్లిలో జరుగుతున్న తంబి 74వ వర్ధంతి మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బిషప్ రాజారావు మాట్లాడుతూ తంబి తన బోధనలను సామాన్య ప్రజలకు అందించి వారిని సరైన మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన జీవన శైలి అనుసరణీయమన్నారు. తొలుత పెదఆవుటపల్లి విచారణ గాయకబృందం ఆలపించిన గీతాలు అకర్షించాయి. తంబి ఆశ్రమం రెక్టర్ దేవదాసు దుగుట, ఇన్నబాబు పొలిమెరశెట్టి, జోసఫ్ పాలడుగు తదితరులు పాల్గొన్నారు. నూజివీడు సెయింట్‌పాల్స్ రీజినల్ సెమినరీ ఆధ్వర్యంలో డాక్టర్ కె.ఏలియ్య పర్యవేక్షణలో కోలాటం అందరినీ అలరించింది. ఫాదర్ ఇన్నబాబు పొలిమరశెట్టి ఆధ్వర్యంలో ప్రత్యేక


సమిష్టి దివ్యబలి పూజ నిర్వహిస్తున్న బిషప్ రాజారావు

ప్రార్థనలు నిర్వహించారు. మూడురోజుల పాటు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా గట్టి చర్యలు చేపట్టిన ప్రభుత్వ, స్వచ్ఛంద, ప్రయివేటు సంస్థలకు తంబి ఆశ్రమం రెక్టర్ ఫాదర్ దేవదాసు దుగుట కృతజ్ఞతలు తెలిపారు. రుద్రపాక ది అజిత ఆర్ట్స్ థియేటర్స్ నాట్యమండలిచే నిర్వహించిన గానకచేరి అందరినీ ఆకట్టుకుంది.

చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబుకు మంచి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని, ఆ రోజు దగ్గర్లోనే ఉందని టిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం భీమవరంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఆంధ్రులకు పెద్దపీట వేస్తున్నామని, తామంతా ఒక్కటిగానే వెళ్తున్నామని చెప్పారు. కొందరు తెలంగాణాలోని ఆంధ్రుల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టి బోల్తా కొట్టారని, వారికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరతామని అన్నారు. ప్రత్యేక హోదా కోసం ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమాలు జరిగిన రోజుల్లో తమ ఎంపీ కవిత ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవ్వాలని పార్లమెంట్‌లో ప్రస్తావించారని, అదే సమయంలో ప్రత్యేక హోదా సంజీవినీనా అన్న నాయకులు ఇక్కడున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు గ్లోబెల్ ప్రచారంలో ఆరితేరిపోయారని, ఆయన ఆబద్దాలను భరించలేకే టిడిపిని వీడానని ఆయన పేర్కొన్నారు. నందమూరి కుటుంబాన్ని చంద్రబాబు మొదటి నుండి వాడుకుంటూనే ఉన్నారని, హరికృష్ణ మీద ప్రేముంటే ఆయన కుమార్తె సుహాసినికి ఎంఎల్‌సి ఇచ్చి మంత్రి పదవిస్తే అందరూ హర్షించేవాళ్లని అన్నారు.

సంపాదకీయం

జవాబుదారీతనం ఏదీ?


సిబిఐ, సివిసి వంటి ప్రతిష్టాత్మక సంస్థల కేంద్రంగా కొంత కాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకదాని తరువాత ఒకటిగా రాజ్యాంగ వ్యవస్థలను ఘోరంగా దెబ్బతీస్తున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాలూ వాటి కొనసాగింపే! అత్యున్నత సంస్థల గౌరవాన్ని, స్వతంత్రతను, రాజ్యాంగ విలువలను కాపాడాలన్న చిత్తశుద్ధికి బదులుగా వాటిని స్వార్థానికి, ఆశ్రిత జన పరిరక్షణకు వినియోగించాలన్న తపనే ఈ దుస్థితికి కారణం. పైగా సాక్షాత్తూ ప్రధానమంత్రిపైనే ఆరోపణలు వస్తున్న రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోళ్ల డొంక కదులుతుందన్న సంకేతాలు వచ్చిన తరువాత ఈ మాత్రం కలగాపులగం చేసి, గందరగోళం సృష్టించకుండా ఉంటే అది మోడీ సర్కారు ఎందుకవుతుంది? సిబిఐ వ్యవహారమే చూద్దాం! రెండు సంవత్సరాల క్రితం అలోక్‌వర్మను ఆ సంస్థకు డైరక్టర్‌గా నియమించింది నరేంద్రమోడీ ప్రభుత్వమే! అప్పట్లో అత్యున్నత కమిటీలో ఉన్న విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆ నియమాకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రాత పూర్వకంగా తన అభ్యంతరాన్నీ తెలియచేశారు. అలోక్‌వర్మ వ్యవహారతీరు తమకు వ్యతిరేకంగా మారుతుందన్న అనుమానం కలగగానే గతంలో ఎన్నడూ లేని విధంగా సిబిఐలో రెండవ స్థానాన్ని సృష్టించి రాకేష్ ఆస్థానాను అక్కడ ప్రతిష్టించిందీ మోడీ సర్కారే! వారిద్దరి మధ్య విబేధాలను సాకుగా చూపి అలోక్‌వర్మను సాగనంపడానికి వాడుకున్న చీఫ్ విజిలెన్స్ కమిషనర్‌నూ నియమించింది మోడీ ప్రభుత్వమే! వ్యవహారం అత్యున్నత న్యాయస్థానానికి చేరడంతో సుప్రీం కోర్టు న్యాయమూర్తులకూ ఆ మకిలి అంటించారు! లేకుంటే, విచారణను పర్యవేక్షించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పట్నాయక్ చూడకుండానే సివిసి నివేదిక ప్రధానికి చేరడమేంటి? ఆ నివేదికతో తనకు ఎటువంటి సంబంధం లేదని పట్నాయక్ ప్రకటించడమేంటి? ఆయన విడిగా ఇచ్చిన నివేదిక ఎక్కడుందో తెలియని పరిస్థితి ఏర్పడటమేంటి? మరోవైపు హైపవర్ కమిటీలో మోడీ గొంతుతో శృతి కలిపిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎకె సిక్రి నిబద్దత సైతం ప్రశ్నార్ధకంగా మారడం ఏమిటి? ఇప్పుడు ఆ కమిటీలో సభ్యత్వమంటేనే సుప్రీం న్యాయవాదులు బెంబేలెత్తడమేంటి?

ఈ ప్రశ్నలే అత్యున్నత సంస్థల పారదర్శకతను, జవాబుదారీతనాన్ని చర్చనీయాంశం చేశాయి. సిబిఐ, సివిసి వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలు పార్లమెంటుకో, సుప్రీంకోర్టుకో జవాబుదారిగా ఉంటాయనుకుంటే పొరపాటే! ఎవరు అధికారంలో

ఉంటే వారి అదుపాజ్ఞల్లోనే ఈ సంస్థలు కొనసాగుతున్నాయి. 1997కు ముందు అధికారంలో ఉన్న ప్రభుత్వమే సిబిఐ, సివిసిల చీఫ్‌లను నియమించేది. పేరుకు ప్రభుత్వమని చెప్పినప్పటికీ ప్రధానమంత్రి కన్నుసన్నల్లోనే ఈ తరహా కీలక నియమాకాలు జరిగేవి. వలస పాలన నాటి విధానాల కొనసాగింపుగా ఈ ప్రక్రియ జరిగేది. 1990లో తెరమీదకు వచ్చిన జైన్ హవాలా కేసులో సిబిఐ విశ్వసనీయత ప్రశ్నార్ధకంగా మారడంతో 1997లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రస్తుత త్రిసభ్య విధానం అమలులోకి వచ్చింది. ఈ తీర్పులోనే అత్యున్నత న్యాయస్థానం సిబిఐ డైరక్టర్ పదవి కాలం రెండు సంవత్సరాలు మాత్రమే ఉండాలని, సిబిఐ పనిని చీఫ్ విజిలెన్స్ కమిషన్ పర్యవేక్షించాలని పేర్కొంది. అదే సమయంలో చీఫ్ విజిలెన్స్ కమిషనర్‌ను 'అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన ప్రభుత్వ ఉద్యోగులు (అవుట్‌స్టాండింగ్ సివిల్ సర్వెంట్స్) నుండి మాత్రమే ఎంపిక చేయాలని నిర్ధేశించింది. ఈ తీర్పు అమలులోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు ఒక్క సిబిఐ డైరక్టర్ కూడా ఏకాభిప్రాయంతో ఎంపిక కాలేదు. అస్మదీయులకే సిబిఐ, సివిసిల చీఫ్‌ల పదవులు దక్కుతున్నాయన్న విమర్శలు కొనసాగుతున్నాయి. పేరుకు త్రిసభ్య కమిటీ ఉన్నప్పటికీ, ఏలినవారి మాటే చెల్లుబాటవుతుందనడానికి ఇదే నిదర్శనం. తాజా పరిణామాలు కూడా దీనినే ధృవీకరిస్తున్నాయి. సిబిఐకి సొంత సిబ్బంది శూన్యం! ఐపిఎస్ అధికారులనే డిప్యూటేషన్‌మీద సిబిఐలో నియమించే పరిస్థితే నేటికీ కొనసాగుతోంది. వీరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభుత్వంమీదే అధారపడాల్సిరావడంతో సిబిఐ స్వతంత్రత కాగితాలకే పరిమితమవుతోంది. 1946 నాటి ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం (డిఎస్‌పిఇ) పరిధిలోనే నేటికీ విధులు నిర్వహించాల్సి రావడం సిబిఐకి ఉన్న మరో బలహీనత!

మోడీ సర్కారు హయంలో కోల్పోయిన ప్రతిష్టను తిరిగి పొందాలంటే ఈ బలహీనతలన్నింటిని సిబిఐ అధిగమించాల్సిఉంది. సిబిఐలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలన్నింటిపైనా సమగ్ర, స్వతంత్ర దర్యాప్తు జరపాలి. ఎవరు బాధ్యులో నిర్ధారించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికో, ప్రభుత్వంలో చక్రం తిప్పే ఒక వ్యక్తికో వ్యవస్థలన్నీ మోకరిల్లే ప్రస్తుత విధానానికి భిన్నంగా అత్యున్నత ప్రజాసభయైన పార్లమెంటుకో, లేదా న్యాయవ్యవస్థకో ఆ సంస్థలను బాధ్యులను చేయాలి. ఈ మేరకు ఒక సమగ్ర చట్టాన్ని రూపొందించాలి. ఈ చట్టాన్ని తయారు చేసే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలను, రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను, ప్రజాతంత్ర సంస్థలను భాగస్వాములను చేయాలి. విశ్వసనీయత పొందడంతో పాటు, అవినీతి, అక్రమాలపై నిష్పక్షపాతంగా ఉక్కుపాదం మోపడమే ఈ చట్టం లక్ష్యం కావాలి. దీనికోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ఒక్కటే మార్గం!

ఇదీ విషయం




పొలాల నన్నీ హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
విరామమెరుగక పరిశ్రమించే
బలం ధరిత్రికి బలి కావించే
కర్షక వీరుల కాయం నిండా
కాలువకట్టే ఘర్మజలానికి,
కర్మజలానికి ఖరీదు లేదోయ్

- మహాకవి శ్రీశ్రీ

మీ మద్దతు నాకిప్పుడు కావాలి

సందర్భం



ఆనంద్ తెల్తుంబే

నేను అహమ్మదాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థిని. ఐఐటి ప్రొఫెసరును. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నాను. పెట్రోనెట్ ఇండియాకు గతంలో మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సిఇవోగా పని చేశాను. 26 పుస్తకాలు రచించాను. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీకి కాలమిస్టును. కులం-వర్గం, సామాజిక అంశాలు, ప్రభుత్వ విధానాలపై అసంఖ్యాకంగా వ్యాసాలు రాశాను. ఒక మేధావిగా, ప్రజాతంత్ర హక్కుల కోసం, విద్యా హక్కు కోసం కృషి చేస్తున్నాను. అటువంటి నేను ఈ రోజు 'అర్బన్ మావోయిస్టు'గా ముద్రపడి అరెస్టయ్యే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాను. స్వతంత్రానంతర భారతదేశంలో ప్రభుత్వం పన్నిన అతినీచమైన కుట్ర ఇది. మీ మద్దతు నాకిప్పుడు కావాలి.

నాపై పూనే పోలీసులు దాఖలు చేసిన తప్పుడు ఫిర్యాదును ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని నేను చేసుకున్న అభ్యర్థనను 14-1-2019న సుప్రీంకోర్టు తిరస్కరించిన సంగతి మీడియా ద్వారా మీకు ఈ పాటికే తెలిసివుంటుంది. అదే ఉత్తర్వులో నాకు ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి నాలుగు వారాల వ్యవధిని ఇచ్చారు. ఇంతవరకూ నేను పూనే పోలీసులు నాపై మోపిన ఆరోపణలన్నీ కల్పితాలేనని, కట్టుకథలని, కుట్రపూరితంగా ఈ కేసును నాపై బనాయించారని కోర్టులో రుజువు చేసుకోగలుగుతానన్న విశ్వాసంతో ఉన్నాను. అందుకే మిత్రుల సహాయాన్ని ఇంతవరకూ కోరలేదు. నా నమ్మకం వమ్మైంది. ఇప్పుడు పూనే లోని సెషన్స్ కోర్టు స్థాయి నుండి సుప్రీంకోర్టు స్థాయి వరకు ఎక్కడో ఒక దగ్గర బెయిలు తెచ్చుకోడానికి స్వల్ప వ్యవధి మాత్రమే నా వద్ద మిగిలింది. నన్ను అరెస్టు చేసే ప్రమాదం నుంచి కాపాడుకోడానికి అందరి దృష్టిలోనూ పడేలా ఒక బలమైన ప్రచార ఉద్యమాన్ని నడిపి వివిధ తరగతుల ప్రజానీకం నుండి మద్దతు సేకరించాల్సిన తరుణం వచ్చింది.



నాతో పాటు నిందితులైన మరో తొమ్మిదిమంది ఇప్పటికీ జైలులో ఉన్నారు. చట్టపరమైన ప్రక్రియల వేధింపులకు గురవుతున్నారు. మీ అందరి సహకారమూ మద్దతూ కోరే అవకాశం నాకు వచ్చిన విధంగా వారికి రాలేదు. మీరు ఇప్పుడు నాకు అండగా నిలిస్తే అది కేవలం నాకు, నా కుటుంబ సభ్యులకు మాత్రమే గాక మా అందరికీ తోడ్పడుతుంది. మీరు ఈ దేశంలో పాలిస్తున్న ఫాసిస్టు మూకలను ఎదిరించి నిలిచే వారున్నారన్న స్పష్టమైన సందేశం ఇచ్చినవారౌతారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద అరెస్టవ్వడమంటే సంవత్సరాల తరబడి నిర్బంధానికి, వేధింపులకు గురవడమేనని మనలో చాలా మందికి బహుశా తెలియదేమో. ఒక కరుడుగట్టిన నేరస్తుడు సైతం ఒకటో, రెండో సంవత్సరాల శిక్షతో బైటపడే వీలుంది. కాని ఈ చట్టం కింద అరెస్టయితే ఏ నేరమూ చేయని వ్యక్తి సైతం సంవత్సరాల తరబడి జైలులోనే మగ్గిపోతాడు. రాజకీయ నేతల ఆదేశాల ప్రకారం ఈ చట్టం కింద కేసును బనాయించిన పోలీసులు తమ వద్ద తగిన సాక్ష్యాధారాలున్నాయన్న ప్రకటనలో నిరపరాధులను సైతం ఏళ్ల తరబడి జైలులోనే ఉంచే వీలుంది. నేను అరెస్టుకు భయపడడం లేదు. కాని నా లైబ్రరీలోని పుస్తకాలు నా జీవితంలో విడదీయలేని భాగం అయిపోయాయి. సగం సగం రాసుకున్న రాత ప్రతులు, పరిశోధనా వ్యాసాలు, ప్రచురణకర్తలకు రాసి పంపుతానని అంగీకరించిన గ్రంథాల ప్రతులు, నా ల్యాప్‌టాప్-ఇవన్నీ కూడా నా జీవితంలో విడదీయలేని భాగాలైపోయాయి. ఎందరో రీసెర్చి విద్యార్థులు నా వద్ద గైడెన్సుకు రిజిస్టరు చేసుకున్నారు. వారికి నేనిస్తున్న గైడెన్సు మధ్యలో ఆగిపోయి వారి భవిష్యత్తుకూ నష్టం కలుగుతుంది. నా కార్యకలాపాలపై మా సంస్థ పెట్టిన ఖర్చు వృథా అవుతుంది. నన్ను బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ లోకి తీసుకున్న సంస్థలకూ ఇబ్బంది కలుగుతుంది. అసంఖ్యాకంగా ఉన్న నా మిత్రులకు దూరం అవుతాను. నా కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా నా భార్యకు (ఆమె బాబాసాహెబ్ అంబేద్కర్ మనుమరాలు) నా కుమార్తెలకు ఇబ్బంది కలుగుతుంది. 2018 ఆగస్టు నుంచీ నాకేమీ కానున్నదో అన్న ఆందోళనలో వారంతా ఇప్పటికీ తీవ్ర మనోవేదనకు లోనై వున్నారు. నేను నిరుపేద కుటుంబం నుండి వచ్చాను. నా మేధో కృషితో దేశంలోని అత్యుత్తమ సంస్థలలో చదువుకోగలిగాను. ఐఐఎం, అహమ్మాదాబాద్‌లో చదువుకున్న వాడిగా నేను చాలా సుఖవంతమైన జీవితం గడిపే వీలుంది. అయితే చుట్టూ వున్న సమాజంలో జరుగుతున్న అవకతవకలను నేను విస్మరించలేకపోయాను. అందుకే నేను, నా కుటుంబం సాధారణ జీవితం గడపడానికి సరిపడా మాత్రమే సంపాదించి తక్కిన సమయంలో నా మేధోపరమైన కృషి ద్వారా నేను నివసిస్తున్న రాష్ట్రంలో నా చుట్టూ వున్న ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాలను సరిచేయడానికి కృషి చేస్తున్నాను. ఈ రకమైన నా దృక్పథం వలనే నేను విద్యార్థి దశలో ఉన్న కాలం నుండే పౌర హక్కుల సంఘంలో భాగస్వామినయ్యాను. ప్రస్తుతం దాని ప్రధానకార్యదర్శిగా ఉన్నాను. విద్యా హక్కు కోసం ఏర్పడిన అఖిలభారత వేదిక అధ్యక్షవర్గ సభ్యుడిగా కూడా ఉన్నాను. నా అసంఖ్యాకమైన రచనలలో గాని, నిస్వార్థపూరితమైన కార్యకలాపాలలో గాని చట్ట వ్యతిరేకమైనదేదీ ఇసుమంతైనా లేదు. నా యావత్తు విద్యా సముపార్జన దశలోగాని, నాలుగు దశాబ్దాలు సాగిన నా ఉద్యోగంలో గాని ఒక్క మచ్చ కూడా లేదు. అత్యున్నత స్థాయి నిజాయతీతో, నిబద్ధతతో నేను వ్యవహరించాను. అందువలన ఈ రాజ్యం, ఈ రాజకీయ వ్యవస్థ నన్ను ఒక నేరస్తుడిగా అతి నీచమైన రీతిలో ముద్రవేసి నిలబెడతాయని నేను కలలో కూడా ఊహించలేదు. ఈ దేశంలోని రాజ్య వ్యవస్థ అమాయకులైన పౌరులను నేరగాళ్లుగా చిత్రీకరించి అసలైన దొంగలను, దోపిడీదారులను రక్షిస్తూ, తీవ్ర అసమానతలకు కారణం అవుతోంది. గత సంవత్సరం జరిగిన 'ఎల్గర్ పరిషత్' అనే అత్యంత నిరపాయకరమైన కార్యక్రమాన్ని సైతం ఒక నేరపూరితమైన కుట్రగా మార్చి వేసింది ప్రభుత్వం. అందులో మానవ హక్కుల ఉద్యమకారులు, మేధావులు, ప్రజా ఉద్యమాల ప్రతినిధులు పాల్గొన్నారు. కాని ప్రభుత్వానికి అందులో కుట్ర మాత్రమే కనపడింది! తనను వ్యతిరేకించే వారిపై అత్యంత నీచమైన తీరులో ప్రభుత్వమే కుట్ర పన్ని కేసుల్లో ఇరికించడం కనీస ప్రజాస్వామ్య విలువలు కూడా లేవనడానికి సంకేతం.

ఇప్పుడీ కేసు ఒక ముఖ్యమైన ఘట్టానికి చేరింది. నేను అమాయకంగా పెట్టుకున్న నమ్మకాలన్నీ వమ్మయ్యాయి. అరెస్టు తప్పదన్న పరిస్థితిలో నేను హతాశుడినై వున్నాను. నాతో పాటు నిందితులైన మరో తొమ్మిదిమంది ఇప్పటికీ జైలులో ఉన్నారు. చట్టపరమైన ప్రక్రియల వేధింపులకు గురవుతున్నారు. మీ అందరి సహకారమూ మద్దతూ కోరే అవకాశం నాకు వచ్చిన విధంగా వారికి రాలేదు. మీరు ఇప్పుడు నాకు అండగా నిలిస్తే అది కేవలం నాకు, నా కుటుంబ సభ్యులకు మాత్రమే గాక మా అందరికీ తోడ్పడుతుంది. మీరు ఈ దేశంలో పాలిస్తున్న ఫాసిస్టు మూకలను ఎదిరించి నిలిచే వారున్నారన్న స్పష్టమైన సందేశం ఇచ్చినవారౌతారు.

అందువలన మీరు సంతకాల సేకరణ, పత్రికా ప్రకటనలు, వ్యాసాలు, మరే ఇతర పద్ధతుల ద్వారానైనా గాని మీ ఆగ్రహాన్ని, నిరసనను, అభ్యంతరాన్ని ప్రకటించి ఈ ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టడానికి ముందుకు రావాలని కోరుతున్నాను.

పెరుగుతున్న నిరుద్యోగం లెక్కల తారుమారుకు బిజెపి తిప్పలు

సమీక్ష



ఎన్‌డి టివి సేకరించిన లేబర్‌బ్యూరో గణాంకాలు

సంవత్సరం	నిరుద్యోగం మొత్తంగా (శాతంలో)	పట్టణాల్లో (శాతంలో)	గ్రామంలో (శాతంలో)	పురుషులు (శాతంలో)	మహిళలు (శాతంలో)
2011-12	3.8	5	3.4	2.9	6.9
2012-13	4.7	5.7	4.4	4	7.2
2013-14	4.9	5.5	4.7	4.1	7.7
2014-15	--	--	---	---	---
2015-16	5	4.9	5.1	4	8.7
2016-17	5.4	6.1	5.2	4.3	9.2

ఎంవిఎస్ శర్మ

బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత లేబర్ బ్యూరో జరిపే నిరుద్యోగ సర్వేలను 2016 నుంచి నిలిపివేసింది. కారణం అడిగితే నీతిఆయోగ్ ఇచ్చిన సమాధానంలో పాత సర్వేలు లోపభూయిష్టంగా ఉన్నాయని, ఆ లోపాలను సరి చేసి జూన్ 2018 కల్లా కొత్త సర్వే వివరాలను వెల్లడిస్తామని ప్రకటించారు. కానీ ఇంతవరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు.

ఇదిలా ఉండగా ఎన్‌డి టివి ఛానెల్ విలేకరి కేంద్ర లేబర్ బ్యూరో నిర్వహించిన సర్వే వివరాలను సేకరించారు. లేబర్ బ్యూరో ఈ వివరాలను 2017 లోనే సేకరించినా వీటిని ప్రచురించకుండా నిలిపివేసింది కేంద్ర ప్రభుత్వం. ఈ సర్వే ఎందుకు నిలిపివేశారో తెలుసు కోవడానికి ఆ విలేకరి ప్రయత్నించినా లేబర్‌బ్యూరో అధికారులు గాని, నీతిఆయోగ్ అధికారులు గాని ఎవరూ స్పందించడానికి సిద్ధపడలేదు.

2016 ఆగస్టు నుంచి 2017 మార్చి మధ్య కాలానికి సంబంధించిన ఆ సర్వేలో నిరుద్యోగం గడచిన ఆరేళ్లలోనూ గరిష్ట స్థాయికి చేరినట్టు ఉంది. సర్వే జరిగిన కాలం నోట్ల రద్దు తర్వాత కాలం అయినందున నోట్ల రద్దు పెద్ద ఎత్తున నిరుద్యోగానికి దారితీసిందన్న వాదనలకు బలం చేకూరినట్లైంది. బహుశా ఇందుకే ఈ నివేదికను ప్రచురించకుండా ప్రభుత్వం నిలిపివేసిందనీ భావించవచ్చు.

దీనికి తోడు ఇటీవల 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సి.ఎం.ఐ.ఇ)' అనే స్వతంత్ర అధ్యయన సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైన విషయాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ధృవపరుస్తు న్నాయి.

ఒక్క 2018 సంవత్సరం లోనే ఒక కోటీ పదిలక్షల ఉద్యోగాలు పోయాయని అందు లో 22 లక్షల ఉద్యోగాలను పురుషులు కోల్పోగా, 88 లక్షల ఉద్యోగాలను మహిళలు కోల్పోయారని సి.ఎం.ఐ.ఇ వెల్లడించింది.

ఒక పక్క కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగానికి సంబంధించిన గణాంకాలు లేవని ప్రకటిస్తుంటే, ఒక స్వతంత్ర సంస్థగా ఉన్న సి.ఎం.ఐ.ఇ రెగ్యులర్‌గా గణాంకాలను విడుదల చేయ గలుగుతోంది.


'గణాంకాల సేకరణ విభాగాల స్వతంత్రతకు ముప్పు' : ప్రొఫెసర్ జయతి ఘోష్

మోడీ ప్రభుత్వం నిరుద్యోగం, పేదరికం వంటి వివిధ అంశాల అధ్యయనానికి తోడ్పడే గణాంకాల విభాగాలను స్వతంత్రంగా పని చేయనివ్వడం లేదని ప్రొఫెసర్ జయతిఘోష్ విమర్శించారు. గణాంకాలు వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి ఉపయోగ పడతాయని, ఆ వివరాల ఆధారంగా ఒక శాస్త్రీయ పద్ధతిలో ప్రణాళికలు రూపొందించడానికి, ప్రాధాన్యతా క్రమంలో వనరులను కేటాయించడానికి వీలవుతుందని ఆమె తెలిపారు. ఆ శాఖల పని విధానంలో జోక్యం చేసుకుని వాస్తవాలను వెలికిరానీయకుండా చేయటం మోడీ ప్రభుత్వానికి తగదని ప్రొ။ఘోష్ అన్నారు.

సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అదనంగా కల్పిస్తా మన్నది బిజెపి 2014లో చేసిన వాగ్దానం. ఆ లెక్కన 8 కోట్ల ఉద్యోగాలు అదనంగా ఇప్పటికే కల్పించి వుండాలి. అలా చేయకపోగా ఉన్న ఉద్యోగాలే ఊడిపోతున్నాయి. ప్రభుత్వ శాఖల్లో సైతం లక్షలాది ఖాళీలు ఉన్నా, వాటిని కూడా భర్తీ చేసేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. పైగా వాస్తవాలను కప్పిపుచ్చేందుకు, వక్రీకరిం చేందుకు నానా తంటాలూ పడుతోంది.

ఆధునిక విజ్ఞానానికీ వేదాలకూ సంబంధం లేదు


కామన్ సెన్స్



డా॥ దేవరాజు మహారాజు

ఆధునిక విజ్ఞాన శాస్త్రానికీ వేదాలకూ, పురాణ గ్రంథాలకూ ఏదో ఒక గట్టి సంబంధం ఉందని హిందూ మత జాతీయవాదులు ప్రచారం చేస్తుంటారు. పూర్వ కాలపు భారతీయ రుషులు అందించిన గొప్ప ఆధ్యాత్మిక జ్ఞానం ముందు పశ్చిమ దేశాల నుండి మనకు అందిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఏ మాత్రం గొప్పది కాదని చెబుతుంటారు. వీళ్లు చెప్పే మాటలకు భారతీయులంతా రొమ్ము విరుచుకుని గర్వపడాలని, విదేశీయులంతా అసూయతో కుళ్లుకోవాలని వారు భావిస్తుంటారు. కానీ, అది జరిగేది కాదు. ప్రపంచ దేశాలన్నింటి నుండి కొత్తకొత్త ఆవిష్కరణలు ఒక్కచోటికి చేరి, అది ఆధునిక విజ్ఞానంగా మారి విశ్వమానవాళికి అందుబాటులోకి వచ్చింది. ఇంకా వస్తూనే ఉంది. వస్తూనే ఉంటుంది. చాలా ముఖ్యమైన వైజ్ఞానిక పరిశీలనలు తొలి దశలో అరబిక్, ఇండియా, చైనా నాగరికతల నుండి కొంత మేరకు వెలువడ్డాయన్నది నిజం. కానీ ప్రపంచం ప్రగతి పథంలోకి నడవడానికి అది మాత్రమే సరిపోలేదు. యూరోప్ దేశాల నుండి 16, 17 శతాబ్దాలలో వైజ్ఞానిక పరిశోధనల వెల్లువ హోరెత్తింది. ఆ ఫలితాలు క్రమంగా తూర్పు దేశాలకు కూడా అందాయి. ఇదీ వాస్తవం. దీన్ని పక్కనబెట్టి అన్ని రంగాలలో భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలబడిందనడం కేవలం అతిశయోక్తి. ఈ అతిశయోక్తుల వల్ల జరిగే ప్రమాదమేమంటే భారతదేశం చేసిన కృషికి కూడా విలువ లేకుండా పోతోంది. ఈ దేశంలోని ఆధ్యాత్మిక చింతనకు, లలిత కళలకు, క్రికెట్ ఆటకు తప్పకుండా ప్రత్యేకత ఉంది. వాటితో దేశానికి గుర్తింపు వచ్చింది నిజమే. బాధ్యతతో సృజించిన సాహిత్యం జన చైతన్యానికీ, మిగతావి జనాన్ని రంజింపజేయడానికి ఉపయోగపడ్డాయి. కానీ దేశం ప్రగతి బాటలో నడవడానికి ఇవేమీ నేరుగా ఉపయోగపడలేదు. ఉపయోగపడవు కూడా! వందల ఏళ్ల దేశం, బ్రిటిష్ సామ్రాజ్యంలో ఒక భాగంగా ఉంది గనుక, ఇక్కడి ప్రతిభావంతులకు ఇంగ్లాండ్‌లో చదువుకోవడానికి వీలైంది. అందుకే ఆ కాలంలో ఎక్కువ మంది బారిస్టర్లై తిరిగొచ్చారు. తర్వాత కాలంలో వీళ్లంతా స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొన్నారు. కానీ వైజ్ఞానికుల సంఖ్య ఎప్పుడూ తక్కువే. మనకు ఒక్క సివి.రామన్ తప్ప నోబెల్ సాధించిన భారతీయ వైజ్ఞానికులు మరొకరు లేరు. మరి కొంతమంది భారతీయులు నోబెల్ సాధించినా, వారంతా విదేశాల పౌరసత్వం స్వీకరించి అక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకున్నవారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలో వైజ్ఞానిక స్పృహ వ్యాపింపజేయాలన్న పట్టుదలతో తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వైజ్ఞానిక పరిశోధనలను ప్రోత్సహించారు. ఇప్పుడున్న జాతీయ సంస్థలన్నీ దాదాపు ఆయన ప్రారంభించినవే. అయితే ఇప్పటి ప్రభుత్వం వాటికి నిధులు కూడా ఇవ్వలేని హీనస్థితికి జారిపోయింది. పైగా శాస్త్రవేత్తలు ప్రాచీన కాలం నాటి రుషుల్ని ఆదర్శంగా తీసుకోవాలని నేటి ప్రభుత్వ పెద్దలు ప్రబోధిస్తున్నారు. వాస్తవంగా ఇదీ దేశంలోని పరిస్థితి. వైజ్ఞానిక స్పృహలేని ప్రభుత్వాలు ఏవైనా ఉన్నాయంటే అవి కంటి చూపు కోల్పోయిన ప్రభుత్వాలని జనం ఇప్పుడు గుర్తిస్తున్నారు.

ఈ దేశంలో కొందరు ఆధ్యాత్మిక వేత్తలు, యోగులు పుట్టారు. జనాన్ని ప్రభావితం చేశారు. నిజమే కానీ, వారి బోధల వల్ల దేశం ఆధునిక యుగంలోకి రాలేదు. వారి వల్ల ఆర్థిక ప్రణాళికలు రూపొందలేదు. ప్రాజెక్టులు కట్టబడలేదు. నూతన వ్యవసాయ పద్ధతులు కనుగొనబడలేదు. విద్య, వైద్యం అందరికీ అందుబాటులోకి రాలేదు. 'మనదైన మన గొప్ప సంస్కృతి' అనే పేరుతో కాలాన్ని, దేశాన్నీ వెనక్కి నడిపించే హక్కు ఎవరికీ లేదు. మనం ఇరవై ఒకటవ శతాబ్దంలోకి వచ్చామంటే ఆధునికయుగ వైజ్ఞానిక స్పృహతోనే వచ్చాం. ఈ దేశంలో ఆధ్యాత్మిక సంస్కృతి, పురాతన సంస్కృతి, జానపద సంస్కృతి వంటివి వర్ధిల్లుతూ వచ్చాయని ఒప్పుకుందాం. వాటి ప్రత్యేకతలను గుర్తుంచుకుందాం. అంతవరకే... కానీ, వాటినే ఇంకా కొనసాగిద్దామనుకోవడం తెలివితక్కువతనం అవుతుంది. చార్మినార్ కుతుబ్ మినార్ లాంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించు కుంటాం. గతాన్ని నెమరువేసుకుంటాం... అంతే. మన ఇస్రో రాకెట్ ప్రయోగాలను చూసి



ఎవరైనా తాము ఆధ్యాత్మిక శక్తితో పుష్పక విమానాల్లో తిరుగుతామంటే ఎవరు కాదన్నారు? స్త్రీ అండాలను కుండల్లో వేసి పిల్లల్ని పుట్టిస్తామంటే ఎవరు కాదన్నారు? నీటిలో తేలే రాళ్లతో నదుల మీద, సముద్రాల మీద, వంతెనలు కడతామంటే ఎవరు వద్దన్నారు? ప్రజా ధనం మిగులుతుంది. దేశానికి మేలు జరుగుతుంది. ఇంతెందుకు పొద్దున్నే టీ, కాఫీలు తాగమని వీరికి ఏ రుషులు చెప్పారో మరి? సనాతన రుషి వారసత్వాన్ని కొనసాగించాలంటే గోచీలు పెట్టుకోవాలి గానీ, ఆధునిక వస్త్రధారణ దేనికీ? మనం ఆక్సిజన్ పీల్చుకొని, కార్బన్ డై ఆక్సైడ్ వదిలేస్తున్న సమాచారం వేదాల్లో ఎందుకు లేదు. పోనీ ఆక్సిజన్ హైడ్రోజన్‌ల కలయిక వల్ల నీరు తయారైందన్న ప్రాథమిక సమాచారం కూడా ఇవ్వని వేదాలు ఆధునికుడికి ఎలా ప్రామాణికమవుతాయి? కట్టు కథలు చెప్పే ఇలాంటి మహా ఉపన్యాసకులు పెద్ద పదవుల్లో ఉన్నా సరే... కుహనా మేధావుల కట్టుకథలను బాధ్యత గల పౌరులు పట్టించుకోకపోవడమే మంచిది.

గర్వపడతాం. ఎందుకంటే వాటివల్ల ఆధునిక జీవనానికి మేలు జరుగుతూ ఉంది కాబట్టి. గతం ఒక పర్యాటక కేంద్రం. ప్రస్తుత వాస్తవమే నివాస యోగ్యం. మనం ఆ తేడాను గ్రహించవలసి ఉంది. ప్రధానితో సహా, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీల వంటి రాజకీయ నాయకులు వారితో ఏవో ప్రయోజనాలు ఆశించే గవర్నర్లు, జడ్జీలు, వైస్ చాన్సలర్లు, అధికారులు ఆత్మద్రోహం చేసుకుంటూ జనం మీదికి మూఢ విశ్వాసాల్ని వదులుతున్నారంటే దేశాన్ని వెనక్కి నడిపిస్తున్నారనే అర్థం! జనం చైతన్యవంతులయ్యారని, ప్రతిదీ విశ్లేషించుకుంటు న్నారని వీరు గ్రహించరు.

పదవితో ఎవరూ గొప్పవాళ్లు కాలేరు. సరైన దృక్పథంతోనే అవుతారు. ఇప్పటి తరాన్నే కాదు, భవిష్యత్తు తరాల్ని కూడా ప్రభావితం చేయగలవారే దార్శనికులవుతారు. దార్శనికులు కావడం తర్వాత సంగతి, ముందు వీళ్లు మనుషులైతే చాలు సంతోషిద్దాం! ఆధ్యాత్మికత పేరు చెప్పి, యోగాకు ఒక ప్రపంచ దినాన్ని కేటాయించి ఈ దేశం ప్రపంచానికి 'సద్గురువు' అని చెప్పుకోలేం. ఏసీ హాళ్లలో మీటింగ్‌లు ఏర్పాటు చేసుకొని, మంచి ఇంగ్లీషులో, మంచి యాసలో మూఢ నమ్మకాల్ని చాలా చక్కగా ప్రబోధిస్తున్న సద్గురువులను కళ్ల ముందు చూస్తూనే ఉన్నాం. ఎవరైతే ఇంగిత జ్ఞానాన్ని కోల్పోతారో వారే జ్ఞాన బోధలు చేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల జనానికి నష్టమే తప్ప లాభం చేకూరదు. ఎంతటి వారైనా సరే, విచక్షణాజ్ఞానం లేని వారు వివేకవంతులు కారు. దేశంలో తిరోగమన సిద్ధాంతానికి పెద్ద పీట వేసి, కర్ణుడి పుట్టుక, కౌరవుల పుట్టుక, గణేషుడి తొండం, సనాతన విమానాలు, భారతంలో సంజయుడి టెలివిజన్ ప్రత్యక్ష ప్రసారం వంటి వాటిపై వితండ వాదనలు చేసిన వారు ప్రధాని మోడీ, ఆయన పార్టీ అనుచరులు! ప్రధాని విద్యార్హతలేమిటని సమాచార హక్కు చట్టం కింద కొంతమంది ప్రధానమంత్రి కార్యాలయాన్ని అడిగితే అది 'గోప్యంగా' ఉంచవల్సిన విషయమని వారు సెలవిచ్చారట. ఆయన ప్రధాని కాకముందు జరిపిన టెలివిజన్ ఇంటర్వ్యూలో తను హైస్కూలు దాకా చదివానని చెప్పుకున్నారు. 'తలాక్ చెప్పడం ద్వారా భార్యను వదిలిపెట్టిన ముస్లింను జైలుకు పంపేటప్పుడు, జశోదాబెన్‌ను వదిలిపెట్టిన హిందూ నరేంద్రమోడీని ఎందుకు జైలుకు పంపకూడదని అడగడానికి ఒక్క జర్నలిస్టు అయినా సిద్ధంగా ఉన్నారా? ముస్లింలకు బహిరంగ వ్యవహారమైంది మోడీ దగ్గరికి వచ్చే సరికి వ్యక్తిగత వ్యవహారం ఎలా అయ్యిందీ' అని ఎంతో బాధ్యతాయుతంగా ప్రశ్నించారు ఏఐపీడబ్ల్యూఏ కార్యదర్శి కవితా కృష్ణన్. ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవక్‌గా సుదీర్ఘ కాలం పని చేసిన మోడీ పరిజ్ఞానం ఆ విధంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. జర్మన్ శాస్త్రవేత్త గ్రిగర్ మెండల్ (1822-84) జన్యువు గురించి చెప్పిన తర్వాతే జన్యుశాస్త్రం అభివృద్ధి చెందింది. వారసత్వ లక్షణాల గురించి పరిశోధనలు జరుగుతూ వచ్చాయి. లీవెన్ హక్ (1632-1723) డచ్ శాస్త్రవేత్త మైక్రోస్కోపు కనిపెట్టేదాకా సూక్ష్మకణాలను పరిశీలించే అవకాశమే మానవాళికి రాలేదు. అలాంటప్పుడు భారతంలో వంద అండాలను వంద కుండల్లో వేస్తే వారు వంద మంది కౌరవులయ్యారని చెప్పిన ఒక కల్పిత కథను శాస్త్రీయం అని ఎవరనుకుంటారు? నరేంద్రమోడీ అనుచరులు మాత్రమే అనుకుంటారు! ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు గౌరవాన్ని దిగజార్చగలిగిన ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలరే అనుకుంటారు!

సతీ సహగమనం రద్దు చేయాలన్నప్పుడు, బాల్య వివాహాలు రద్దయినప్పుడు, వితంతువులకు పునర్వివాహం అన్నప్పుడు, స్త్రీలు ఆలయ ప్రవేశం కావాలన్నప్పుడు పెద్ద అపచారం జరిగిందని, దైవ ద్రోహం జరిగిందని, హిందూ మతం మీద దాడి జరిగిందని మోడీ-షాల అనుచరులైన హిందూ మతతత్వవాదులు గగ్గోలు పెట్టారు. దళితుల ఆలయ ప్రవేశానికి మారణహోమాలే జరిగాయి. వీరు అంటరానితనాన్ని, వర్ణ వ్యవస్థను, మనుధర్మాన్ని నెత్తికెత్తుకుంటారు. మనిషి నీడను, స్పర్శను భరించలేరు గానీ, చనిపోయిన తర్వాత స్వర్గ ద్వారాలు తెరుస్తామంటారు. మానవీయ విలువలకు తిలోదకాలు వదిలి పవిత్రులమయ్యామని అనుకుంటారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని మానవ హననం ఇక్కడ ఉన్నందుకు గర్వపడదామా? ప్రపంచానికి ఏ విషయంలో ఆదర్శం? ఆత్మ విమర్శ చేసుకునే పనే లేదా? అందరూ సమానులు అందరికీ సమాన హక్కులన్న భౌతిక వాదులపై దాడులు చేస్తారా? వేదాల్లో, పురాణాల్లో అమోఘమైన విజ్ఞానం దాగి ఉంటే, ఆ విజ్ఞానాన్ని వీరు నిత్య జీవితంలో వాడుకోవాలి కదా?

ఎవరైనా తాము ఆధ్యాత్మిక శక్తితో పుష్పక విమానాల్లో తిరుగుతామంటే ఎవరు కాదన్నారు? స్త్రీ అండాలను కుండల్లో వేసి పిల్లల్ని పుట్టిస్తామంటే ఎవరు కాదన్నారు? నీటిలో తేలే రాళ్లతో నదుల మీద, సముద్రాల మీద, వంతెనలు కడతామంటే ఎవరు వద్దన్నారు? ప్రజా ధనం మిగులుతుంది. దేశానికి మేలు జరుగుతుంది. ఇంతెందుకు పొద్దున్నే టీ, కాఫీలు తాగమని వీరికి ఏ రుషులు చెప్పారో మరి? సనాతన రుషి వారసత్వాన్ని కొనసాగించాలంటే గోచీలు పెట్టుకోవాలి గానీ, ఆధునిక వస్త్రధారణ దేనికీ? మనం ఆక్సిజన్ పీల్చుకొని, కార్బన్ డై ఆక్సైడ్ వదిలేస్తున్న సమాచారం వేదాల్లో ఎందుకు లేదు. పోనీ ఆక్సిజన్ హైడ్రోజన్‌ల కలయిక వల్ల నీరు తయారైందన్న ప్రాథమిక సమాచారం కూడా ఇవ్వని వేదాలు ఆధునికుడికి ఎలా ప్రామాణికమవుతాయి? కట్టు కథలు చెప్పే ఇలాంటి మహా ఉపన్యాసకులు పెద్ద పదవుల్లో ఉన్నా సరే... కుహనా మేధావుల కట్టుకథలను బాధ్యత గల పౌరులు పట్టించుకోకపోవడమే మంచిది.

(రచయిత బయాలజీ ప్రొఫెసర్, మెల్బోర్న్ నుంచి)



ఇంత నాగరికత అభివృద్ధి చెందిన తర్వాతా మానవత్వం మృగ్యమైపోతుందని చెప్పడానికి అడుగడుగునా సాక్ష్యాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దేశంలో స్త్రీలపై రోజురోజుకీ పెరిగిపోతున్న లైంగిక హింస ఈ భావనకు మరింత ఆజ్యం పోస్తుంది. ఒకవైపు నేర సమాజం పేట్రేగిపోతుంటే.. రక్షణ కల్పించాల్సిన భద్రతా వర్గాలూ బాధితుల్ని మరింత హింసకు గురిచేసే పరిస్థితి దాపురించింది. ఇలాంటి వాతావరణంలో స్త్రీలు తమ వేదనను ఎవరికి తెలియజేయాలో తెలియక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తమ గోడును విని, సహకరించే మనుషులు తారసపడక అల్లాడిపోతున్నారు. కానీ ఇప్పుడా పరిస్థితిని మార్చాలని కదిలింది ఓ కదం. 'డిగ్నిటీ మార్చ్' పేరుతో దేశవ్యాప్తంగా లైంగిక హింసను ఎదుర్కొన్న బాధితులకు ఆపన్న హస్తం అందిచడానికి అడుగులు కదిలాయి. ఈ పాదాల పోరాటమేంటో... వారి ఆశయమేంటో.. తెలుసుకుందాం పదండి.



కదం కదం కలుపుతూ డిగ్నిటీ మార్చ్

రాజస్థాన్‌కు చెందిన భన్వరీదేవిపై అత్యంత అమానుషంగా జరిగిన అత్యాచార ఘటనతో 1992వ సంవత్సరంలో దేశమంతా నిరసనల వెల్లువ చెలరేగింది. దీనిపై పోరాడిన భన్వరీదేవి న్యాయం కోసం పోరాడారు. లైంగిక వేధింపుల నుంచి బయటపడిన వారి హక్కుల కోసం 26 సంవత్సరాలుగా పోరాడి గెలిచింది ఆమె. దీనికి సంబంధించి గత ఏడాది డిసెంబరు నెలలో ఆమె ఆజాద్ మైదానంలో ఎందరో మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. అప్పుడే ఆమె 'డిగ్నిటీ మార్చ్'లో పాల్గొనమని మహిళలకు పిలుపునిచ్చారు. ఉన్నత కులాలుగా భావించే కొందరు పురుషుల అమానుష వైఖరికి సాక్షిగా నిలిచిన భన్వరీదేవి మాటలు వేల కొలది మహిళల్ని ఏకతాటిపైకి తేవడం ఒక మంచి మార్పును తీసుకొస్తుందని ఇప్పుడు అందరూ భావిస్తున్నారు.

ఎన్నో కలత కథలు

'డిగ్నిటీ మార్చ్'లో ఎందరో స్త్రీలు తమకు జరిగిన అన్యాయాన్ని బయటకి చెబుతున్నారు. ఇందులో ఎన్నో కలత కథలు తెలుసుకొని, అందరూ నిర్ఘాంతపోతున్నారు. బాధితులే కాకుండా బాధితుల కుటుంబసభ్యులు సైతం ముందుకొచ్చి, తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైంగిక వేధింపులు ఎదుర్కొన్న ఒక బాధితురాలి తల్లి, ఉత్తర్‌ప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌కి చెందిన కాశీబాయ్ అనే మహిళ పాఠశాలకు వెళ్లే తన కూతురి విషయంలో జరిగిన అన్యాయాన్ని పంచుకుంది. పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయుడే కాశీబాయ్ కూతురిపై అత్యాచారం చేశాడు. మౌనంగా ఉండమని బెదిరించాడు. ఆ వేధింపులు తట్టుకోలేని బాలిక ఆత్మహత్య చేసుకొని, మరణించింది. ఈ విషయాన్ని కాశీబాయ్ పోలీసుల దగ్గరకు తీసుకెళ్లినప్పుడు ఆమెకు పది లక్షల రూపాయలు ఇస్తామంటూ రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు పోలీసులు. దీనికి కాశీబాయ్ అంగీకరించలేదని నేరస్థుడి బంధువుల దగ్గర డబ్బులు తీసుకున్న పోలీసులు ఈ కేసులో చాలా జాప్యం చేశారు. చనిపోయిన బాలిక మెడికల్ రిపోర్టులు ఇంకా రాలేదంటూ ఒక్కసారి కూడా కేసు వాదనలకు రానీయకుండా అపుతున్నారు. ఇలాంటి పరిస్థితి ఇప్పుడు దేశంలో చాలా మంది బాధితులు ఎదుర్కొంటున్నదే. ఇలాంటి వాటినే 'డిగ్నిటీ మార్చ్' ద్వారా బయటకి తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతుంది.

బాధితులకు మరింత బాధ

ఈ 'డిగ్నిటీ మార్చ్'లో భాగంగా మధ్యప్రదేశ్‌కు చెందిన బెదియా కమ్యూనిటీకి చెందిన మహిళల్లో సంచలనాత్మకమైన మార్పు వచ్చింది. ఇంతకుమునుపు ఈ కమ్యూనిటీలో ఆడపిల్లల్ని వేశ్యా వృత్తిలోకి బలవంతంగా దింపే సంస్కృతి ఉండేది. ఇప్పుడు వీళ్లు ఇలాంటి కేసులను వాదించడానికి మహిళా న్యాయవాదుల్ని తమ తరఫున నియమించమని ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇస్తున్నారు. 'రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని 21 జిల్లాల్లో ఆరు కమ్యూనిటీలు ఆడపిల్లల్ని వేశ్యా వృత్తిలోకి నెడుతున్నారు. 2012లో వచ్చిన ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్స్యువల్ అఫెన్సెస్ చట్టం తర్వాత కూడా మహిళలు, బాలలు లైంగిక దోపిడీకి గురవుతున్నారు' అంటారు గోవాకు చెందిన అర్జ్ యాంటీ-హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ డైరెక్టర్ అరుణ్ పాండే. సాధారణంగా కోర్టులకు ఇలాంటి కేసులు వచ్చినప్పుడు లైంగిన హింస నుంచి బయటపడిన స్త్రీలను ఉద్దేశించి, లాయర్లు అవమానకరంగా మాట్లాడేవారంటారు భన్వరీదేవి. 'అత్యాచారం జరిగిన విధానాన్ని నిశితంగా చెప్పమంటూ మరింత వేదనకు గురిచేసేవారు. ఒక్కోసారి బాధితులు వేసుకున్న వస్త్రధారణే దీనికి కారణమంటూ అవమానపరిచేవారు. వంటగదిలో ఉండకుండా బయటకు వస్తే ఇలాంటి పరిణామాలే ఎదుర్కోవాల్సి వస్తుందంటూ హేళన చేసి మాట్లాడేవారు. అందుకే ఇలాంటి కేసుల్ని వాదించడానికి మహిళా న్యాయవాదులు ఉంటే వారితో జరిగిన ఘోరాన్ని గురించి విపులంగా మాట్లాడటానికి అవకాశం ఉంటుంది' అంటారామె.



అందరి భాగస్వామ్యం కావాలి

'అత్యాచారానికి గురైన మహిళలు పోరాడాలనుకున్నప్పుడు అటు కుటుంబం నుంచీ సహకారం అందదు. అంతేకాదు, పోలీసులూ బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమవుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో బాధితులకు ఆత్మహత్య చేసుకోవడంకంటే మరో మార్గం కనిపించదు' అంటారు అత్యాచార బాధితులు. ఈ 'డిగ్నిటీ మార్చ్'లో భాగంగా ఇలాంటి 40 మంది బాధితులు దేశవ్యాప్తంగా 200 జిల్లాల్లో కమ్యూనిటీ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు.
ఇక్కడ లైంగిక హింస, మానవ అక్రమ రవాణాలకు సంబంధించి ఒక చర్చను లేవదీయడానికి పూనుకుంటున్నారు. అలాగే 24 రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహించి, ఇలాంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. 'డిగ్నిటీ మార్చ్' ప్రారంభించడానికి వెనుక స్త్రీలు, బాలలపై లైంగిక హింసను ఆపేయాలనే ఆశయం ఉంది. ఈ క్రమంలో ఈ జాతీయ స్థాయి 'డిగ్నిటీ మార్చ్'లో బాధితులు, హింస నుంచి బయటపడిన వారితో పాటు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకుంటున్న వారందరూ కలిసి భారత దేశంలోని 24 రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 200 జిల్లాలను కలుపుకుంటూ 10,000 కిలోమీటర్లు ప్రయాణం చేయడానికి పూనుకున్నారు. 2018 డిసెంబరు 20వ తేదీన ముంబయిలో మొదలై 2019 ఫిబ్రవరి 22న ఢిల్లీ వరకూ కొనసాగించే ఈ 'డిగ్నిటీ మార్చ్'కు ఇప్పటికే అనూహ్య రీతిలో స్పందన వస్తుంది. ఎలాంటి భయం, బిడియం లేకుండా వారిపై జరిగిన లైంగిక హింస తాలూకు అనుభవాలను బయటకి చెప్పమని స్త్రీలకు, పిల్లలకు పిలుపునివ్వడమే ఈ మార్చ్ ముఖ్య ఉద్దేశం. అంతేకాక ఇలాంటి వారికి తోడుగా నిలబడమని ప్రజలందరికీ తెలియజేస్తున్నారు. బాధితులను జాలి చూపులతో, ఇబ్బంది కలిగించే ప్రశ్నలతో మరింత హింసించవద్దని చెబుతున్నారు. బాధితులకైనా, హింసను ఎదుర్కొని, రక్షింపబడిన వారికైనా సురక్షితమైన భవిష్యత్తును, జీవించడానికి తగిన సహకారాన్నీ అందరూ ఇవ్వాలని ఈ 'డిగ్నిటీ మార్చ్' ద్వారా తెలియజేస్తున్నారు.

ఇన్నేళ్ల తర్వాత సమస్యే

భారతదేశంలో స్త్రీలు, చిన్నారులపై అత్యాచారం, లైంగిక హింసలు ఇన్నేళ్ల నాగరికత అభివృద్ధి తర్వాత కూడా పెద్ద సమస్యగా కనిపిస్తుంది. ఎన్‌సిఆర్‌బి రిపోర్టుల ప్రకారం స్త్రీలపై హింస 2007 నుండి 2016కు 83 శాతం పెరిగింది. గత దశాబ్ద కాలంలో స్త్రీలపై జరుగుతున్న నేరాల సంఖ్య 25 లక్షలకు పైగా నమోదయ్యాయి. ఈ నేరాల్లో అత్యాచారానికి సంబంధించినవి 12 శాతంగా కనిపిస్తున్నాయి. 2016 అయితే ప్రతిరోజూ 106 అత్యాచార కేసులు నమోదయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. గత దశాబ్ద కాలంతో పోల్చుకుంటే 2016వ సంవత్సరంలోనే అతి తక్కువగా 18.9 శాతం మాత్రమే నేరాలకు శిక్షపడినట్లు గమనించవచ్చు. ముఖ్యంగా పిల్లలు ఎక్కువ శాతం లైంగిక హింసను ఎదుర్కోవాల్సి వస్తుంది. పెద్దల కంటే పిల్లల్ని భయపెట్టడం సులువు కాబట్టి వారికి మరింత ప్రమాదం పొంచి ఉందని.. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ తెలియజేస్తున్నారు. భారతదేశంలో ప్రతి పావుగంటకు ఒక బాలిక లేదా బాలుడు లైంగికంగా హింసకు గురవుతున్నారు. 2014-16 సంవత్సరాల్లో 'ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్స్యువల్ అఫెన్సెస్ చట్టం కింద నమోదయిన కేసులు లక్షకు పైనే ఉన్నాయి. 2016లో మాత్రమే 36 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. ఇందులో 19 వేలకు పైన అత్యాచార కేసులుగా నమోదయితే, 12 వేలకు పైగా లైంగిక వేధింపులకు సంబంధించినవి. చిన్నారులపై జరిగే లైంగిక హింసలో ఎక్కువ కేసులు నమోదు కాకుండానే ఉంటున్నాయని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. 2016లో 24 వేల మంది స్త్రీలు, బాలబాలికలు మానవ అక్రమరవాణా బాధితులుగా మారారు. ఇది అంతకుముందు ఏడాది కంటే 25 శాతం ఎక్కువగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

నిజానికి 'డిగ్నిటీ మార్చ్' రూపుదిద్దుకుంది మన చుట్టూ ఉన్న మనకు తెలియని కొన్ని పరిస్థితుల్ని తెలియజేయడానికి. బాధితుల్ని మానసికంగా వేధించడం వంటి సంస్కృతిని రూపుమాపాలని, లైంగిక హింసను సమాజం నుంచి పూర్తిగా తీసివేయడానికి ఒక గొప్ప ప్రయత్నంగా ప్రారంభించారు. అలాగే బాధితులకు రక్షణ కల్పించి, న్యాయం చేయడానికి ప్రభుత్వాలు నిజాయితీగా పనిచేయాలని ఈ మార్చ్ డిమాండ్ చేస్తుంది. 'డిగ్నిటీ మార్చ్' అనేది బాధితులు తమ అనుభవాలు తాము స్వయంగా చెప్పుకోవడానికి కల్పించిన ఒక వేదిక. బిడియాన్ని, భయాన్ని వదిలి ధైర్యంగా ముందుకు రావడానికి, వారిని చూసి మరింత మంది ముందుకొచ్చే విధంగా ప్రేరేపించడానికి, అలాగే సమాజంలో లైంగిక హింసను సహించేదే లేదని చెప్పడానికి ఏర్పరచిన కార్యక్రమం. దీనికి అందరూ మద్దతు తెలపాలి. వారికి అండగా నిలవాలి!

- ప్రవీణ్ వెలువోలు

పసిపిల్లలకి ఆహారం ఇలా..

పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠం. పెరిగే పిల్లలకు అమ్మపాలతో పాటు పాలతో తయారైన ఆహార పదార్థాలు ఇవ్వడం ఆరు నెలల తర్వాత ప్రారంభించవచ్చు. బియ్యం, బార్లీ, గోధుమలు, ఓట్స్ వంటివి సంవత్సరం వయస్సప్పటి నుంచి మెల్లమెల్లగా ప్రారంభించాలి. పెరిగే పిల్లలకు కొద్దికొద్దిగా కోడిగుడ్డు, చేపలు కూడా అలవాటు చేయడం మంచిది. పాలు, చీజ్, పెరుగును తప్పకుండా పిల్లల డైట్‌లో ఉండేలా చూసుకోవాలి. ఇవి పిల్లల్లో ఎముకల బలాన్ని మరింత పెంచుతాయి.

పిల్లలకు తినిపించవచ్చు. వారానికి రెండుసార్లు చేపలు...వీలైతే వారానికి ఓ సారి మటన్ సూప్, చికెన్ సూప్ వంటివి అలవాటు చేయాలి. పండ్లను పంచదార కలపని జ్యూస్ రూపంలో, లేదంటే చిన్న చిన్న ముక్కలుగా..అదీ కాకుండా స్మూతీల్లా చేసి ఇస్తుండాలి.

పిల్లల ఆహార విషయంలో వైద్యుల సలహాలు పాటించాలి. తల్లిపాలు కనీసం నాలుగు నెలలైనా ఇవ్వాలి. అలాగనుక చేస్తే పిల్లలు సులభంగా పెరుగుతారు. ఆరోనెల నుంచి ఉడికించి, మెత్తగా చేసిన బంగాళదుంప, క్యారెట్, ఆపిల్, అరటి పండు వంటివి ఇవ్వాలి. ఇంకా పప్పుతో కలిపిన



పుట్టిన సంవత్సరం నుంచి పప్పుతో చేసిన వంటకాలు అన్నం, చికెన్ లాంటివి పెట్టాలి. మాంసాహారాలను రాత్రిపూట మాత్రం ఇవ్వకూడదు. పగటిపూట మాంసాహారాన్ని ఇవ్వవచ్చు. రాత్రి పూట ఇడ్లీల వంటి తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వడం ఉత్తమం.

★

మీ కోసం

అల్లం చిన్న చిన్న ముక్కలుగా చేసి, ఉప్పు కలిపి కొద్ది రోజుల పాటు ఊరనిచ్చి ఆ ముక్కలను రోజుకు రెండు లేదా మూడు చొప్పున తీసుకుంటే జీర్ణశక్తి, ఆకలి పెరుగుతుంది.



జీవనసౌరభం

అపార్థం చేసుకోవడంలో పదోవంతు అర్థం చేసుకోవడానికి ఉపయోగిస్తే జీవితంలో ఎదురయ్యే సగం బాధలు వాటంతటవే మాయమవుతాయి.

మార్పు ఆనందం కోసమే!

మీరు మీకు గొప్ప అభిమానిగా ఉంటున్నారా? లేదంటే.. మీపై మీకు ఎక్కువ విమర్శలు ఉన్నాయా? అంటే ఇందులో దేన్ని ఎంచుకుంటారు? మీ గురించి మీకు ఉన్న అభిప్రాయమేంటో తెలుసుకోవడానికి కొంత సమయాన్ని కేటాయించుకోండి. ఇంతకీ మీతో మీరు మాట్లాడుకోవడానికి ఎంత సమయాన్ని కేటాయిస్తారు? అసలు మీతో మీరు ఎలా మాట్లాడుకుంటారు? మీతో మీరు మాట్లాడుకునేటప్పుడు ప్రేమతో మాట్లాడుకుంటారా? కోపంతోనా... ద్వేషంతోనా... బాధగానా... ఎలా..? ఒకసారి పరిశీలించుకోండి. మీరు ఏదైనా పొరపాటో, తప్పో చేసి ఉంటే మీపై మీకు ఎలాంటి భావన కలుగుతుంది? మిమ్మల్ని మీరు సమాధాన పరచుకుంటారా లేక లోలోపల రగిలిపోతూ, మీపై మీరు కక్షసాధింపు చర్యలకు దిగుతారా? ఇలాంటి ప్రశ్నలు మనపై మనం, మన కోసం మనం సంధించుకున్నప్పుడు మిమ్మల్ని మీరు ఎంత ప్రేమించుకుంటున్నారో అర్థమవుతుంది. నిజానికి మనిషి సంతోషంగా బతకడానికి ఇలాంటి స్వీయ పరిశీలన చాలా అవసరమవుతుంది.

మనల్ని మనం ప్రేమించుకోవడం చాలా ముఖ్యమైన అవసరం అని నిర్ధారించుకున్నప్పుడు చాలా సమస్యలకు సమాధానం దొరుకుతుంది. అప్పుడు మనం చేసిన పొరపాట్లయినా, తప్పులైనా తిరిగి చేయకుండా మనపై మనకు ఒక నియంత్రణ ఏర్పడుతుంది. దాని కోసం మనం చేసిన తప్పుల్ని విశ్లేషించుకుంటూ, ఒక ప్రణాళిక ప్రకారం భవిష్యత్తులో అలాంటివి జరగకుండా చూసుకోవాలి. మీకు ప్రియమైన వ్యక్తుల్ని ఎలా ప్రేమిస్తారో మిమ్మల్ని మీరూ అలాగే ప్రేమించుకోవాలి. ఇది కేవలం స్వీయానందం కోసం మాత్రమే కాదు. ఆయా పరిస్థితుల్ని ఎదుర్కొని నిజాయితీగా జీవించడానికి, మీ నుంచి ఎలాంటి తప్పులూ జరగకుండా ఉండటానికి తోడ్పడుతుంది? మిమ్మల్ని మీరు ప్రేమించుకునే క్రమంలో మీతో మీరు ఎక్కువగా మాట్లాడుకోండి. అద్దంలో మిమ్మల్ని మీరు చూసుకుంటూ అభినందించుకోండి. ఎంత కష్టపడి పనిచేస్తున్నారో, చేస్తున్న పనులన్నీ ఎంత చక్కగా నిర్వర్తిస్తున్నారో మీకు మీరు చెప్పుకోండి. మీకు మీరు ప్రేమలేఖలు రాసుకోండి... ఇవన్నీ వినడానికి హాస్యాస్పదంగా ఉన్నా ఆచరణలో అద్భుతాలు చూడవచ్చని మానసిక వైద్యులు అంటారు.

మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడండి. అందులో ఎవ్వరూ వారివారి మార్గాల్లో పూర్తి పర్‌ఫెక్ట్‌గా లేరని



అర్థమవుతుంది. సమస్యలు రావడం, పొరపాట్లు చేయడం మనిషి జీవితంలో భాగమేనని గుర్తించండి. ప్రతిరోజూ మీరు చేస్తున్న గొప్ప పనులు మూడింటిని రాసుకుంటూ ఉంటే కొన్నాళ్లకు మీ జీవితంలో వచ్చే మార్పును మీరే గమనిస్తారు. ఈ క్రమంలో



అత్యంత ముఖ్యంగా మనం చేయాల్సింది ఏమంటే... మనలో ఉన్న చెడు భావనల్ని నిజాయితీగా ఒప్పుకోవడం. అయితే వాటిని ప్రయాణంలో భాగంగా అనుకొని, వదిలిపెట్టడం మంచిది. వాటి స్థానంలో ప్రేమ, ఓదార్పు, పాజిటివ్ ఆలోచనలను చేర్చండి. మన జీవితంలో మార్పు మన ఆచరణతోనే సాధ్యమవుతుంది.

★

సెన్సెక్స్ ⬆ 03
36,321

నిఫ్టీ ⬆ 04
10,890

రూపాయి ⬇ 21 పై
అమెరికా డాలరుకు రూ.
71.24

ఇసుజు మోటార్స్ విస్తరణ..

ఇసుజు మోటార్స్ ఇండియా తమ రెండో షోరూంను ఆ సంస్థ ఎండి నౌహిరో యమగుచి బుధవారంహైదరాబాద్‌లో ప్రారంభించారు. దీంతో మహవీర్ గ్రూపు మేనేజ్‌మెంట్‌లో రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడలోని ఔట్‌లెట్లకు మరొక్కటి జోడించినట్లయ్యిందని మహవీర్ గ్రూపు ఛైర్మన్ యశ్వంత్ ఘుజక్ పేర్కొన్నారు. శ్రీసిటీలో తయారీ కేంద్రం కలిగిన ఇసుజు దేశంలో 44 నగరాల్లో డీలర్‌షిప్‌లను కలిగి ఉంది.



హానర్ 10 లైట్ ..

హువాయి గ్రూపునకు చెందిన హానర్ భారత మార్కెట్లోకి కొత్త 'హానర్ 10 లైట్' స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. బుధవారం దీన్ని హానర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అలన్ వాంగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ వీర్ యాదవ్‌లు ఆవిష్కరించారు. రెండు వేరియంట్లలో లభించే ఈ ఫోన్ ప్రారంభ ధరను రూ.13,999గా నిర్ణయించింది. ఇందులో 6.21 అంగుళాల డిస్‌ప్లే, 4జిబి/6జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్, 24 ఎంపి సెల్ఫీ కెమెరా, 13 ఎంపి రియర్ కెమెరా ఫీచర్లున్నాయి.



కొడాక్ నుంచి కొత్త స్మార్ట్ టివిలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కొడాక్ బ్రాండ్ లైసెన్స్‌లు కలిగిన సూపర్ ప్లాస్ట్రోనిక్స్ ప్రయివేటు లిమిటెడ్ (ఎస్‌ఎస్‌పిఎల్) తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి '43యుహెచ్‌డిఎక్స్' స్మార్ట్‌టివిని విడుదల చేసింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దీన్ని ఎస్‌ఎస్‌పిఎల్ సిఇఒ అవ్‌నీత్ సింగ్ మర్వా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయించనున్న 43యుహెచ్‌డిఎక్స్ ధరను రూ.23,999గా నిర్ణయించామన్నారు. 5.1.1 ఆండ్రాయిడ్ వర్షన్‌లో ప్రవేశపెట్టిన ఈ 4కె స్మార్ట్ టివిని వై-ఫైతో కనెక్ట్ చేసుకోవచ్చన్నారు. ఇందులో 1జిబి మెమోరీ, 8జిబి ఫ్లాష్ స్టోరేజీ కూడా ఉంటుందన్నారు. వివిధ పరిమాణంలో ప్రస్తుతం 14 రకాల టీవిలను విక్రయిస్తున్నామన్నారు. వీటి ధరల శ్రేణీ రూ.9,499- రూ.36,999గా నిర్ణయించమన్నారు. 2019లో మరో తొమ్మిది వరకు కొత్త మోడళ్లను ఆవిష్కరించనున్నామన్నారు. ఈ రంగంలో ప్రస్తుతం నాలుగు శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నామని, వచ్చే 2022 నాటికి 8 శాతం మార్కెట్ వాటాను చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ప్రపంచ బ్యాంకు అధ్యక్ష రేసులో ఇంద్రా నూయి!

న్యూయార్క్ : ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవీ పోటీలో భారత సంతతి మహిళ ఇంద్రా నూయి పోటీలో ఉన్నారని రిపోర్టులు వెలుపడుతున్నాయి. ఇది వరకు ఈ హోదాలో ఉన్నా జిమ్ యోంగ్ కిమ్ రాజీనామా చేయడంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం కసరత్తు జరుగుతుంది. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్, ఐరాసలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీల పేర్లు తొలుత తెరపైకి వచ్చాయి.



తాజాగా పెప్సికో మాజీ సిఇఒ ఇంద్రా నూయి పేరు పోటీలో ఉందని వినిపిస్తోంది. 12 ఏళ్లు అమె పెప్సీకోకు సిఇఒగా వ్యవహరించి.. గతేడాది అక్టోబర్‌లో పదవీ విరమణ పొందారు. నూయి ప్రపంచబ్యాంకు అధ్యక్షురాలు అయితే బాగుంటుందని అమెరికా అధ్యక్ష నివాసమైన వైట్‌హౌస్ భావిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ తాజాగా కథనం వెలువరించింది. ప్రపంచ బ్యాంక్‌లో అమెరికా అతిపెద్ద భాగస్వామిగా ఉంది. దీంతో ఆ దేశ అధ్యక్షుడు సూచించిన వ్యక్తికే ఈ పదవి దక్కే అవకాశం మెండుగా ఉంటుంది. ఇది వరకు పలువురి పోటీతో 2012లో మాత్రం ఎన్నిక అనివా ర్యమైంది. ఈసారి కూడా ఎన్నిక జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతురాలైన మహిళల్లో ఇంద్రా నూయికి ప్రత్యేక స్థానం ఉందంటూ ట్రంప్, ఇవాంకా అనేక సార్లు ప్రశంసించిన విషయం తెలిసిందే.

ఇన్ఫోసిస్‌కు ఐటిఆర్ ఫైలింగ్స్ ప్రాజెక్టు

- రూ. 4,214.97 కోట్ల ప్రాజెక్టుకు కేంద్ర కేబినేట్ ఆమోదం

న్యూఢిల్లీ : భవిష్యత్ తరం ఆదాయ పన్ను రిటర్న్ (ఐటిఆర్) ఫైలింగ్స్ పద్దతి అమలు ప్రాజెక్టుకు ప్రముఖ ఐటి సంస్థ ఇన్ఫోసిస్‌ను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రూ. 4,241.91 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేస్తున్న ఈ ప్రాజెక్టుకు కేంద్ర కాబినేట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో ఐటిఆర్ ప్రాసెసింగ్ సమయం ఒక రోజుకు తగ్గించబడుతుందని, దీంతో రిఫండ్స్ ఇవ్వడం వేగమవంతమవుతుందని భావిస్తున్నారు.

'ఆదాయపన్ను శాఖకు చెందిన ఈ-ఫైలింగ్, ప్రోసింగ్ కేంద్రాన్ని కేంద్రీకృతం చేసే ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కేబినేట్ ఆమోదం తెలిపింది' అని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఐటిఆర్ ప్రాసెసింగ్‌కు 63 రోజుల సమయం పడుతుందని, కొత్త ప్రాజెక్టు అమలులోకి వస్తే ఈ సమయం ఒక్క రోజుకు తగ్గించబడుతుందని మంత్రి తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టు అమల్లోకి రావడానికి 18 నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు బిడ్డింగ్ ప్రాసెస్ తరువాత ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేశామని తెలిపారు. నూతన ప్రాజెక్టు అమల్లోకి వస్తే పన్ను చెల్లింపు మరింత సులభతరం అవుతుందని కూడా మంత్రి వెల్లడించారు. కొత్త ప్రాజెక్టుతో రిఫండ్స్ ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా, పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయని మంత్రి తెలిపారు.



పారిశ్రామిక సంఘాలతో నేడు ఆర్‌బిఐ గవర్నర్ భేటీ..

న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో భేటీ కానున్నారు. వారి సమస్యలు, ఆందో ళనలు అర్థం చేసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్‌బిఐ 25వ గవర్నర్‌గా గత నెలలో బాధ్యతలు చేపట్టిన దాస్ బ్యాంకింగ్, బ్యాంకింగేతర విత్త సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులతో ఇది వరకే సమావేశం అయ్యారు. ఈ నెల 17న పారిశ్రామిక, వాణిజ్య వర్గాల అసోసియేషన్లతో భేటీ కానున్నట్లు దాస్ బుధవారం ట్వీట్ చేశారు. ఫిబ్రవరి 7న జరుగన్న ఆర్‌బిఐ ద్వైమాసిక పరపతి సమీక్ష భేటీ నేపథ్యంలో పారిశ్రామిక వర్గా లతో భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ఓ వైపు రిటైల్, టోకు ద్రవ్యోల్బణం దిగిరావడం, పారిశ్రా మిక ఉత్పత్తి సూచీ పడిపోయిన నేపథ్యంలో వచ్చే సమీక్షలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోనున్నారో వేచి చూడాలి.

విశాఖకు 'స్కూట్' విమాన సేవలు



సింగపూర్ : బడ్జెట్ విమానయాన సంస్థ స్కూట్ త్వరలో తన సేవలను మరో మూడు నగరాలకు విస్తరించనున్నట్లు ప్రకటించింది. సింగపూర్‌కు చెందిన ఈ స్కూట్ త్వరలోనే విశాఖపట్నం, త్రివెండ్రం, కొయంబత్తూరు నగరాలకు సేవలు అందించనున్నట్లు వెల్లడించింది. వచ్చే అక్టోబర్ 27 నుంచి విశాఖకు వారానికి మూడు విమానాలను నడిపించాలని నిర్ణయించింది. త్రివెండ్రంకు వారానికి ఐదు సార్లు, కోయంబత్తూరుకు వారా నికి ఐదు సార్ల చొప్పున విమాన సేవలందించనున్నట్లు వెల్లడించింది. ఈ కొత్త సేవలు అందుబాటులోకి వస్తే సింగపూర్ -త్రివెండ్రం- విశాఖ మధ్య నాన్ స్టాప్ విమాన సేవలందించే సంస్థల్లో సిల్క్ ఎయిర్, స్కూట్ కంపెనీలు నిలువ నున్నాయి. చౌక ధరల ఈ విమానయాన సంస్థ 2016లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. చెన్నయ్, అమృత్‌సర్, జైపూర్‌కు విమాన సేవలు అందిస్తుంది.

ఎక్సిమ్ బ్యాంకుకు రూ.6వేల కోట్లు

న్యూఢిల్లీ : ఎక్స్‌పోర్టు-ఇంపోర్టు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎక్సిమ్)కు రూ.6,000 కోట్ల మూలధనం సమకూర్చడానికి బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రీకాపిటలైజేషన్ బాండ్ల జారీ ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చనున్నారు. వచ్చే మార్చి లోపు ఎక్సిమ్ బ్యాంకుకు రూ.4,500 కోట్లు, 2018-19 ఆర్థిక సంవత్సరంలో మరో రూ.1,500 కోట్లు అందించడానికి కేబినెట్ అంగీకరించిందని మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు. ఈ మూలధనం వల్ల ఎగుమతిదారులు, దిగుమతిదారులకు ప్రోత్సాహం లభించనుందన్నారు.

గట్టెక్కించిన బ్యాంకింగ్ షేర్లు..

ముంబయి : ఆద్యంతం ఊగిసలాట మధ్య బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు తుదకు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ముఖ్యంగా మార్కెట్లకు బ్యాంకింగ్ షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ తుదకు 2.96 పాయింట్లు పెరిగి 36,321 వద్ద ముగిసింది. ఉదయం 36,370 వద్ద ప్రారంభమైన సూచీ ఓ దశలో 36,462 గరిష్ట స్థాయిని తాకింది. మరో దశలో ఏకంగా 36,278.61 కనిష్ట స్థాయికి పడిపోయింది. స్థూలంగా 1,222 స్టాక్స్ లాభపడగా, 1,356 స్టాక్స్ నష్టపోయాయి. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 3.50 పాయింట్లు పెరిగి 10,890 వద్ద ముగిసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు స్టాక్స్ ప్రధాన మద్దతుతో నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ స్టాక్ 0.6 శాతం పెరిగింది. సెన్సెక్స్-30లో యస్ బ్యాంకు, ఇండుస్‌ఇండు బ్యాంకు, ఇన్ఫోసిస్, ఐసిఐసిఐ బ్యాంకు అధికంగా లాభపడగా, భారతీ ఎయిర్ టెల్, వేదాంత, ఆసియన్ పెయింట్స్ అధికంగా నష్టపోయిన వాటిలో ముందు ఉన్నాయి.

REASONING FOR ALL COMPETITIVE EXAMS



S. LENIN BABU
LECTURER IN MATHS
GOVERNMENT
POLYTECHNIC COLLEGE
VIJAYAWADA. PH : 9985476035

Statements and Conclusions

Description : Statement and conclusion questions consists of basically a paragraph/statement/passage and by reading it carefully have to decide what is inferred by the passage. These are basically designed to test the candidate ability to interpret a statement.

The questions in this part comprises of a statement or an arrangement of statements, followed by specific deductions taking into account the facts contained in the given statements. The competitor is required to break down the given statements, understand their direct/indirect implications and after that choose which of the given conclusions takes after sensibly and without a doubt, from the given statements.

Concept :

Conclusion: A conclusion is a fact which can be inferred from a given statement or a paragraph or a passage.

Statement – conclusion questions are the extension of the statement – assumptions questions. Sometimes, the messages are clear in passage itself ie, direct implications. And sometimes hidden in the passage i.e. indirect implications.


Format of the problem:

Directions: In every question underneath a statement(or a section) is followed by two/three conclusions numbered I and II/III. The candidate is required to analyse the statement and understand the direct or in-direct implications.Candidate is required to consider the announcement and the accompanying conclusions and afterwards choose which of the conclusions is certain in the statement. Give answer:

(a) If only conclusion I follows.
(b) If only conclusion II follows.
(c) If either conclusion I or conclusion II follows.
(d) If neither of the conclusions I and II follows.
(e) If both the conclusions I and II follows.

Model Problems :

Model 1: Statement: Wind is an unlimited wellspring of energy and an aero generator can change over it into power. In spite of the fact that very little has been done in this field, the review demonstrates that there is incomprehensible potential for creating wind as option wellspring of energy.



Conclusions:

I: Energy by wind is similarly recently developing field.

II: The energy emergency can be managed by investigating more in the field of aero generation.

Directions: The question given above consists a statement followed by three conclusions numbered I and II. Have to assume everything in the statement to be true, then consider the two conclusions together and decide which of them logically follows behind a reasonable doubt from the information given in the statement.

Given options:

(a) If only conclusion I follows.
(b) If only conclusion II follows.
(c) If either conclusion I or conclusion II follows.
(d) If neither of the conclusions I and II follows.
(e) If both the conclusions I and II follows.

Solution:

From the passage, the expression 'very little has been done in this field' demonstrates that wind vitality is a similarly recently rising field.

In this way, I follows.

The expression 'there is inconceivable potential for creating wind as option wellspring of energy' ends up being valid.

Therefore, option(e) is correct answer.

Model 2: Statement: Guardians are set up to pay any cost for a tip top training to their youngsters.

Conclusions:

I: All guardians nowadays are exceptionally fortunate.

II: Guardians have an over the top energy for a flawless improvement of their youngsters through great educating.

Directions: The question given above consists a statement followed by three conclusions numbered I and II. Have to assume everything in the statement to be true, then consider the two conclusions together and decide which of them logically follows behind a reasonable doubt from the information given in the statement.

Given options:

(a) If only conclusion I follows.
(b) If only conclusion II follows.
(c) If either conclusion I or conclusion II follows.
(d) If neither of the conclusions I and II follows.
(e) If both the conclusions I and II follows.

Solution:

Given statement:

Guardians are set up to pay any cost for a tip top training to their youngsters.

It is clear that, the statement infers that individuals are slanted towards giving their youngsters great training.

Along these lines, just II takes after while I doesn't.

So, option(b) is the correct one.

General Mental Ability - Model Problems

1: Statement: Government has ruined numerous top positioning monetary foundations by naming civil servants as directors of these institutions.

Conclusions:

I: Government should designate directors of the monetary foundations taking over the mastery of the individual in the region of finance.

II: The Director of the financial institute should have expertise commensurate with the financial work carried out by the institute.

Directions: The question given above consists a statement followed by three conclusions numbered I and II. Have to assume everything in the statement to be true, then consider the two conclusions together and decide which of them logically follows behind a reasonable doubt from the information given in the statement.

Given options:

(a) If only conclusion I follows.
(b) If only conclusion II follows.
(c) If either conclusion I or conclusion II follows.
(d) If neither of the conclusions I and II follows.
(e) If both the conclusions I and II follows.

Solution:

Given that:

Government has ruined numerous top positioning monetary foundations by naming civil servants as directors of these institutions.

According to the statement, Government has spoiled financial institutions by appointing bureaucrats as directors.

This means that only those persons should be appointed as directors who are experts in finance and are acquainted with the financial work of the institute.

So, both I and II follows.

2: Statement: A neurotic is a non-idiot who acts moronically.

Conclusions:

I: Neurotic-ism and idiocy go as an inseparable unit.

II: Normal persons behave intelligently.

Directions: The question given above consists a statement followed by three conclusions numbered I and II. Have to assume everything in the statement to be true, then consider the two conclusions together and decide which of them logically follows behind a reasonable doubt from the information given in the statement.

Given options:

(a) If only conclusion I follows.
(b) If only conclusion II follows.
(c) If either conclusion I or conclusion II follows.
(d) If neither of the conclusions I and II follows.
(e) If both the conclusions I and II follows.

Solution:

Given statement:

A neurotic is a non-idiot who acts moronically.

It is said in the announcement that a neurotic is a man who acts moronically.

So, I follows.

The conduct of ordinary persons can't be derived from the given statement.

So, II does not follow.

Therefore, Only conclusion I follows.

3 : Statement: For more than three decades Company X has been completely required in energy protection, its proficient use and administration.

Conclusions:

I: The Company has yet to learn and gain fundamental things around there.

II: It is commitment that is more important than information and ability.

Directions: The question given above consists a statement followed by three conclusions numbered I and II. Have to assume everything in the statement to be true, then consider the two conclusions together and decide which of them logically follows behind a reasonable doubt from the information given in the statement.

Given options:

(a) If only conclusion I follows.
(b) If only conclusion II follows.
(c) If either conclusion I or conclusion II follows.
(d) If neither of the conclusions I and II follows.
(e) If both the conclusions I and II follows.

Solution:

Given statement:

For more than three decades Company X has been completely required in energy protection, its proficient use and administration.

Since the organization has been working here for three decades, it must have the fundamental ability and base required in this field.

So, I does not follow.

In any case, the qualities that have made the Company X effective in this field have not been specified.

So, II also does not follow.

Therefore, neither I nor II follows.



విశాఖ రైల్వేస్టేషన్‌లో రాజ్యసభ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సుబ్బరామిరెడ్డికి వివరాలు తెలుపుతున్న అధికారులు

అసంతృప్తిగా కాలుష్య నియంత్రణ చర్యలు

- రాజ్యసభ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సుబ్బరామిరెడ్డి
- ప్రభుత్వరంగ సంస్థలను సందర్శించిన పార్లమెంటరీ బృందం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగా ఉండే ప్రభుత్వ రంగ పరిశ్రమలు కాలుష్య నియంత్రణపై చేపడుతున్న చర్యలు తనను సంతృప్తి పరచలేదని రాజ్యసభ స్టాండింగ్ కమిటీ చైర్మన్ టి.సుబ్బరామిరెడ్డి వెల్లడించారు. విశాఖలో మంగళవారం పలు ప్రభుత్వ రంగ సంస్థలను పార్లమెంటరీ బృందం సందర్శించింది. స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, రైల్వే, పోర్టు అన్నింటిలోనూ బృందం కలియ తిరిగింది. సాయంత్రం నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్మన్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ 'పార్లమెంట్‌లో పాసైన పలు చట్టాలు ఎలా అమలవుతున్నాయో పరిశీలించి ఒక నివేదికను తయారు చేయడమే కమిటీ పని అని చెప్పారు. 17న హైదరాబాద్‌లోనూ, 18న జమ్మూ, కాశ్మీర్‌లోనూ తమ కమిటీ పర్యటించనుందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు సాలిడ్ వేస్ట్, ఇ-వేస్ట్‌ను ఎలా నియంత్రించి కాలుష్యాన్ని లేకుండా చర్యలు తీసుకుంటున్నాయో పెట్రోలియం కంపెనీల్లోనూ, బొగ్గు ఉత్పత్తి జరిగే చోట సంబంధిత అధికారులతో సమావేశం జరిగిందని, వారిచ్చే జవాబులతో నివేదిక తయారు చేస్తామని చెప్పారు. పారిశ్రామిక వ్యర్థాలు ఏవైతే ఉన్నాయో వాటిని నీళ్లలో వదిలే అలవాటు ఉందని, వీటిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎలా నిరోధిస్తుంది, రాష్ట్రమంతటా ఎలా అమలు చేస్తున్నారనే విషయాలు పరిశీలించామని పేర్కొన్నారు. బ్యాంకుల్లో జరుగుతున్న మోసాలు, ఫ్రాడ్ కేసుల వివరాలను కమిటీ పరిశీలించిందన్నారు. 25 బ్యాంకులకు చెందిన ఉన్నతాధికారులు పలు విషయాలను చెప్పారని, మోసాలను అరికట్టే విధానంపై చర్చించామని తెలిపారు. దొంగనోట్ల కరెన్సీ చలామణిపైనా చర్చ జరిగిందని, కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. బ్యాంకుల్లో జరిగే అవకతవకలపై పోలీస్ డిప్యూటీ కమిషనరేట్‌తో చర్చించామన్నారు. కస్టమ్స్, డిఫెన్స్, కోస్టల్ గార్డ్స్ కార్యక్రమాలపైనా కమిటీ పరిశీలించిందన్నారు. విశాఖ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు 38 లక్షలు మొక్కలు ఇప్పటివరకూ నాటినట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్‌మేనేజర్ పిఎస్ మిశ్రా, రైల్వే డిఆర్ఎం ముకుల్‌శరణ్ మాథూర్, స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి రథ్ తదితరులు ఉన్నారు.



ఇసుక దిబ్బలు కూలిన ప్రదేశంలో గుమికూడిన గ్రామ ప్రజలు

ఇసుక దిబ్బలు పడి ఇద్దరు మృతి

ప్రజాశక్తి- పెనుకొండ రూరల్(అనంతపురం)

అనంతపురం జిల్లా పెనుకొండ మండలం చెరువులో మట్టిని తవ్వుతుండగా ఒక్కసారిగా ఇసుక దిబ్బలు మీదపడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఎస్ఐ జనార్ధన్ తెలిపిన కథనం ప్రకారం... పెనుకొండ మండలం దుద్దేబండకు చెందిన వెంకటరెడ్డి(28), ఈడిగ వెంకటేషు (35), నాగభూషణం మరువపల్లి గ్రామ సమీపంలో చెరువులో మట్టి తోడుతున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా మట్టి దిబ్బలు మీద పడ్డాయి. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి, వెంకటేషులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నాగభూషణాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ జనార్ధన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇసుక తవ్వకాలను అరికట్టాలని పలుమార్లు తహశీల్దార్ హసీనా సుల్తానాకు విన్నవించినా పట్టించుకోలేదు. మృతుల కుటుబాలకు ఎమ్మెల్యే పార్థసారధి చంద్రన్నబీమా కింద తక్షణ ఆర్థిక సాయం రూ.5వేలు అందించారు.



చికిత్స పొందుతున్న సూరిబాబును పరామర్శిస్తున్న సత్యానందరావు

బాణాసంచా కాల్పుల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తపేట (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో ప్రభల ఉత్సవాల సమయంలో నిర్వహించిన బాణాసంచా కాలుస్తుండగా ప్రమాదవశాత్తు ఇద్దరు గాయపడ్డారు. కొత్తపేటలో బాణసంచా కాలుస్తుండగా గ్రామానికి చెందిన డి.సూరిబాబు, జి.అయ్యప్ప అక్కడే ఉన్న బాంబుపై చూడకుండా కాళ్ళు వేశాడు. ఒక్కసారిగా బాంబు పేలడంతో సూరిబాబు, అయ్యప్ప గాయపడ్డారు. సూరిబాబు రెండు పాదాలు తీవ్రంగా కాలిపోయాయి. అతడిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అయ్యప్ప స్వల్పంగా గాయపడ్డాడు. వీరిని టిడిపి, జనసేన నాయకులు పరామర్శించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. కిడాంబి శ్రీకాంత్
2. కేరళ
3. జనవరి 15
4. జమ్మూ కాశ్మీర్
5. జనవరి 12

పురోగతి లేని ఇళ్ల నిర్మాణం

- లబ్ధిదారుని వాటాగా 14 వేల మంది నుంచి రూ.35 కోట్లు వసూలు
- 7,102 మందికి మాత్రమే కాగితాల్లో కేటాయింపులు
- బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడంలోనూ వైఫల్యమే



ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

స్థలాలు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామంటూ గొప్పలకు పోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో పూర్తిగా విఫలమయ్యాయి. రెండు నెలల్లో ప్రభుత్వాల పాలనా కాలం పూర్తి కావస్తున్నా మహా విశాఖ నగరంలో ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేకపోయారు. ఇప్పటివరకు 14 వేల మంది నుంచి దాదాపుగా రూ.35 కోట్లు లబ్ధిదారుని వాటాగా జివిఎంసి వసూలు చేసినా అందులో 7,102 మందికి మాత్రమే కాగితాల్లో కేటాయింపులు చేశారు. ఇప్పటివరకు ఒక్క ఇంటి నిర్మాణం పూర్తి కాకపోవడంతో వారికి అప్పగించలేదు. ఫిబ్రవరి లేదా మార్చిలో ఇళ్లు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నా అప్పటికి ఎన్నికల కోడ్ అమల్లోకి రానున్న నేపథ్యంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇంకా 260 ఎకరాలు అవసరం

2015 నుంచి 2019 వరకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం (పిఎంఎవై)లో భాగంగా 56 వేల గృహాలను గ్రేటర్ విశాఖ మున్సిపాలిటీ కార్పొరేషన్ (జివిఎంసి)కి మంజూరు చేసింది. ఒక్క ఎకరంలో వంద ఇళ్ల చొప్పున వీటన్నింటి నిర్మాణానికి 560 ఎకరాల స్థలం అవసరం. ఇప్పటివరకు 300 ఎకరాలు మాత్రమే ప్రభుత్వం టిడ్కోకు అప్పగించింది. ఇంకా 260 ఎకరాలు కేటాయించాల్సి ఉంది. ముదపాక, ట్రై జంక్షన్, పరదేశిపాలెంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా స్థలాల సేకరణ చేపట్టేందుకు ఇటీవల జిఓ జారీ చేసింది. కేటాయించిన స్థలాల్లో కూడా నిర్మాణాలను పూర్తి చేయలేకపోయారు. 27 వేల గృహాలు ప్రారంభ దశలో ఉన్నాయని, సత్యనారాయణపురం, రాతి చెరువు, పరవాడ, అగనంపూడిలో దాదాపుగా 3 వేల నివాసాలు ఫిబ్రవరిలో నిర్మాణాలు పూర్తి అయి అందుబాటులోకి వస్తాయని జివిఎంసి యుసిడి అధికారులు చెబుతున్నారు.

విశాఖలో ఇళ్ల నిర్మాణం, కేటాయింపుల పరిస్థితి

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య	: 2.5 లక్షలు
ఐదేళ్లలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు	: 56 వేలు
గుర్తించిన లబ్ధిదారుల సంఖ్య	: 18,435
గృహాల కోసం తమ వాటా చెల్లించిన వారు	: 13,931
గృహాల కేటాయింపు పొందిన వారు	: 7,102
బ్యాంకు రుణాల కోసం పత్రాలు సమర్పించిన వారు	: 2380
రుణం మంజూరైన వారు	: 166
ఇళ్లు అప్పగించిన వారి సంఖ్య	: 0

ఇల్లు లేని పేదలంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకోవాలని 2015లో ప్రభుత్వం ప్రకటించడంతో జివిఎంసి పరిధిలో 2.5 లక్షల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 14 వేల మంది నుంచి లబ్ధిదారుని వాటాగా రూ.35 కోట్లు కట్టించుకున్న జివిఎంసి అధికారులు ఇప్పటివరకు 7,102 మందికి మాత్రమే కేటాయింపులు చేశారు. అందులో ఒక్కరికీ ఇళ్లు అప్పగించలేదు. ఇళ్ల నిర్మాణంలోనే కాకుండా బ్యాంకుల నుంచి రుణం ఇప్పించడంలోనూ పురోగతి లేదు. ఇప్పటివరకు 2,380 మంది రుణపత్రాలు సమర్పించగా వారిలో 166 మందికే మంజూరైంది.

'బొర్రా' కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్

ప్రజాశక్తి - అనంతగిరి(విశాఖపట్నం)

విశాఖ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల కార్మికులకు కనీస వేతనాలివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి బొర్రా గుహలకు విచ్చేసిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రకతి సిద్ధంగా ఏర్పడిన గుహలు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా ఏడాదికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నా పంచాయతీ, ఇక్కడ పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యకం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పంచాయతీ అభివద్ధికి నిధులను ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. బొర్రా గుహల వద్ద వాహనాలు నిలిపేందుకు స్థలం, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట అరకు డివిజన్ కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి గంగరాజు, మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, మండల కార్యదర్శి మొత్య, నాయకులు రాజు తదితరులు ఉన్నారు.

కోడి పందేల శిబిరాలపై దాడులు

45 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. కడప జిల్లాలో 31 మందిని, విశాఖ జిల్లాలో 11 మందిని, కృష్ణా జిల్లాలో ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మైదుకూరు మండలం గడ్డంవారిపల్లె సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న వారిపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13 మంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు పందెం కోళ్లు, రూ.20,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో మల్లికార్జున, రవిశంకర్, సుబ్బరాయుడు, బాలరాజు, చంద్ర, శంకరయ్య, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, రవిశంకర్, వీరయ్య, సుంకయ్య, చంద్రకాంత్, నవీన్‌కుమార్ ఉన్నారని పోలీసులు తెలిపారు. పూచీకత్తుపై వారందరినీ వదిలేశామని, గురువారం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని మిద్దెకాడపల్లెలో కోడిపందెం ఆడుతున్న పది మందిని అరెస్టు చేశారు. వారి నుండి మూడు కోడి పుంజులు, రూ.3140 నగదును స్వాధీనం చేసుకున్నారు. గాలివీడు మండలంలోని గుండ్లచెరువులో కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించారు. గుండ్లచెరువు వద్ద ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,010 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లె కోర్టులో వారిని హాజరుపరుస్తామని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా జి.కొండూరు మండలంలో విచ్చలవిడిగా నిర్వహించిన కోడిపందాల శిబిరాల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న దుకాణాలపై మైలవరం ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం దాడులు చేసి ముగ్గుర్ని అరెస్టు చేశారు. ఆత్కూరు, కవులూరు గ్రామాల్లో జరిగిన ఈ దాడుల్లో అనాధికారికంగా మద్యం విక్రయిస్తున్న జి.కొండూరుకు చెందిన బాసుపోగు దుర్గారావు, ఆత్కూరుకు చెందిన బొజ్జెడ్ల శ్రీనివాసరావు, కవులూరుకు చెందిన నూతక్కి రాములను అరెస్టు చేశారు.

ఎన్నికల ముందు జగన్ సెల్ఫ్‌గోల్

కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఒక కల్పితం
మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికలకు ముందు ఎప్పుడూ వైసిపి నేత జగన్మోహన్‌రెడ్డి సెల్ఫ్‌గోల్‌లో పడుతుంటారని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు. లోటస్‌పాండ్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆయన బృందం జగన్‌ని కలవడం కూడా అలాంటిదేనని వ్యాఖ్యానించారు. బుధవారం సాయంత్రం విశాఖలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి గంటా మాట్లాడారు. గతంలో కూడా జగన్ తమ ఎంపీలను రాజీనామాలు చేయించడం, అసెంబ్లీ నుంచి బాయ్‌కాట్‌లు, షర్మిలా ఫిర్యాదులు వంటివి దీన్నే తెలియజేస్తున్నాయన్నారు. పరిణితిలేని రాజకీయ నాయకుడైన కెసిఆర్‌తో కలిసి ఈ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. థర్డ్ ఫ్రంట్ అని ప్రకటించారని, అది ఒక కల్పిత కథని విమర్శించారు.

పండగ పూట విషాదం..

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి-మార్కాపురం(ప్రకాశం)

మద్యానికి బానిసైన వ్యక్తి కట్టుకున్న భార్య నిద్రిస్తుండగా గొడ్డలితో నరికి హత మార్చాడు. ఈ దారుణ సంఘటన ప్రకాశం జిల్లా మార్కాపురంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సంక్రాంతి పండుగ రోజున విషాదం చోటు చేసుకోవడంతో ఇరుగు పొరుగు వారంతా ఉలిక్కిపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మార్కాపురం మండలంలోని కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన కొసనాల శరభయ్యతో మార్కాపురంని పలకల పారిశ్రామివాడకు చెందిన పార్వతి (30)కి 13 ఏళ్ల క్రితం వివాహమైంది. నిత్యం మద్యం తాగేందుకు భార్యను వేధించే శరభయ్య మంగళవారం రాత్రి గాఢనిద్రలోకి జారుకున్న భార్య పార్వతి తలపై గొడ్డలితో నరికి చంపాడు. వెనువెంటనే శరభయ్య పారిపోయాడు. ఏదో జరిగిందని ఇరుగు పొరుగు వారంతా గుమికూడే సరికి దారుణం జరిగిపోయింది. తల్లి మరణంతో చిన్నారుల ఆర్తనాదాలు చూపరులను కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం



గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండలో బోల్తాపడిన ట్రాక్టర్

ప్రజాశక్తి - పిడుగురాళ్ల/తాడికొండ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా పిడుగురాళ్ల, గుంటూరు, తాడికొండ మండలాల్లో మంగళ, బుధవారాల్లో వాటిల్లిన పలు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. ప్రమాద ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల మండలం గుత్తికొండలో నలుగురు రైతులు తమ పొలాల్లోని వరి గడ్డిని ఇంటికి తరలించేందుకు ట్రాక్టర్‌పై మంగళవారం వెళ్లారు. ట్రాక్టర్‌ను జూకల్లు మేజర్ కాల్వ నుండి పొలాల్లోకి దింపే క్రమంలో అదుపుతప్పి కాల్వలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో జిలుగు నారాయణ (62), యడ్లపల్లి నాగరత్తయ్య (61) ట్రాక్టర్ కింద పడి మృతి చెందగా నలబోతు బుజ్జిబాబు, తేలుకుట్ల వెంకటేశ్వర్లు పక్కకు దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. అమరావతి మండలం పొందుగలకు చెందిన తాడేపల్లి భాగ్యలక్ష్మీ కుటుంబ సభ్యులతో కలిసి తన పుట్టిల్లు గుంటూరు సమీపంలోని ఏటుకూరుకు ఆటోలో వెళ్తోంది. వేగంగా వెళ్తున్న ఆటో తాడికొండ మండలం లాంఫాం వద్దకు రాగానే బోల్తా కొట్టడంతో భాగ్యలక్ష్మి కుమార్తె లక్ష్మీతులసి (11) మృతి చెందింది. ఇదిలా ఉండగా గుంటూరులోని గోరంట్ల వద్ద గల అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న కోట రాజశేఖర్ (35) బుధవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. హిందూ కళాశాల కూడలిలో వృద్ధురాలిని బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది.



గాల్లో తేలినట్టుండే..

సీతంపేటలో ముగిసిన ఏరో స్పోర్ట్సు ఫెస్ట్
రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన పర్యాటకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మన్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఆకాశయానం ఆహ్లాదకరంగా ముగిసింది. 'సాహసం చేయరా... డింభకా' పేరుతో మునుపెన్నడూ లేని విధంగా గాల్లో తేలే విన్యాసాలను చూసి పర్యాటకులు పరవశించిపోయారు. ఇదంతా ఎక్కడో కాదు.. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా సీతంపేట కొండల్లో జరగడం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా నిర్వహించిన ఈ సాహస క్రీడలు పర్యాటకులను, స్థానికులను మంత్రముగ్ధులను చేశాయి. పలువురు సాహసకులు గాల్లో విహరించి కొత్త అనుభూతికి లోనయ్యారు. నాలుగురోజుల పాటు జరిగిన ఈ ఫెస్ట్‌కు రాష్ట్రంలో నుంచే కాకుండా ఒడిశా నుంచీ సందర్శకులు వచ్చారు.

కనువిందు చేసిన సాహస క్రీడలు

సీతంపేట ఐటిడిఎ కేంద్రంలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం నుంచి నిర్వహించిన ఏరో స్పోర్ట్సు ఫెస్ట్-2019 (ఎయిర్ షో) బుధవారంతో ముగిసింది. బెంగళూరుకు చెందిన ఫ్రీకౌట్స్ అనే ప్రయివేట్ అడ్వెంచర్ సంస్థతో కలిసి పర్యాటక శాఖ, ఐటిడిఎ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఫెస్ట్‌కు పర్యాటకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ ఫెస్ట్‌ను రూ.80 లక్షల వ్యయంతో చేపట్టారు. ఢిల్లీ, కులుమనాలి నుంచి 15 మంది పైలట్లు, 40 మంది సాంకేతిక సిబ్బంది 40 వచ్చారు. వీరితో పాటు ఐటిడిఎ ద్వారా పారా మోటరింగ్‌లో శిక్షణ పొందిన ఇద్దరు గిరిజన పైలట్లు కూడా భాగస్వామ్యమయ్యారు. సాహస క్రీడలను నాలుగు విభాగాలుగా నిర్వహించారు. వాటిలో ఆరు పారామోటరింగ్, రెండు హాట్ ఎయిర్ బెలూన్లు, నాలుగు రిమోట్ కంట్రోల్ ఫ్లయింగ్స్, నాలుగు పారా సైలింగ్ యూనిట్లు ఉన్నాయి. ఎడ్వెంచర్ పార్కులోని రెండు మైదానాల్లో గ్రౌండ్ వన్‌లో రెండు హాట్ ఎయిర్ బెలూన్లలో విహంగం నిర్వహించారు. పారామోటారింగ్ దాదాపు 250 మంది, పారా సైలింగ్ 180 మంది చేశారు. హాట్ ఎయిర్ బెలూన్‌లో వంద మంది గగనంలో విహరించారు. పారామోటరింగ్‌కు రూ.వెయ్యి, పారా సైలింగ్‌కు రూ.200, హాట్‌ఎయిర్ బెలూనులో విహరించేందుకు రూ.500 టికెటు వసూలు చేశారు. తొలిరోజు ఆరు వేల మంది, రెండో రోజు ఎనిమిది వేల మంది, సంక్రాంతి రోజు, ముగింపు రోజు పదివేల మంది చొప్పున మొత్తం 34 వేల మంది పర్యాటకులు వచ్చారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, హైదరాబాద్ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు హాజరయ్యారు. ఒడిశాలోని భువనేశ్వర్, బరంపురం ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వచ్చారు. తొలిరోజు ఎయిరో ఫెస్ట్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, ఐటిడిఎ పిఓ లోతేటి శివశంకర్‌తో కలిసి హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించారు.

ప్రత్యేకం

సర్‌ఛార్జి నిధుల బట్వాడాలో ఎడతెగని జాప్యం

- ఏడాదిగా పెండింగ్‌లో బిల్లులు
- శానిటేషన్ నిర్వహణకు కూడా సొమ్ములు లేవంటున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పంచాయతీలకు రావాల్సిన వివిధ పద్దుల కింద రావాల్సిన నిధులు సకాలంలో రావడం లేదు. జిల్లాలో జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొనుగోలు దారుల నుంచి వసూలు చేసే సర్ ఛార్జి నిధులు గత ఆరు విడతలుగా రావాల్సి ఉంది. ప్రతి మూడు నెలలకు ఒక సారి ఈ నిధులను పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ సంబంధిత ఉప ఖజానా కార్యాలయం ద్వారా పంచాయతీలకు బదిలీ చేయాలి. కానీ 12 నెలలుగా ఇందుకు సంబంధించిన నిధులు పలు పంచాయతీలకు అందడం లేదు. ఒక్కో పంచాయతీకి కనీసం రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకూ నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా మొత్తం మీద గత ఏడాదిన్నర కాలంలో రూ.4.50 కోట్లవరకూ నిధులు పంచాయతీలకు రావాల్సి ఉంది. ఆగస్టు వరకు సర్పంచ్‌ల పాలన ఉండగా ఆ తరువాత ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చింది. పంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో వస్తున్నాయా లేదా అన్న అంశాన్ని జిల్లా పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. అటు ఖజానా శాఖ, ఇటు రిజిస్ట్రేషన్ శాఖ మధ్య సమన్వయం చేయాల్సిన పంచాయతీ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించడం లేదని గ్రామపంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. భూములు, ఇళ్లు, స్థలాలు ,ఇతర కొనుగోలుపై ప్రతి కొనుగోలు దారుడి నుంచి ఆస్తి విలువపై ఒకటిన్నర శాతం సర్ ఛార్జి రూపంలో రిజిస్ట్రేషన్‌శాఖ వసూలు చేస్తుంది. ఈ నిధులను స్థానిక సంస్థలకు కేటాయిస్తుంది. ప్రధానంగా ఆయా గ్రామాల పరిధిలో జరిగే కొనుగోలుకు సంబంధించి జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీకి సర్ ఛార్జిలు మూడు భాగాలుగా చేసి నిధులను ఖజానా శాఖ ద్వారా బదిలీ చేస్తారు. ఈ నిధులు కూడా రాకపోవడం వల్ల పంచాయతీల్లో ప్రస్తుతం కనీసం శానిటేషన నిర్వహణకు కూడా నిధులు ఉండటంలేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. సిఆర్‌డిఏ పరిధిలో క్రయ విక్రయాలు ఎక్కువగా జరుగుతుండటం వల్ల ఈ ప్రాంతంలో స్థానిక సంస్థలకు కొంత ఆదాయం అధికంగా వస్తుంది. బాపట్ల, రేపల్లె, వినుకొండ, మాచర్ల, నర్సరావుపేట తదితర నియోజకవర్గాల్లో ఆదాయం తక్కువగా వస్తుంది. మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు,తాడికొండ,పెదకాకాని, నల్లపాడు,కొరిటపాడు సబ్ రిజిస్ట్రార్‌ల పరిధిలో ఒక్కో పంచాయతీకి సగటున రూ.15 నుంచి రూ.30 లక్షల వరకూ సర్‌ఛార్జి నిధులు రావాల్సి ఉంది. గతేడాదిన్నరగా ఈ నిధుల రావడం లేదని తాడేపలి, మంగళగిరి మండలంలోని పలువురు కార్యదర్శులు తెలిపారు. తాము ఖజానా కార్యాలయాలకు ఎప్పటికిప్పుడు నిధులు పంపుతున్నామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెలిపారు. సిఎఫ్ఎంఎస్ విధానం వల్ల నిధులు పంచాయతీలకు పంపడంలో జాప్యం జరుగుతుందని చెబుతున్నారు. అయితే ప్రతి పంచాయతీ కార్యదర్శిగా వ్యక్తిగతంగా పిడి ఖాతాలు ఉన్నా నిధుల బదలాయింపులో ఖజానా అధికారులు ఏదో సాంకేతిక సమస్య చూపి జాప్యం చేస్తున్నారని పంచాయతీ అధికారులు ఆరోపిస్తున్నారు.



శ్రీకాకుళం జిల్లా సంగమేశ్వర కొండపైకి వెళ్తున్న యాత్రికులు

సంగమేశ్వరకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస (శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలోని సంగమేశ్వర జాతరకు యాత్రికులు పోటెత్తారు. ప్రతి ఏటా సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో జరిగే ఈ జాతరకు ఆమదాలవలసతో పాటు బూర్జ, సరుబుజ్జిలి, ఎల్‌ఎన్‌పేట, శ్రీకాకుళం రూరల్ తదితర మండలాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండపైన ఉన్న ఈ ఆలయంలోని సంగమేశ్వర స్వామిని బుధవారం వేలాది మంది దర్శించుకున్నారు. ఆలయంలోని బౌద్ధ, శైవ, జైన మతాలకు సంబంధించిన విగ్రహాలను తిలకించారు. లావేరు మండలంలోని గుర్రాలపాలెం గ్రామంలోని గురమ్మ పేరంటాలు జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఏటా సంక్రాంతి రోజుల్లో మూడు రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.

తమిళనాడు జల్లికట్టులో 57 మందికి గాయాలు!

మదురై : తమిళనాడులోని మదురైలో సంక్రాంతి పండుగ సందర్భంగా సాంప్రదాయక క్రీడ జల్లికట్టు మొదలైంది. కాగా, ఈ ఏడాదిలో నిర్వహించిన మొదటి జల్లికట్టులో ఇప్పటివరకు 57 మందికి గాయాలైనట్టు సమాచారం. మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ మార్గదర్శ కాలను అనుసరించి ఈ ఈవెంట్‌ను జిల్లా అధికార యంత్రాంగమే నిర్వహిస్తున్నది. జల్లికట్టులో సాధారణంగా చుట్టు కంచె కట్టివున్న మైదానంలో పాల్గొనే వ్యక్తులతో పాటు రెండు దున్నపోతులను వదిలిపెడతారు. ఆ దున్నపోతుల మువురం సహాయంతో వాటిపై స్వారీ చేసేందుకు క్రీడలో పాల్గొన్నవారు యత్నిస్తుంటారు. హింసాత్మకంగా సాగే ఈ క్రీడలో మదురైలో ఇప్పటి వరకు 44మంది వ్యక్తులు గాయపడ్డారు. ఇందులో ఎనిమిది మంది తీవ్రంగా గాయాలపాలవ్వగా రాజాజీ ఆస్పత్రికి తరలించారు. కాగా, పుదుక్కోట్టాయ్ జిల్లాలో మొదటిరోజే 13మంది గాయపడినట్టు తెలిసింది. మదురై జిల్లా అధికారులు ఈ క్రీడలో పాల్గొనేవారికి ముందస్తుగా ఇన్సూరెన్స్ స్కీంకు దరఖాస్తు చేయిస్తారు.



తమిళనాడులోని మధురైలో బుధవారం జరిగిన జల్లికట్టు దృశ్యం

బ్యాంకుల విలీనాన్ని ఆపండి : సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాన్ని తక్షణమే నిలిపివేయాలని సిపిఎం పొలిట్ బ్యూరో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఒక ప్రకటనను జారీ చేసింది. విజయ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, దేనా బ్యాంక్‌లను విలీనం చేసేందుకు ప్రభుత్వం తొందరపడటంపై పొలిట్ బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విలీనం చేయనున్న బ్యాంకుల ఉద్యోగులు, అధికారులు, బ్యాంకింగ్ పరిశ్రమ యావత్తు వ్యతిరేకి స్తున్నప్పటికీ వారిని నిర్లక్ష్యం చేస్తూ విలీనానికే ముందుకు వెళ్తున్న ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించింది. సంబంధిత బ్యాంకులను బలోపేతం చేసేందుకే వాటిని సంఘటితం చేస్తున్నట్లు చెబుతూ వాటి విలీనాన్ని ప్రభుత్వం సమర్థించు కుంటుంది. కాని ఆ మూడు బ్యాంకులను విలీనం చేసిన తరువాత అవి మరింత బలహీన పడతాయన్న వాస్తవాన్ని ప్రభుత్వం గ్రహించడం లేదని పేర్కొంది. బడా కార్పొరేట్ సంస్థలు ఉద్దేశ పూర్వకంగా రుణాలను తిరిగి చెల్లించక పోవడంతోనే ప్రభుత్వ రంగ బ్యాంకులకు సమస్యలు ఉత్పన్న మవుతున్నాయని పొలిట్ బ్యూరో తెలిపింది. బ్యాంకులను విలీనం చేయడమనేది పరిష్కారం కాదని, దానికి బదులుగా ఉద్దేశ పూర్వకంగా రుణాలు ఎగ్గొట్టిన బడా కార్పొరేట్ సంస్థల నుండి వాటిని వసూలు చేయడంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలు, విధించే జరిమానాలతోనే పరిష్కారం లభిస్తుందని తెలిపింది. ఇందుకు భిన్నంగా ప్రభుత్వం ఆయా కార్పొరేట్ సంస్థల పట్ల ఉదార వైఖరిని అనుసరిస్తున్నదని పేర్కొంది. అంతేకాక కార్పొరేట్ సంస్థలు చట్టంలోని ఐబిసి (ఇన్ సాల్వెన్సి అండ్ బాంక్రప్టసీ కోడ్) విధానంలో చెల్లించలేని రుణాలకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వ రంగ బ్యాంకులపై ఒత్తిడి తెస్తున్నాయని తెలిపింది. బ్యాంకుల ప్రాథమిక సమస్యలను పరిష్కరించేందుకు విలీనం చేసుకుంటూ పోతే ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, పలు బ్యాంకు శాఖలను మూసివేయాల్సి ఉంటుందని పొలిట్ బ్యూరో వివరించింది. అంతేకాక మూరు మూల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు అందే బ్యాంకింగ్ సేవలపై ప్రభావం పడుతుందని కూడా తెలిపింది.

జాదవ్‌పూర్ వర్సిటీ ప్రొఫెసర్‌పై చర్యలు

బోధించడం సహా క్యాంపస్‌లోకి ప్రవేశించడంపై ఆంక్షలు



కోల్‌కతా : యువతుల కన్యత్వాన్ని సీల్డ్ బాటిల్ లేదా సీల్డ్ ప్యాకెట్‌తో పోల్చిన జాదవ్‌పూర్ వర్సిటీ 'పర్వర్ట్' ప్రొఫెసర్ కనక్ సర్కార్ ఫేస్‌బుక్ పోస్టు వైరలయిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుపై నిరసన తెలుపుతూ విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులతోపాటు బెంగాల్‌కు చెందిన అనేకులు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలు ఉధృతమవడంతో వర్సిటీ వీసీ చర్యలకు ఉపక్రమించారు. ప్రొఫెసర్ స్థాయి వ్యక్తి ఈ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వీసీ అన్నారు. ప్రొఫెసర్ కనక్ సర్కార్ ప్రసిద్ధ జాదవ్‌పూర్ వర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. కాగా, ఆయన అనుచిత వ్యాఖ్యల అనంతరం ఆ శాఖ హెడ్ ఓం ప్రకాశ్ మిశ్రాతో సమావేశమైన సిబ్బంది, విద్యార్థులు.. కనక్ సర్కార్‌ను విధుల్లో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మిశ్రా వీసీకి తెలిపారు. వీసీతో సమావేశానంతరం.. విచారణ పూర్తయ్యేవరకు కనక్ సర్కార్ క్యాంపస్‌లోకి ప్రవేశించేందుకు అనుమతిని నిరాకరిస్తున్నట్టు మిశ్రా ప్రకటించారు. 18లోపు ఆయన స్థానంలో వేరే బోధకుడిని నియమిస్తారని తెలిపారు.

అనంతపురం స్టోన్ క్రషర్ల పునరుద్ధరణకు ఎన్జీటీ నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అనంతపురం జిల్లా నేమికల్లులో స్టోన్ క్రషర్‌ల పునరుద్ధరణకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటి) నిరాకరించింది. నేమికల్లులో స్టోన్ క్రషర్‌లు పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని, వాటివల్ల పరిసర గ్రామాలు కాలుష్యానికి గురవుతున్నాయని ఎన్జీటీలో హీరోజిరావు పిటిషన్ దాఖలు చేశారు. నేమికల్లులో స్టోన్ క్రషర్‌లకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై బుధవారం ఎన్జీటిలో విచారణ జరిగింది. స్టోన్ క్రషర్‌లను మూసివేయాలని ఏపి కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇవ్వాలని కంపెనీ యజమాన్యం కోరింది. అందుకు ఎన్జీటీ నిరాకరించింది. ఒక్క కంపెనీ కూడా పూర్తి స్థాయి పర్యావరణ నిబంధనలు పాటించడం లేదని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, ఎన్జీటికి నివేదిక సమర్పించింది. ధన్‌బాద్ మైన్స్ ఐఐటి అధ్యయనం జరపడానికి ఏపి ప్రభుత్వం మూడు నెలల సమయం కోరింది. ఆరు వారాల్లో అధ్యయం చేయాలని ఎన్జీటి ఆదేశించింది. ఎన్జీటి కమిటీ వేసి తనిఖీలు జరిపే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ట్రిబ్యునల్ ప్రశ్నించింది. కంపెనీ యాజమాన్యం చంపేస్తామని బెదిరిస్తున్నదని పిటిషనర్ పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎన్జీటి సూచించింది.

సిబిఐ డైరెక్టర్ నియామకం పిటిషన్‌పై సత్వర విచారణకు సుప్రీం 'నో'

న్యూఢిల్లీ : సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావును నియమించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సత్వర విచారణను సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. క్రమానుగతంగా ఈ పిటిషన్‌పై వచ్చేవారం విచారణకు రావచ్చని జస్టిస్ రంజన్‌గొగోయ్ తెలిపారు. సిబిఐ డైరెక్టర్ నియామకంలో ప్రభుత్వం చట్టబద్ధమైన నిబంధనలను అడ్డుకుందని పిటీషనర్ పేర్కొన్నారు. సిబిఐ డైరెక్టర్ నియామకంలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, చీఫ్ జస్టిస్‌లతో కూడిన ఎంపిక కమిటీని ఏర్పాటు చేయాలనే నిబంధనను తోసిపుచ్చిందని 'కామన్‌కాజ్' ఎన్‌జిఒ ప్రతినిధులు, కార్యకర్త అంజలి భరద్వాజ్‌లు దాఖలు చేసిన పిటీషన్‌లో తెలిపారు. సిబిఐ డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమించడం చట్టవ్యతిరేకమని,ప్రభుత్వం ఏకపక్షంగా, అనైతికంగా ఈ నిర్ణయం తీసుకుందని వారి తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డిఎస్‌పిఇ) చట్టం 1946లోని సెక్షన్ 4ఎ ప్రకారం ప్రభుత్వ ప్రమేయం లేకుండా అత్యున్నత అధికారాలను కలిగిన స్పెషల్ కమిటీ ద్వారానే సిబిఐ డైరెక్టర్‌ను నియమించాలని పేర్కొన్నారు. అలాగే డిఎస్‌పిఇ సవరించిన లోక్‌పాల్, లోకాయుక్త చట్టం 2013 ప్రకారం సిబిఐ డైరెక్టర్ నియామకంలో ప్రభుత్వ ప్రమేయం తగదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా గతేడాది అక్టోబర్ 23న అలోక్ వర్మను తొలగించి ఆయన స్థానంలో నాగేశ్వరరావును నియమించింది. ఈ నియామకాన్ని సుప్రీంకోర్టు జనవరి 8న రద్దు చేసింది. అయితే జనవరి 10న ఆదేశాల ప్రకారం కేబినెట్ నియామక కమిటీ వర్మను ఆస్థానం నుండి తొలగిస్తూ నాగేశ్వరరావును పునర్ నియమిస్తూ ఆదేశించడం సరికాదని పిటిషన్‌లో పేర్కొంది.

శబరిమల ఆలయంలో ప్రవేశానికి మరో ఇద్దరు మహిళల యత్నం

కేరళ : ఆలయం వద్ద మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం తెల్లవారుజామున మరో ఇద్దరు మహిళలు ఆలయంలోకి వెళ్లేందుకు యత్నించగా.. హిందూత్వ శక్తులు వారిని అడ్డుకున్నాయి. తొమ్మిదిమంది సభ్యుల బృందంతో బయలుదేరిన ఈ ఇద్దరు మహిళలను పంబా బేస్ క్యాంప్ దాటిన తర్వాత నిరసనకారులు అడ్డుకున్నారు. వారిని చుట్టుముట్టి.. పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాగా, 41 రోజుల దీక్షను తాము పూర్తి చేశామనీ, స్వామి దర్శనం చేసుకోకుండా తాము ఇంటికి వెళ్ళేదిలేదని ఆ మహిళలు పట్టుపట్టారు. హిందూత్వశక్తుల నిరసన నడుమ పోలీసులు వారికి రక్షణగా నిలిచారు. ప్రత్యేక వాహనంలో ఆ మహిళలిద్దరినీ సురక్షిత ప్రాంతానికి తరలించారు. తాను దీక్ష ప్రారంభించిననాటి నుంచి చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయని ఆ ఇద్దరు మహిళల్లో ఒకరైన రేష్మా నిషాంత్ చెప్పారు.

'ఆలయంలోకి అన్ని వయసుల మహిళలు వెళ్లేందుకు అయ్యప్పస్వామికి ఎలాంటి అభ్యంతరం లేదు. మమ్మల్ని ఆలయంలోకి వెళ్ళకుండా వీరంతా ఎందుకు అడ్డుకుంటున్నారు?' అని ఆమె ప్రశ్నించారు.

కనకదుర్గపై దాడి

ఇటీవల కేరళలోని శబరిమల ఆలయంలోకి ప్రవేశించి చరిత్ర సృష్టించిన ఇద్దరు మహిళల్లో ఒకరైన కనకదుర్గపై దాడి కనకదుర్గ నిన్న (సోమవారం) తన అత్తింటికి తిరిగి రాగా, ఆమెపై సొంత అత్తే దాడి చేసి, తలపై బలంగా కొట్టింది. ప్రస్తుతం మల్లాపురం జిల్లాలోని ఓ ఆసుపత్రిలో కనకుదుర్గ చికిత్స పొందుతున్నది.

కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై మోడీ అక్కసు

శబరిమలపై ప్రభుత్వ వైఖరి అవమానకరమంటూ విసుర్లు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై మంగళవారం నాడు తీవ్రంగా విరుచుకుపడ్డారు. శబరిమలలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కచ్చితంగా అమలు చేస్తున్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అభినందించడానికి బదులు తూలనాడారు. శబరిమలపై సిపిఐ(ఎం) వైఖరి అవమానకరంగా వుందని మోడీ వ్యాఖ్యానించారు. కొల్లాంలో రెండు ప్రాజెక్టులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిపిఐ(ఎం) ప్రభుత్వం శబరిమల విషయంలో అనుసరించిన వైఖరి చరిత్రలో అత్యంత అవమానకర చర్యగా నిలిచిపోతుందని అన్నారు. సిపిఎం ప్రభుత్వానికి ఆధ్యాత్మికత అన్నా, మతం అన్నా గౌరవం లేదని మనకు తెలుసు, కానీ, ఇంత అవమానకరంగా వారు వ్యవహరిస్తారని ఎవరూ అనుకుని వుండరని ప్రధాని వ్యాఖ్యానించారు.

కర్ణాటకలో రాష్ట్రపతి పాలనకు బిజెపి కుట్ర!

- ముంబయి హోటల్‌లో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- కాంగ్రెస్, జెడిఎస్ సర్కార్‌కు మద్దతు ఉపసంహరించిన ఇద్దరు స్వతంత్రులు
- బిజెపి కుట్రలపై కాంగ్రెస్, జెడిఎస్ మండిపాటు
- త్వరలోనే సంక్షోభం సమసిపోతుంది : కుమారస్వామి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కర్ణాటకలో రాష్ట్రపతి పాలన విధించేందుకు బిజెపి కుట్రలు పన్నుతోంది. ప్రస్తుత కాంగ్రెస్-జెడిఎస్ ప్రభుత్వాన్ని కూలదోసే యత్నాలు ముమ్మరం చేసింది. ముంబయి, ఢిల్లీ కేంద్రాలుగా ఎమ్మెల్యేలతో క్యాంప్ రాజకీయాలు నడుపుతోంది. "ఆపరేషన్ బిజెపి" పేరుతో కుమార స్వామి సర్కార్‌ను కూల్చేందుకు అధిష్టానం దన్నుతో కర్నాటక బిజెపి అధ్యక్షుడు యడ్యూరప్ప కుతంత్రాలు పన్నుతున్నారు. మంత్రి పదవులతోపాటు పెద్ద ఎత్తున డబ్బుతో బేరసారాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే ముగ్గురు కాంగ్రెస్ అసంతృప్తి ఎమ్మెల్యేలను ముంబాయిలోని ఒక హోటల్‌లో వుంచారు. మరో వైపు కుమార స్వామి సర్కార్‌కు తమ మద్దతు ఉపసంహరించు కుంటున్నట్లు ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ప్రకటించారు. బిజెపి ఇబ్బందులు సృష్టిస్తోంది. త్వరలోనే సంక్షోభం సమసిపోతుందని కర్ణాటక ముఖ్యమంత్రి కుమార స్వామి చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఒక నామినేటేడ్ ఎమ్మెల్యే ఉన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మ్యాజిక్ ఫిగర్ 113 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. కాంగ్రెస్‌కు చెందిన 80 మందితో పాటు జెడిఎస్‌కు చెందిన 37 మంది. బిఎస్పీకి చెందిన ఒక సభ్యునితో కలిపి 1 మొత్తం 118 మంది మద్దతుతో కుమారస్వామి సారథ్యంలో సంకీర్ణం ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇద్దరు స్వతంత్రులు కూడా ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. కాగా బిజెపికి చెందిన 104 మందితోపాటు కెపిజెపికి చెందిన ఒక సభ్యుడు ప్రతిపక్షంలో ఉన్నారు. అయితే ముంబయిలో మకాం వేసిన ముగ్గురు కాంగ్రెస్ సభ్యులతోపాటు ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఆర్. శంకర్, హెచ్ నగేష్‌లు ప్రతిపక్షం వైపు మొగ్గు చూపవచ్చన్న వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో కుమారస్వామి ప్రభుత్వానికి ముప్పు పొంచి వుంది. ఈ ఐదుగురిని మినహాయిస్తే అధికార పక్ష బలం 115కి తగ్గగా, మరో ముగ్గురు 'చే'జారితే ప్రభుత్వం మైనారిటీలో పడుతుంది. మరోవైపు ఫిరాయింపులపై దృష్టి పెట్టిన బిజెపి మరో నలుగురు ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పు కొనే యత్నాల్లో వుంది.



మరో పది మంది ఎమ్మెల్యేలు టచ్‌లో తమకు టచ్‌లో ఉన్నారని బిజెపి నేతలు చెప్పుకుంటున్నారు. ఈ ఫిరాయింపు రాజకీయాలపై కాంగ్రెస్, జెడిఎస్ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. తమ ఎమ్మెల్యేలను కాపాడుకొనే యత్నాలను పెద్ద ఎత్తున ప్రారంభించారు. తమ ప్రభుత్వానికి ఎటువంటి ప్రమాదం లేదని ముఖ్యమంత్రి కుమార స్వామి, కాంగ్రెస్ సీనియర్ నేత, ఉప ముఖ్యమంత్రి జి.పరమేశ్వరలు పేర్కొన్నారు. ఎమ్మెల్యేలంతా తమకు టచ్‌లోనే ఉన్నారని మంత్రి డికె శివకుమార్ తెలిపారు.

ప్రభుత్వాన్ని కూలదోసి, తద్వారా కాంగ్రెస్ చేతకానితనం వల్లనే ప్రభుత్వం కూలిపోయిందని ప్రచారం చేసేందుకు బిజెపి యోచిస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం కూలిపోయిన అనంతరం తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా రాష్ట్రపతి పాలన పెట్టేందుకు చర్చలు జరుపుతోంది. ఎందుకంటే ఒకవేళ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే రాబోయే సాధారణ ఎన్నికల్లో బిజెపికి నష్టం జరుగుతుందన్న అంచనాతో ఆ పార్టీ ఉంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్, జెడిఎస్ ప్రభుత్వం వుండగా, ఎన్నికలు జరిగితే తమకు నష్టం జరుగుతుందని కమలనాధులు భావిస్తున్నారు. గవర్నర్ పాలనలో ఎన్నికలకు వెళ్తే అధికార యంత్రాంగాన్ని తమకు అనుగుణంగా మార్చు కోవచ్చని బిజెపి నేతలు భావిస్తున్నారు. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తే మంచి ఫలితం దక్కుతుందని కమలనాధులు భావిస్తున్నారని సమాచారం. అయితే బిజెపి కుట్రలను కాంగ్రెస్, జెడిఎస్‌లతో పాటు ఇతర ప్రతిపక్షాలు కూడా తిప్పి కొట్టేందుకు సిద్ధమౌతున్నాయి.

రేపు కాంగ్రెస్ శాసనసభా పక్షం భేటీ

కర్ణాటకలో ఫిరాయింపులకు బిజెపి తెరదీసిందన్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీ శుక్రవారం ఇక్కడ పార్టీ శాసనసభా పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కర్ణాటకలో అధికారంలో కొనసాగుతున్న జెడి(ఎస్)-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వానికి ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకున్న అనంతరం తమ పార్టీ ఎమ్మెల్యేలతో కూడా బిజెపి బేరసారాలు కొనసాగిస్తుందేమోనన్న ఆందోళనల మధ్య ఈ సమావేశం జరగనుండడం ప్రాధాన్యత సంచరించుకుంది.

మోడీ సర్కార్‌పై పోరు

- ఫిబ్రవరి 19న ఛలో ఢిల్లీకి విద్యార్థి సంఘాల పిలుపు
- పార్లమెంట్ స్ట్రీట్‌లో భారీ మార్చ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యా రంగానికి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోడీ సర్కార్‌పై పోరుకు విద్యార్థి సంఘాలు సన్నద్ధమయ్యాయి. రైతులు, కార్మి కులు, యువత వంటి వర్గాలు ఇప్పటికే మోడీ సర్కార్ విధానాలకు నిరసనగా భారీ ఉద్యమాలు నిర్వహించారు. ఈ పోరాటంలో భాగంగా ఫిబ్రవరి 19న ఢిల్లీలో భారీ మార్చ్‌కు విద్యార్థి సంఘాలు పిలుపు నిచ్చాయి. మోడీ సర్కారు పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్య మౌతోందని ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్య దర్శి మయూక్ బిశ్వాస్ విమర్శించారు. యూనివర్శిటీల్లో స్వతంత్ర భావాలు వ్యక్తం పరచడం కూడా నేరంగా భావిస్తున్నారని దుయ్యబట్టారు. బుధ వారం నాడిక్కడ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వామపక్ష, సామాజిక విద్యార్థి సంఘాలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మయూక్ బిశ్వాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ వినాశనానికి పాల్పడుతోందని, వర్శిటీలోని దళిత, గిరిజన విద్యార్థులకు ఫెలోషిప్ ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు మోడీ సర్కారు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఫెలోషిప్‌లు ఇప్పటికీ ఇవ్వని పరిస్థితి ఎన్నో యూనివర్శిటీల్లో ఉందని, ప్రభుత్వం విద్యా సంస్థలకు ఇవ్వాల్సిన తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైబ్రెంట్ గుజరాత్ సమ్మిట్‌కు అనిల్ అంబానీకి అందని ఆహ్వానం

న్యూఢిల్లీ : జనవరి 18న ప్రధాని నరేంద్ర మోడీ గాంధీ నగర్‌లో ప్రారంభించనున్న వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌కు అనిల్ అంబానీకి ఆహ్వానం అందలేదు. రాఫెల్ యుద్ధ విమానాలకు సంబంధించి ప్రభుత్వానికి, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (ఎడిఎజి) ఛైర్మన్ అనిల్ అంబానీ పేరు లేకుండా ఆహ్వానితుల జాబితాను మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. రాఫెల్ యుద్ధ విమానాల తయారీ కంపెనీ అయిన డస్సాల్ట్ ఏవియేషన్ ప్రతినిధి కూడా హాజరు కావడం లేదని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. వైబ్రాంట్ గుజరాత్ సమ్మిట్లో భాగంగా రక్షణ శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో 'రక్షణ రంగం, అంతరిక్షంలో అవకాశాలు' అనే అంశంపై ప్రత్యేకంగా సదస్సు నిర్వహించనున్నారు. దీనికి ఎయిర్‌బస్ గ్రూప్ ఇండియా, లాక్‌హిడ్ మార్టిన్స్ ఏరోనాటిక్స్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారు.

పోలింగ్ రోజున పత్రికల్లో ప్రకటనలు నిషేధం

ఈసీ ప్యానెల్ ప్రతిపాదన

న్యూఢిల్లీ : పోలింగ్‌రోజున వార్త పత్రికల్లో ప్రకటనలు నిషేధించాలని ఈసీ ప్యానెల్ ప్రతిపాదించింది. ప్యానెల్ ప్రతిపాదనల మేరక ఎన్నికల చట్టంలో మార్పు తీసుకురావల్సి ఉంటుంది. కానీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇది సాధ్యమయ్యే విధంగా కనిపించడంలేదు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎన్నికల ప్రకటనలను టీవీల్లో ప్రసారం చేయకూడదన్న నిబంధనలు ఇప్పటివరకు ఎలక్ట్రానిక్ మీడియాపై మాత్రమే ఉంది. కానీ, వార్త పత్రికలను కూడా ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 126 పరిధి కిందకు తీసుకురావాలని కమిటీ సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదన ప్రకారం.. పోలింగ్ రోజున ఎన్నికల ప్రకటనలను రాజకీయ పార్టీలు ప్రచురించ కూడదు. 'కమిటీ సిఫారసు మేరకు చట్టంలో సవరణ చేయడం బడ్జెట్ సెషన్‌లో కుదిరేలా కనిపించటం లేదు' అని ఎన్నికల అధికారి ఒకరు తెలిపారు. ఇదిలా ఉండగా కమిటీ చేసిన ప్రతిపాదనలను ఈసీ మంగళవారం ప్రాథమికంగా ఆమోదించింది.

పడవ మునిగి ఐదుగురు మృతి

ముంబయి : పడవ బోల్తాపడటంతో ఐదుగురు మృతి చెందిన ఘటన మహారాష్ట్రలోని నందూర్‌బార్‌లో మంగళవారం చోటు చేసుకుంది. మరో 37మంది స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. మృతిచెందిన వారిలో నలుగురు 4 నుండి 12 ఏళ్లలోపు చిన్నారులు ఉన్నట్లు పేర్కొన్నారు. నండూర్ బార్ గ్రామానికి చెందిన సుమారు 70 మంది గిరిజనులు సమీపంలోని నర్మదా నదిని దాటేందుకు ఒక ప్రైవేట్ పడవను ఆశ్రయించారు. వీరంతా భూషా గ్రామంలో జరిగే మకర సంక్రాంతి వేడుకలకు హాజరయ్యేందుకు వెళ్తున్నారు.

అరుణాచల్‌లో బిజెపికి ఎదురుదెబ్బ

పార్టీని వీడుతున్నట్లు ప్రకటించిన మాజీ సిఎం గెగాంగ్

ఈటానగర్ : అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి గెగాంగ్ అపాంగ్ బిజెపిని వీడనున్నారు. అపాంగ్ ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు 23 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా విధులు నిర్వహించారు. 16 సంవత్సరాల క్రితం ఈశాన్యరాష్ట్రాలలో తొలిసారిగా అరుణాచల్‌లో అపాంగ్ బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. బిజెపిలో ప్రజాస్వామ్య విలువలు లేవని, ప్రజాసమస్యల పరిష్కారంపై కేంద్ర నాయకులు దృష్టిసారించడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు పార్టీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు అమిత్‌షా, తాసిర్‌గోయ్‌కు లేఖ రాశారు. బిజెపిలో వికేంద్రీకరణకు, ప్రజాస్వామ్యపరంగా నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కల్పించడం లేదని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఆడిటింగ్ వివరాలు ఇవ్వలేం...

రాఫెల్ ఒప్పందంపై ఆర్టీఐ దరఖాస్తుకు కాగ్ సమాధానం

న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందంపై ఆడిటింగ్ వివరాల్ని బయటపెట్టడానికి కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నిరాకరించింది. వివాదాస్పద యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం 'రాఫెల్ డీల్' విషయంలో ఆడిటింగ్ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదనీ, ఒకవేళ పూర్తయినా బహిర్గతం చేయటం పార్లమెంట్ అధికారాల్ని ధిక్కరించటమే అవుతుందనీ సమాచార హక్కు దరఖాస్తుకు సమాధానంగా కాగ్ పేర్కొన్నది.

దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న రాఫెల్ డీల్‌పై పూణేకు చెందిన సామాజిక కార్యకర్త విహార్ దుర్వే సమాచార హక్కు చట్టం ద్వారా కాగ్ ఆడిటింగ్ వివరాలు వెల్లడించాలని కోరారు. ఆర్టీఐ చట్టం సెక్షన్ 8(1)ప్రకారం కోరిన సమాచారాన్ని ఇవ్వలేమనీ, ఆడిటింగ్ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదనీ కాగ్ సమాధానమిచ్చింది. రాఫెల్ డీల్ కుంభకోణంలో రూ.58వేల కోట్ల అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. కాగ్ నివేదికను పార్లమెంట్ ప్రజా పద్దల సంఘానికి అందజేశామనీ, దేశ ప్రజలకు ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచామనీ సుప్రీంకోర్టులో కేంద్రం అఫడవిట్ దాఖలు చేయటం తెలిసిందే. దీంతో చివరికి సుప్రీంకోర్టును సైతం కేంద్రం తప్పుదారి పట్టిస్తోందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఆ ఒక్కటి తప్ప... (ఒప్పందంలో విమానాల ధరలు) మిగతా సమాచారం పార్లమెంట్ ముందు పెట్టామని మోడీ సర్కార్ సమర్థించుకుంటోంది. ఈ నేపథ్యంలో గందరగోళాన్ని పోగొట్టడం కోసం ఒప్పందం వివరాలు వెల్లడించాలని కాగ్‌ను ఆర్టీఐ కార్యకర్త కోరగా, అందుకు కాగ్ ససేమిరా అంటోంది. ఒప్పందంలో కొనుగోలు ధర వివరాలు చాలా రహస్యం, వాటిని ఎవరితోనూ పంచుకోమనీ, ఏ ప్రభుత్వ శాఖకు ఇవ్వమనీ కాగ్ తాజాగా పేర్కొంది.

ప్రత్యేకం

సిబిఐలో నిర్మాణాత్మక మార్పులు..!

ఇప్పటికే చర్యలు ప్రారంభించిన తాత్కాలిక డైరెక్టర్

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)లో సంస్థాగతంగా కొన్ని మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇందులో భాగంగా సంస్థలోని కొన్ని విభాగాలను ఏకం చేయడం, మరి కొన్నింటికి పేర్లు మార్చడం వంటివి జరగనున్నాయి. ఈ మేరకు ఆ సంస్థ తాత్కాలిక డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు ఇప్పటికే చర్యలు మొదలు పెట్టినట్టు విశ్వసనీయంగా తెలుస్తున్నది. ఈనెల 12న సంస్థ పాలసీ డివిజన్.. జాయింట్ డైరెక్టర్ ర్యాంకులో ఉన్న అందరు సీనియర్ అధికారులకు లేఖ రాసినట్టు సీబీఐ అధికారి ఒకరు తెలిపారు. సంస్థ మార్పుల్లో భాగంగా.. చెన్నై కేంద్రంగా పనిచేసే స్పెషల్ క్రైం బ్రాంచ్‌ను సూరత్‌కు తరలిపోనున్నది. అలాగే రెండో ప్రతిపాదనగా భోపాల్ జోన్‌ను హైదరాబాద్ జోన్‌లో విలీనం చేయనున్నారు. ధన్‌బాద్, రాంచీలలో ఉన్న జార్ఖండ్ బ్రాంచ్‌లను కోల్‌కతా జోన్‌తో, పాట్నా బ్రాంచ్‌లను లక్నో జోన్‌తో ఏకం చేయనున్నట్టు అధికారిక సమాచారం. అలాగే, ఈశాన్య భారత్‌లోని బ్రాంచ్‌లు కోల్‌కతా జోన్‌లో భాగం కానున్నాయి.

సిబిఐ కొత్త చీఫ్ నియామకంపై 24న కమిటీ భేటీ

మరోపక్క, సీబీఐ నూతన డైరెక్టర్ నియమించడం కోసం ప్రధాని నేతృత్వంలోని ఉన్నతస్థాయి ఎంపిక కమిటీ ఈనెల 24న సమావేశం కానున్నది. మొదట ఈ భేటీని 21న నిర్వహించాలని కేంద్రం ప్రతిపాదించినప్పటికీ లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కోరిక మేరకు 24కు వాయిదా వేశారు. ఈ కమిటీలో ప్రధాని మోడీ, సీజేఐ రంజన్‌గొగోయ్, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేలు సభ్యులుగా ఉంటారు. వీరు సీబీఐ కొత్త డైరెక్టర్‌ను నిర్ణయిస్తారు. ప్రస్తుతం డైరెక్టరు రేసులో ఎన్ఐఏ డీజీ వైసీ మోడీ ప్రథమ స్థానంలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా, సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ



దాఖలైన పిటిషన్ సుప్రీం కోర్టులో వచ్చేవారం విచారణకు రానున్నది. ఈమేరకు సర్వోన్నత న్యాయస్థానం ఆమోదం తెలిపింది. నాగేశ్వరరావు నియామకాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాది ప్రశాంత్ భూషన్ ద్వారా ఓ ఎన్జీవో ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టులో ఇటీవల దాఖలు చేసింది.

డైరెక్టర్ నియామకం వ్యవస్థలో జరగాలి : ఎంకె నారాయణన్

సీబీఐ డైరెక్టర్‌ను నియమించే ప్రస్తుత విధానాన్ని జాతీయ మాజీ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) ఎంకె నారాయణన్ తప్పుబట్టారు. దేశంలోనే అత్యున్నత సంస్థ అయిన సీబీఐలో అంతర్గత గొడవలపై ఆందోళన వ్యక్తం చేశారు. డైరెక్టర్ నియామకం అనేది వ్యవస్థలోనే జరగాలని, బయటి వ్యక్తుల ద్వారా కాదన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను ఉన్నతస్థాయి ఎంపిక కమిటీ 2-1తో తొలగించిన విషయం తెలిసిందే. ఈ చర్యతో కేంద్రంపై ప్రతిపక్షాలు, న్యాయ నిపుణుల నుంచి విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. అలాగే రాఫెల్ డీల్‌లో ప్రధాని మోడీ నిబంధలను పాటించలేదని, ఇది వాస్తవమన్నారు.

అఖిలేష్‌తో ఆర్‌ఎల్‌డి నేత జయంత్ చౌదరి భేటీ


సీట్ల పంపిణీపై చర్చ



న్యూఢిల్లీ : రానున్న లోక్‌సభ ఎన్నికలకు గాను ఉత్తర ప్రదేశ్‌లో సీట్ల పంపిణీపై చర్చలను ముందుకు తీసుకెళ్ళే ప్రక్రియలో భాగంగా రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డి) జాతీయ ఉపాధ్యక్షుడు జయంత్ చౌదరి బుధవారం సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జయంత్ చౌదరి మాట్లాడుతూ అఖిలేష్‌తో సమావేశం సౌహార్థ్ర వాతావరణంలో జరిగిందని, తమ ప్రయత్నాలు సఫలీకృతమవుతాయని తాను భావిస్తున్నానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిపై సంఘటితంగా పోరాడే లక్ష్యంతో ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పి, బిఎస్‌పిలు కూటమిని ప్రకటించిన నాలుగు రోజుల తరువాత వీరి సమావేశం చోటు చేసుకోవడం గమనార్హం. వాస్తవానికి చౌదరి ఈ నెల 9న యాదవ్‌తో భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలో ఏర్పాటు కానున్న ప్రతిపాదిత మహా కూటమిలో ఆర్‌ఎల్‌డి కీలక పాత్ర పోషించనున్నదన్న ఊహాగానాలు వెలువడ్డాయి. కాగా జయంత్ చౌదరి-అఖిలేష్ యాదవ్‌ల మధ్య బుధవారం దాదాపు గంటసేపు సమావేశం జరిగింది. కూటమికి ఒక రూపం తీసుకురావడం, సీట్ల పంపిణి తదితర విషయాలపై వారు చర్చించినట్లు సమాచారం. "మేము పలు అంశా లపై చర్చించుకున్నాం. ఇది ఒక అనధికారిక సమావేశం. దేశంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపైనే కాకుండా భవిష్యత్ కార్యాచరణపై కూడా చర్చించాం" అని చౌదరి తెలిపారు.

జర్మనీలో కార్మికుల సమ్మెతో వందలాది విమాన సర్వీసుల రద్దు

ఫ్రాంక్‌ఫర్ట్ : జర్మనీలో కనీస వేతనాల పెంపుదల కోసం కార్మికులు చేపట్టిన సమ్మెతో విమానాశ్రయాలలో ప్రయాణ, సరుకు రవాణా, తనిఖీ తదితర సేవలకు తీవ్ర విఘాతం కలిగింది. మంగళవారం నాడు వందలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. దేశంలో అత్యంత రద్దీతో వుండే ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలో భద్రతా సిబ్బంది కూడా వేతనాల పెంపుదల కోసం విధులు బహిష్కరించటంతో పరిస్థితి తీవ్రతరమైంది. ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలో ఆరుగంటల సేపు సమ్మె కొనసాగిస్తున్నామని, జర్మనీలో అత్యంత శక్తివంతమైన ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక వెర్డి ప్రకటించింది. దీనితో పాటు మ్యూనిచ్, హనోవర్, బ్రెమన్, హాంబర్గ్, లీప్జిగ్, డ్రెస్డన్, ఎర్ఫర్ట్ తదితర విమానాశ్రయాలలో సైతం సమ్మె ఇదే విధంగా కొనసాగుతోందని సంఘం వివరించింది. సమ్మె ప్రభావంతో విమాన సర్వీసుల రద్దు, జాప్యం కారణంగా దాదాపు 2.2 లక్షల మంది ప్రయాణీకులు వివిధ విమానాశ్రయాలలో చిక్కుకు పోయారని ఎడివి ఎయిర్‌పోర్ట్ అసోసియేషన్ వెల్లడించింది. సమ్మె కారణంగా ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయం నుండి బయల్దేరాల్సిన దాదాపు 1,200 విమాన సర్వీసుల్లో దాదాపు 617 సర్వీసులను అధికారులు రద్దు చేశారు.



ఆస్ట్రేలియాలో ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ఆస్ట్రేలియన్లు నీటి కొలనులో సేద తీరుతున్నారు.

నిప్పుల కుంపట్లుగా మారుతున్న ఆస్ట్రేలియా నగరాలు

సిడ్నీ : నైరుతి తీరం నుండి తాకుతున్న వేడి గాడ్పులతో ఆస్ట్రేలియన్ నగరాలు నిప్పుల కుంపట్లుగా మారుతున్నాయి. ఈ వేడిగాడ్పుల ఫలితంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగి పోతాయని వాతావరణ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దేశం లోని కొన్ని ప్రాంతాలలో గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలపైబడి నమోదవుతున్నాయని, ఇది గత రికార్డులకు సమానమని ఆస్ట్రేలియా వాతావరణశాఖ వెల్లడించింది. మంగళ వారం నాడు ఆస్ట్రేలియా దక్షిణ ప్రాంతంలో ఆల్‌టైమ్ రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ప్రపంచంలోని అత్యధిక ఉష్ణోగ్రత కలిగిన ప్రదేశాలలో ఒకటిగా ఈ ప్రాంతం రికార్డులకెక్కుతుందని వాతావరణశాఖ సీనియర్ మెటీరియాలజిస్ట్ చెప్పారు. అత్యధిక ఉష్ణోగ్రతలు బుధవారం కూడా కొనసాగే అవకాశం వుందని ఆయన వివరించారు. ఆస్ట్రేలియా దక్షిణ ప్రాంతంలోని అడవుల్లో తరచు కార్చిచ్చులు రగులుకుంటున్న నేపథ్యంలో ఇక్కడ వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావటం అసాధారణమేమీ కాదని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ఈ కార్చిచ్చులతో పాటు వాతావరణ మార్పుల నేపథ్యంలో పెరుగుతున్న సముద్ర, భూతల ఉష్ణోగ్రతలు ఆస్ట్రేలియా దక్షిణ ప్రాంతాన్ని నిప్పుల కుంపటిలా మార్చి వేస్తున్నాయంటున్నారు. ఆస్ట్రేలియా దక్షిణ ప్రాంతంతో పాటు ఉత్తరాదిన వున్న చిన్న పట్టణం టర్క్యూలాలో కూడా మంగళవారం నాడు 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావటం గమనార్హం. ఇతర నగరాలైన పోర్ట్ అగస్టాలో 48.9 డిగ్రీలు, అడిలైడ్‌లో 41.9 డిగ్రీల వంతున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బ్రెగ్జిట్ డీల్‌కు భారీ ఓటమి

432- 202 ఓట్ల తేడాతో వీగిన థెరిస్సా బ్రెగ్జిట్ డీల్

ఆ వెంటనే అవిశ్వాస తీర్మానం

లండన్ : థెరిస్సా మే బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటిష్ పార్లమెంట్‌లోని దిగువ సభ మంగళవారం 432–202 ఓట్ల తేడాతో తిరస్కరించింది. ఆ వెంటనే ప్రతిపక్ష నేత జెరిమి కార్బిన్ ప్రభుత్వంపై పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.. అవిశ్వాస తీర్మానం నెగ్గితే థెరిస్సా ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వస్తుంది. ఆ తరువాత 14 రోజుల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడితే సరే. లేకుంటే బ్రిటన్ తిరిగి తాజాగా ఎన్నికలకు వెళ్లాల్సి వుంటుంది. మంగళవారం నాడు 230 ఓట్ల తేడాతో ప్రభుత్వ బ్రెగ్జిట్ డీల్ వీగిపోవడం బ్రిటన్ చరిత్రలోనే అసాధారణ ఘటనగా పరిశీలకులు పేర్కొంటున్నారు. 1924లో ఒక సారి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు 166 ఓట్లతో వీగిపోయింది. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నెగ్గే విషయానికొస్తే చివరిసారి 1979లో అవిశ్వాసం గెలిచింది. అప్పుడు ఒక్క ఓటు తేడాతో లేబర్ పార్టీపై ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఆ తరువాత మార్గరెట్ థాచర్ నేతృత్వంలో టోరీ ప్రభుత్వం ఏర్పడింది.

బ్రెగ్జిట్ డీల్‌కు వ్యతిరేకంగా ఓటు చేసినవారిలో బ్రెగ్జిట్ అనుకూలురు, వ్యతిరేకులు ఉన్నారు. బ్రిటన్ వాణిజ్య ప్రయోజనాలకు అనుకూలంగా ఈ డీల్ వుందనేది కన్సర్వేటివ్స్‌లోని బ్రెగ్జిట్ అనుకూలుర వాదన. దీనిని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్న లేబర్ పార్టీ వాదన మరోలా వుంది. థెరిస్సా మే కుదుర్చుకున్నది బోగస్ బ్రెగ్జిట్ డీల్ అని, దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని లేబర్ పార్టీ పేర్కొంటోంది. ఉత్తర ఐర్లండ్‌కు చెందిన కొన్ని గ్రూపులు బ్రిటన్ ఇయులోనే కొనసాగాలని పట్టుబడు తున్నాయి. దాదాపు 71 మంది ఎంపీలు బ్రెగ్జిట్‌పై రెండవ రిఫరెండమ్‌కు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నారు. మరి కొన్ని పార్టీలు ఏ డీల్ లేకుండానే ఇయు నుంచి బ్రిటన్ నిష్క్రమించాలని కోరుతున్నాయి.

బుధవారం అవిశ్వాస తీర్మానంపై జరిగే ఓటింగ్‌లో మే నేతృత్వంలోని అధికార పక్షానికి ఓటమి తథ్యమని, అయితే ఓట్ల వ్యత్యాసం తక్కువగా వుండే అవకాశం వుందని పలువురు రాజకీయ వేత్తలు అభిప్రాయపడు తున్నారు. తాము బ్యాక్‌స్టాప్‌ను ప్రవేశపెట్టాలని కోరు కోవటం లేదని ఇయు నేతలు బ్రిటన్ ప్రభుత్వానికి పలుమార్లు హామీ ఇచ్చినప్పటికీ, బ్రిటన్ రాజకీయ వేత్తలు ముఖ్యంగా ఉత్తర ఐర్లండ్ నేతలు ఇటువంటిది భవిష్య త్తులో జరుగబోదన్న చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు ఇయు నేతలు నిర్ద్వంద్వంగా తిరస్క రిస్తున్నారు. ఈ సమస్యపై ఎటు వంటి పరిష్కారం లేకుండా రోజులు గడిచిపోతుంటే అనిశ్చితి కూడా పెరిగిపోతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రభు త్వాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థను మాత్రమే కాక యావత్ ప్రపంచాన్ని చిక్కుల్లోకి నెడుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

ఒక వేళ అవిశ్వాస పరీక్షలో ప్రధాని మే నెగ్గితే, బ్రెగ్జిట్ ప్రత్యామ్నాయంపై ఇతర రాజకీయ పార్టీలతో చర్చించేందుకు ఆమె చొరవ చూపే అవకాశం వుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ సంక్షోభంపై ఆమె బ్రస్సెల్స్‌లోని ఇయు నేతలతో కూడా చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నించే అవకాశాలున్నాయంటున్నారు. విశ్వాసపరీక్షలో నెగ్గితే ఆమె ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో సోమవారం నాడు మరోసారి హౌస్ ఆఫ్ కామన్స్‌కు వచ్చే అవకాశాలున్నాయి. థెరెస్సా మే రాజకీయ భవితపై సందేహాలు వ్యక్తం చేస్తున్న



నిపుణులు బ్రెగ్జిట్ ప్రత్యామ్నాయాలపై తమకు ఎటువంటి ఆశలూ లేవని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుత బ్రెగ్జిట్ ఒప్పందానికి పార్ల మెంట్ ఆమోదం లభించకపోవటంతో, ఇయు ఈ ఒప్పందాన్ని మరింత మెరుగుపర్చే అవకాశం వుందని ఆర్థిక నిపుణుడు, మాజీ ప్రధాని మార్గరేట్ థాచర్ మాజీ సలహాదారు పాట్రిక్ మిన్ఫోర్డ్ అభిప్రాయపడు తున్నారు. మెరుగైన ప్రతిపాదనలతో పార్లమెంట్‌లో మరోసారి ఓటింగ్ జరిగే అవకాశాలున్నాయని, ఇంతకు మించి మరే ప్రత్యామ్నాయానికి హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఆమోదం లభించే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇయు నుండి మెరుగైన ప్రతిపాదనలు వెలువడకపోతే ఎటువంటి ఒప్పందమూ లేకుండానే కూటమి నుండి నిష్క్రమించటం అనివార్యమవుతుందని ఆయన అన్నారు.

పెరుగుతున్న అనిశ్చితి

బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ తిరస్కరించిందన్న వార్తలు వెలువడిన వెంటనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. డాలర్‌తో పౌండ్ విలువ ఒక శాతం పడిపోవటంతో లండన్ స్టాక్ మార్కెట్ తీవ్ర నష్టాలను చవిచూసింది. టోక్యో స్టాక్ మార్కెట్ కూడా బుధవారం తీవ్ర ఒడిదుడుకులకు గురైంది. బ్రెగ్జిట్ ఒప్పందానికి పార్లమెంట్ తిరస్కరించటంతో అనిశ్చితి మరింత తీవ్రమైందని, ఇది కరెన్సీ విలువలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

పరిణామాలను గమనిస్తున్నాం : ఇయు

బ్రెగ్జిట్ ఒప్పందాన్ని పార్లమెంట్ తిరస్కరించిన తరువాతి పరిణామాలను తాము నిశితంగా గమనిస్తున్నామని ఐరోపా కమిషన్ అధ్యక్షుడు జీన్ క్లాడ్ జంకర్ చెప్పారు. ప్రస్తుత ఒప్పందమే అన్నింటికన్నా అత్యుత్తమమైనదన్న జంకర్ 'గడువు దగ్గరపడుతోందని, బ్రెగ్జిట్‌పై మే ప్రభుత్వ ఆలోచనలను వెంటనే వెల్లడించాల'ని బ్రిటన్‌ను హెచ్చరించారు. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ తిరస్కరించినంత మాత్రాన ఏమీ కాదని, మెరుగైన ఒప్పందం కోసం బ్రిటన్ తదుపరి చర్య ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారుతోందని డచ్ ప్రధాని మార్క్ రుట్ అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ నిర్ణయంతో మరో కొత్త ఒప్పందంపై చర్చలకు అవకాశం లభించినట్లు తాను భావిస్తున్నానని మాజీ విదేశాంగ మంత్రి బోరిస్ జాన్సన్ అన్నారు.

కోరితే గడువు పొడిగింపు : ఫ్రాన్స్

బ్రిటన్ ప్రభుత్వం కోరితే బ్రెగ్జిట్ గడువును పొడిగించే అంశాన్ని ఐరోపా కూటమి పరిశీలిస్తుందని ఫ్రాన్స్‌కు చెందిన ఐరోపా వ్యవహారాల మంత్రి నథాలీ లోయిసీ చెప్పారు. బుధవారం ఆయన ఒక ఫ్రెంచ్ మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ చట్టపరంగానూ, సాంకేతికంగానూ ఇది సాధ్యమేనన్నారు. ఐరోపా కూటమిలోని 27 సభ్యదేశాల ఏకాభిప్రాయంతో మరో ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశం కల్పించాలని బ్రిటన్ ఇయుకు విజ్ఞప్తి చేస్తే సానుకూలంగా పరిశీలించే అవకాశాలున్నాయని ఆమె చెప్పారు. అయితే ఇది ఎంతవరకూ సాధ్యమవుతుందో చూడాలని, బ్రిటన్ ఇయు నుండి మరిన్ని మినహా యింపులు కోరితే విషయం సంక్లిష్టమవుతుందని ఆమె వ్యాఖ్యానించారు. ఇంతకు ముందే కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించే అవకాశం లేదని, ఒప్పందం లేకుండా నిష్క్రమించటమో లేదా కూటమిలో కొనసాగటమో బ్రిటన్ తేల్చుకోవాలని ఆమె స్పష్టం చేశారు.



కెన్యా హోటల్ కాంప్లెక్స్‌పై ఇస్లామిక్ ఉగ్రవాదుల దాడి

15 మంది మృతి

నైరోబీ : కెన్యా రాజధాని నైరోబీలోని ఒక హెూటల్ కాంప్లెక్స్‌పై ఇస్లామిక్ ఉగ్రవాదులు మంగళవారం రాత్రి జరిపిన దాడిలో కనీసం 15 మంది మరణించారని పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు అల్‌షబాబ్ ఇస్లామిస్ట్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. దాడి అనంతరం అక్కడ మిగిలిన వారిని రక్షించేందుకు భద్రతా దళాలు హోటల్ భవన సముదాయంలో గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు చెప్పారు. అల్‌షబాబ్ సంస్థకు చెందిన ఒక ఆత్మాహుతి దళ కార్యకర్త హెూటల్ ఆవరణలో తనకు తాను పేల్చివేసుకోగా, ఇతర సాయుధులు చుట్టూ విడిపోయి కాల్పులు జరిపారు. కొంతమంది విదేశీయులతో సహా ఇప్పటి వరకూ 15 మంది మృతదేహాలను తాము కనుగొన్నట్లు ఒక పోలీసు అధికారి చెప్పారు. మరణించిన వారిలో ఒక అమెరికన్ పౌరుడు కూడా వున్నారని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. హెూటల్ భవన సముదాయంలో ఉగ్రవాదుల నిర్బంధంలో దాదాపు 12 గంటలు గడిపిన తరువాత అక్కడి వారికి భద్రతా దళాలు విముక్తి కల్పించారని, ఘటనా స్థలంలో ప్రత్యక్ష సాక్షిగా వున్న ఒక మీడియా ప్రతినిధి వెల్లడించారు. మిలిటెంట్ల దాడి ముగిసిన తరువాత కూడా హెూటల్ పరిసర ప్రాంతాల నుండి పేలుళ్లు, కాల్పుల శబ్దాలు వినిపించాయని ఆయన వివరించారు. హెూటల్ పరిసర ప్రాంతాలలో ఇంకా ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు వుండవచ్చని తాము భావిస్తున్నట్లు ఒక పోలీసు అధికారి చెప్పారు. అక్కడి పరిస్థితి ఇంకా పూర్తిగా ఆదుపులోకి రాలేదన్నారు. మధ్యలో కొంతసేపు కాల్పులు నిలిచిపోవటంతో ఉగ్రవాదులు అందరూ మరణించారని భావించామని, అయితే తెల్లవారు జామున 2 గంటల తరువాత మళ్లీ కాల్పులు ప్రారంభమయ్యాయని మరో పోలీసు అధికారి చెప్పారు. సూర్యోదయానికి ముందు కూడా కాల్పులు, పేలుళ్లు వినిపించాయన్నారు. అయితే హెూటల్‌లో ఎంతమంది వున్నారన్న విషయం ఇంకా అధికారికంగా తెలియరాలేదు.

మొదటి పేజీ తరువాయి

ఫెడరల్ రాజకీయం

స్వాగతిస్తున్నట్లు జగన్ తెలిపారు. భేటీ అనంతరం కెటిఆర్‌తో కలిసి ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాల ఎదుర్కోవాలంటే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు ఏకం కావాల్సిన అవసరముందని ఆయన అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ అవసరాన్ని కెటిఆర్ వివరించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలకే దిక్కులేకుండా పోయిందన్నారు. ఎపికి చెందిన 25 మంది ఎంపిలకు, తెలంగాణ 17 మంది ఎంపిలు కూడా తోడైతే కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. రాష్ట్రాల హక్కులు నిలబడాలంటే రాష్ట్రాల తరుపున మాట్లాడే వారి సంఖ్య పెరగాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం కేటిఆర్‌తో చర్చించిన విషయాలు పార్టీలో మరింత సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

కలిసి వస్తారని ఆశిస్తున్నాం : కెటిఆర్

ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జగన్ తమతో కలిసి వస్తారని భావిస్తున్నట్లు కెటిఆర్ చెప్పారు.. ఒకే ఆలోచనా ధోరణి ఉన్న నేతలంతా ఒకే వేదికపైకి వస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. ఫెడరల్ ఫ్రంట్‌తో పాటు తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం కలిసి పోరాడే విషయాలపైనా చర్చించామన్నారు. ఇప్పుడు జరిగింది ప్రాథమిక చర్చలేనన్నారు. ప్రత్యేక హెూదాకు సంబంధించి లోక్‌సభ, రాజ్యసభల్లోనే కాకుండా అనేక వేదికల్లో టిఆర్ఎస్ వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశామన్నారు. ఈ భేటీలో కేటీఆర్‌తోపాటు టీఆర్ఎస్ నేతలు వినోద్, సంతోష్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు. వైసిపి తరపున విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డిలు స్వాగతం పలికారు.

'మెటీరియల్'పైనే మక్కువ

వారి ఆదాయం పెంచడం కంటే మెటీరియల్ బడ్జెట్ వినియోగించి అధికార పార్టీ అనుయాయులకు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడం జరుగుతోందన్నమాట. మెటీరియల్ పనుల్లో ప్రధానంగా సిసి రోడ్లు, పంచాయతీ, మండల పరిషత్ భవనాలు, ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు, సోక్‌పిట్‌లు, భూగర్భ డ్రెయినేజి వంటి పనులు చేస్తున్నారు. రాష్ట్రంలోని ఒక్క నెల్లూరు మినహా అన్ని జిల్లాలు వేతన లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకబడ్డాయి. మెటీరియల్ కాంపొనెంట్ వినియోగంలో ఐదు జిల్లాలు లక్ష్యాన్ని మించి నిధులు ఖర్చు చేశాయి. లేబర్ బడ్జెట్ వినియోగంలో వెనకబడి ఉన్న జిల్లాలే మెటీరియల్ బడ్జెట్ వినియోగంలో ముందున్నాయి. వర్షాభావంతో కురువు పరిస్థితులు నెలకొని వ్యవసాయ పనులు లేని జిల్లాలైన కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలు లేబర్ బడ్జెట్ లక్ష్యం ప్రకారం కూలీలకు ఉపాధి కల్పించకపోవడం దారుణం. ప్రకాశం జిల్లా 90.19 శాతం లక్ష్యానికి చేరువలో ఉండగా, నెల్లూరు జిల్లా లక్ష్యాన్ని మించి 4.42 శాతం అదనంగా ఖర్చు చేసింది. గుంటూరు జిల్లా రూ.117.74 కోట్లు మెటీరియల్‌కు ఖర్చు చేయాల్సి ఉండగా రూ.253.31 కోట్లు ఖర్చు పెట్టారు. తరువాతి స్థానంలో కృష్ణా జిల్లా రూ.109.43 కోట్ల, తూర్పుగోదావరి రూ.62.42 కోట్లు అదనంగా ఖర్చు చేశాయి. గ్రామీణ పేదలకు పని కల్పించి వారికి ఆదాయం లభించేలా చేయాలన్న ఉపాధి హామీ చట్టం ప్రధాన లక్ష్యం దెబ్బ తింటోంది. టిడిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో వేతనం వాటా 63.11 శాతం నుండి 56.91 శాతానికి తగ్గగా మెటీరియల్ వాటా 36.88 శాతం నుండి 43.08 శాతానికి పెరగడం గమనార్హం.

ఉపాధి హామీ పథకంలో వేతనాల లక్ష్యం, చేసిన ఖర్చు, మెటీరియల్ కాంపొనెంట్ లక్ష్యం, చేసిన ఖర్చుల వివరాలు (నిధులు రూ.కోట్లలో)

జిల్లాలేబర్ బడ్జెట్ లక్ష్యంఖర్చు మెరీటియల్ బడ్జెట్ ఖర్చు గుంటూరు 233.35 176.61 117.74 253.31కృష్ణా 217.87 165.36 110.24 219.67తూర్పుగోదావరి 412.42 349.05 232.88 295.30పశ్చిమగోదావరి 307.58 247.95 165.30 225.91ప్రకాశం 508.03 458.17 305.45 347.91కడప 416.48 284.23 189.49 158.63విశాఖపట్నం 460.14 331.87 221.25 222.34శ్రీకాకుళం 478.51 346.80 231.20 142.37కర్నూలు 431.16 290.21 193.47 182.64చిత్తూరు 368.41 293.28 195.52 192.61అనంతపురం 443.11 363.53 242.35 183.34విజయనగరం 406.86 343.05 228.70 117.76నెల్లూరు 227.16 237.21 158.14 128.62మొత్తం4,911.103,887.572,591.722,670.41

ఉపాధి హామీ మెటీరియల్ ఖర్చు పెరిగిన తీరు

2014–15లో 2018–19 (డిసెంబరు వరకు)
మొత్తం వ్యయం 2,966.40 6,830.78
వేతనాలు 1,872.14 (63.11 శాతం) 3,887.50 (56.91 శాతం)
మెటీరిల్, పరిపాలనా ఖర్చులు 1,094.26 (36.88 శాతం) 2,943.21 (43.08 శాతం)

సంక్రాంతి వేడుకల్లో సిఎం

- కుటుంబ సభ్యుల పూజలు
- 'పెద్దల' సమాధి వద్ద ఘన నివాళి
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి– చంద్రగిరి

'నా భార్య భువనేశ్వరి స్ఫూర్తితో నేను పుట్టిన ఊరు నారావారిపల్లిలో గత 20 సంవత్సరాలుగా బంధుమిత్రులతో కలిసి సంక్రాంతి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.. ఇదే స్ఫూర్తి అందరిలో రావాలి..' అని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. స్వగ్రామాలకు వెళ్లి సంక్రాంతి సంబరాలు జరుపుకుంటే ఆ అనుభూతి అద్భుతంగా ఉంటుందన్నారు. మంగళవారం పండుగ రోజు గ్రామదేవత, కులదేవత గంగమ్మ, నాగాలమ్మలకు చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మంత్రి నారా లోకేష్, ప్రముఖ సినీ నటులు నందమూరి బాలకష్ణ, నారా రోహిత్, కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, నారా ఇందిరా, నందమూరి వసుంధరలు ఈ పూజలలో పాల్గొన్నారు. చంద్రబాబు తల్లిదండ్రులు నారా అమ్మణ్ణమ్మ, నారా ఖర్జూరనాయుడు సమాధుల వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామంలో వినతులు స్వీకరించారు.

పులిచెర్ల మండలం బాలిరెడ్డిగారిపల్లికి చెందిన రైతు బి.మోహన్‌రెడ్డి అమరావతి రాజధాని నిర్మాణానికి పదివేల రూపాయల విరాళాల చెక్కును సిఎంకు అందించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై తన మనవడు దేవాన్ష్‌ను ఎక్కించుకొని బండిని తోలుతూ తన సొంత గ్రామంలో వీధుల్లో వెళుతూ



నారావారిపల్లిలో ఎడ్లబండిలో మనవడితో కలిసి చంద్రబాబునాయుడు విహారం

బంధువులను, గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు.సాయంత్రం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారసత్వం, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలే కానీ వాటిని అడ్డం పెట్టుకుని జూదం, కోడిపందేలు ఆడటం మంచిది కాదన్నారు. గత నాలుగున్నరేళ్లుగా లోటు బడ్జెట్ ఉన్నా ఏ రాష్ట్రమూ చేయని విధంగా అభివృద్ధి చేశామని, సంక్షేమ కార్యక్రమాలు, పెన్షన్లు, ఇళ్లు, రేషన్‌ను అర్హత గల అందరికీ ఇచ్చామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి, ఎంపి శివప్రసాద్, ఎంఎల్‌సి రాజసింహులు, తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, కలెక్టర్ ప్రద్యుమ్న, సబ్‌కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్, శాఫ్ డైరెక్టర్ శ్రీధర్‌వర్మ, రాజకీయ నాయకులు పులివర్తి నానిలు ఘనంగా వీడ్కోలు పలికారు.

ప్రజాతంత్ర హక్కులను అణచివేసే చర్య

(మొదటిపేజీ తరువాయి)

బనాయించారని, అదే సమయంలో అమాయకులైన దళితులపై దాడులకు పాల్పడిన అసలు నేరస్తులను విడిచి పెట్టారని విమర్శించారు. పూనే పోలీసులు బనాయించిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టాలని తమ శాఖలకు డిఎస్ఎంఎం ఈ ప్రకటనలో పిలుపునిచ్చింది. ఈ అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని అన్ని తరగతుల ప్రజాతంత్ర శక్తులు ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయానికి, మహారాష్ట్ర ప్రభుత్వానికి పిటిషన్లు పంపాలని కోరింది.

కుంభమేళాలో ట్రాన్స్‌జెండర్లు

లక్నో: ప్రపంచంలో అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం కుంభమేళాలో తొలిసారిగా ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మంగళవారం ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు గంగా నదిలో స్నానమాచరించారు. చరిత్రలో తొలిసారిగా కుంభమేళాలలో ట్రాన్స్‌జెండర్లను అనుమతించారు. ఈ సందర్భంగా వారి హక్కుల కోసం పోరాడుతున్న లక్ష్మీ నారాయణ్ త్రిపాఠితో పాటు వందలాది మంది ట్రాన్స్‌జెండర్లు కుంభమేళాకు వచ్చి నదిలో స్నానాలు చేశారు. ఈ ఉత్సవంలో దాదాపు 20 లక్షల మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొంటారని అంచనా. దీనిపై త్రిపాఠి మాట్లాడుతూ.. ఇది శుభపరిణామమని అన్నారు. తమను సమాజం ఆమోదిస్తున్నదని తెలిపారు.

కోడి పందేలు @ రూ.300 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

తదితర మండలాల్లో జోరుగానే జరిగాయి. అల్లవరం మండలం గోడి, గోడి లంకలో రాత్రి సమయాల్లో ఫ్లడ్‌లైట్ల కాంతిలో పందేలు భారీస్థాయిలో జరిగాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని మేకవానిపాలెంతో పాటు, పెడన నియోజక వర్గంలోని గూడూరు, పెడన, బంటుమిల్లి, పెందుర్రు, అవనిగడ్డ నియోజకవర్గంలోని వెంకటాపురం, కొడాలిల్లో భారిగా కోడి పందేలు, పేకాట కోసుల్లో రూ. 2 కోట్లు చేతులు మారాయి. బాపులపాడు మండలం అంబాపురం, కంకిపాడు మండలం ఈడుపుగల్లు ప్రాంతాల్లో భారీగా కోడిపందేలు, కోత ముక్కలు నిర్వహించారు. బాపులపాడులో రూ. 4 కోట్లు, ఈడుపుగల్లులో భారీ ఎత్తున చేతులు మారాయి. గుడివాడ కేంద్రంగా వైఎస్ఆర్‌సిపి, టిడిపి నేతలు కొందరు విడివిడిగా కోడిపందేలు బరులు, కోసులు ఏర్పాటు చేశారు. గుడివాడలోనూ. 3 కోట్ల వరకు చేతులుమారినట్లు తెలుస్తోంది. మచిలీపట్నం వద్ద గోపువానిపాలెంలో ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరిని ఈనెల 13న పోలీసులు తొలగించారు. అయినా మరుసటి రోజు నుండే వరుసగా రెండు రోజులపాటు నిర్వహకులు అదే బరిలో కోడిపందేలు నిర్వహించడం గమనార్హం. విజయవాడ శివారు ప్రాంతాలైన నున్న, ఇబ్రహీంపట్నం, పెనమలూరు, కంకిపాడు, పోరంకి వంటి ప్రాంతాల్లో పందేలు యథేచ్ఛగా సాగాయి. మండల కేంద్రమైన కంకిపాడుతోపాటు ఈడ్పుగల్లులో భారీస్థాయిలో కోడిపందేలను నిర్వహించారు. ఈడ్పుగల్లులో 30 ఎకరాల్లో మూడురోజులపాటు పందెలను యథేచ్ఛగా నిర్వహించారు.కవరేజ్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధులపై నిర్వాహకులు దూకుడుగా ప్రవర్తించారు. పలువురిపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఫోటోలను తీయకుండా అడ్డుపడ్డారు. ఇక్కడ కోట్ల రూపాయల్లో లావాదేవీలు నిర్వహించారు. ఏటా బోగి పండుగ రోజున ఈ పోటీలు ప్రారంభమై కనుము రోజు వరకూ నిర్వహిస్తున్నారు. కానీ ఈ ఏడాది ఆదివారం నుంచే పందేలను మొదలుపెట్టారు. పందేలా కోసం వచ్చిన వారితో విజయవాడలో లాడ్జీలన్నీ నిండిపోయాయి. విశాఖ జిల్లా చోడవరం మండలం గవరవరం, గంధవరం, మైచర్లపాలెంలో నిర్వహించారు.

సొమ్ములు పోయి గుండెపోటుతో ఇద్దరు మృతి

కోడి పందెల్లో డబ్బులు పోవడంతో కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇద్దరు గుండెపోటుతో మృతిచెందారు. తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలంలోని గోడిలంకలో కోడిపందేలు నిర్వహిస్తున్న ప్రాంతంలో గుండాటలో డబ్బులు పోగొట్టుకున్న బోడసకుర్రు గ్రామానికి చెందిన యాళ్ల చంటి (55) ఓ వ్యక్తి మనస్తాపం చెంది గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు.అలాగే కృష్ణాజిల్లా చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామశివారులో నందిగామ కృష్ణబలిజనగర్‌కు చెందిన భట్టిప్రోలు రవి(30) మంగళవారం రూ.5వేలు పందెం కూడా కట్టారు. అయితే కోడి నెగ్గలేదు. దీంతో కొద్దిసేపటి తర్వాత గుండెపోటు వచ్చి అక్కడే కుప్పకూలాడు. 108 వాహనంలో నందిగామ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. అపశ్రుతి చోటుచేసుకున్నప్పటికీ కోడిపందేలు ఆగలేదు. లక్షల్లో డబ్బు చేతులు మారింది.

అది ద్రోహుల కూటమి

(మొదటిపేజీ తరువాయి)

మోడీ, తెలంగాణా మోడీ ఒక్కటయ్యారన్నారు. ఇంతకాలం వీరి మధ్య ఉన్న చీకటి ఒప్పందం బహిర్గతమయ్యిందన్నారు. మోడీ చేతిలో కీలు బొమ్మ ఫెడరల్ ఫ్రంట్ అని ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించడం, ఓట్లను మోడీకి మూటగట్టడం, జగన్, కేటిఆర్ భేటీ ఆంతర్యమని విమర్శించారు. దేశ వ్యాప్తంగా బిజెపి వ్యతిరేక కూటములన్నీ ఒకే తాటిపైకి వస్తుండటంతో దానిని అడ్డుకునేందుకే ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు అని బుధవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసిఆర్ ద్వారా హోదా తెస్తామని జగన్ అనడం ద్వారానే కుట్రకోణం దాగి ఉందన్నారు. తెలంగాణా డిస్కమ్‌ల నుంచి రూ.5,702 కోట్లు ఏపీకి రావాల్సి ఉందని, పన్ను వసూళ్ల తేడా వల్ల రాష్ట్రం రూ.3,800 కోట్లు నష్టపోయిందని తెలిపారు. తొమ్మిదవ షెడ్యూల్‌లోని 89 సంస్థలు, పదవ షెడ్యూల్‌లోని 142 సంస్థల ఆస్తులు, అప్పులు విభజనకు అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో మోడీ సేవ చేస్తున్నారని, కేసుల మాఫీ కోసం జగన్, కుంభకోణాల్ని కప్పిపుచ్చుకునేందుకు కేసిఆర్ ప్రయత్నిస్తున్నారని మరో ప్రకటనలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకటరావు తెలిపారు. కేటిఆర్. జగన్ ప్రెస్‌మీట్‌లో మోడీని ఒక్కమాట కూడా అనలేదని, మోడీ వ్యతిరేక ఓట్లను చీల్చే కుట్రలో భాగమే ఫెడరల్ ఫ్రంట్ నాటకమని అన్నారు. 42 మంది ఎంపీలుంటే హోదా సాధించడానికి అవకాశం ఉంటుందన్న జగన్, తన పార్టీ ఎంపీలతో దొంగ రాజీనామాలు చేయించి, రాష్ట్రానికి అన్యాయం చేయలేదా అని ఆయన ప్రశ్నించారు. జగన్, కెటిఆర్‌ల భేటీపై మంత్రి శిద్దా రాఘవరావు, శ్రీకాకుళం ఎంపి కింజారపు రామ్మోహన్‌నాయుడు మరో ప్రకటనలో విమర్శలు గుప్పించారు.టిఆర్ఎస్‌తో ప్రతిపక్షనేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులు కలిపి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని, జగన్‌ను రిమోట్ కంట్రోల్‌గా వాడుకుని కేసిఆర్ ఆంధ్రపై పెత్తనం చేయాలని చూస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్దా వెంకన్న ఆరోపించారు. బుధవారం మధ్యాహ్నం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడారు. ఢిల్లీలోని ఏపీ భవన్, హైదరాబాద్‌లోని పలు ఆస్తుల పంపకంపై కేసిఆర్ అడ్డుపడుతున్నారన్నారు. పోలవరంపై కేసులు వేసిన వారితో ఎలా పొత్తులు పెట్టుకుంటారని జగన్‌ను మంత్రి దేవినేని ప్రశ్నించారు. బిజెపి వ్యతిరేక ఓట్లు చీల్చడానికి, మోడీకి లబ్ధి చేకూర్చేందుకే ప్రతిపక్ష నేత జగన్, తెలంగాణ సిఎం కేసిఆర్ ఫెడర్ ఫ్రంట్ అంటున్నారని మంత్రి నక్కా ఆనంద్ బాబు వ్యాఖ్యానించారు.

'మహాలక్ష్మి' కల్యాణం


తమన్నా


తమన్న టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'దటీజ్ మహాలక్ష్మి'. హిందీలో కంగనా రనౌత్ నటించిన సూపర్ హిట్ చిత్రం 'క్వీన్' రీమేక్‌గా తెరకెక్కుతోంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన చిత్రీకరణ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ చిత్రం వెడ్డింగ్ సాంగ్ లిరికల్ వీడియో గురువారం విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. 'మహాలక్ష్మి ఇంటికి పెళ్ళి కళ వచ్చేసిందోచ్. రేపే సన్నాయి సందళ్లు మొదలు..' అంటూ వెడ్డింగ్ సాంగ్ లిరికల్ వీడియో రానున్నదని పోస్టర్ ద్వారా ప్రకటించింది. బాలీవుడ్ సంగీత దర్శకుడు అమిత్ త్రివేది ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

ప్రియా వారియర్‌కు నోటీసులు



రాత్రికి రాత్రే పెద్ద సెలబ్రిటీ అయిపోయిన అమ్మాయి ప్రియా ప్రకాశ్ వారియర్. ఈ మలయాళ భామ గూగుల్ సెర్చింజన్‌లోనే ఎక్కువ మంది వెతికిన సెలబ్రిటీగా నిలిచింది. ప్రియా బాలీవుడ్‌లో 'శ్రీదేవి బంగ్లా' అనే చిత్రంలో టైటిల్ రోల్ చేసింది. ఈ చిత్రంతో ఈమె బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తుంది. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ చూస్తే సినిమాలో ప్రియా 'శ్రీదేవి' అనే సూపర్ స్టార్ పాత్రలో నటించింది. ఇందులో చివరిలో బాత్‌రూమ్ టబ్‌లో కాలు మాత్రమే చూపించి ఆసక్తి క్రియేట్ చేశారు. ఈ పాత్ర అతిలోక సుందరి శ్రీదేవి జీవితానికి చాలా దగ్గరగా ఉందని బోనీ కపూర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రియా ప్రకాష్ వారియర్, 'శ్రీదేవి బంగ్లా' సినిమా టీమ్‌కి నోటీసులు పంపారు. సూపర్ స్టార్ మోహన్‌లాల్ నటించిన 'భగవాన్' చిత్రానికి దర్శకత్వం వహించిన ప్రశాంత్ మాబుల్లి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ చిత్రంలో ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా ఓ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు.

రాజా పాండే


విజయ్ సేతుపతి

చిరంజీవి టైటిల్ పాత్రలో నటిస్తోన్న సినిమా 'సైరా నరసింహారెడ్డి'. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇందులో తమిళనటుడు విజయ్ సేతుపతి కీలక పాత్రను పోషిస్తున్నారు. రాజా పాండే అనే పాత్ర కనిపించబోతున్నాడని చిత్రబృందం వెల్లడించింది. బుధవారం విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ స్టిల్‌ను, మోషన్ టీజర్‌ను విడుదల చేసింది. మోషన్ టీజర్‌లో విజయ్ సేతుపతి కత్తి పట్టుకొని రౌద్రమైన లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. బాలీవుడ్ సంగీత దర్శకుడు అమిత్ త్రివేది బాణీలు సమకూరుస్తున్నారు. నయన తార, తమన్నా, సుదీప్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో రామ్ చరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

మోగనున్న పెళ్లి బాజాలు


విశాల్, అనిషా

త్వరలో విశాల్ వివాహం

తమిళ నటుడు, తమిళ నిర్మాత మండలి చైర్మన్ విశాల్ త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. కొద్ది రోజులుగా ఆయన వివాహంపై సామాజిక మాధ్యమాల్లో కుప్పలు కుప్పలుగా కథనాలు ప్రసారమవుతున్నాయి. ఎట్టకేలకు విశాల్ కనుమనాడు ఈ విషయంపై స్పందించారు. త్వరలో వివాహం చేసుకుంటున్నట్టు ప్రకటించారు. తనకు కాబోయే భార్య అనిషా అల్లాతో దిగిన ఫొటోను షేర్ చేస్తూ ఈ విషయం వెల్లడించారు విశాల్. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త కుమార్తె అనిషా. 'పెళ్లిచూపులు' చిత్రంలో విజయ్ దేవరకొండకు ప్రేయసిగా నటించిన అనిషాయే 'అర్జున్‌రెడ్డి' సినిమాలోనూ నటించారు. 'కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నాను. నా ఎదుగుదలలో, ఆలోచనల్లో స్ఫూర్తిగా నిలిచినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. నా జీవితంలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి నాకు సరైన తోడు దొరికింది. విశాల్ మంచి మనసు నాకెంతో నచ్చింది. విశాల్‌తో జీవితం పంచుకుని ఆయన్ను సంతోషంగా ఉంచడానికి నేను ఉత్తమంగా ప్రయత్నిస్తాను.' అని అనీశా పేర్కొన్నారు.

'నా జీవితంలో జరగబోయే అతి పెద్ద మార్పు. త్వరలో వివాహ తేదీని వెల్లడిస్తా' అని విశాల్ ట్వీట్ చేశారు. ఈ నెలలోనే హైదరాబాద్‌లో నిశ్చితార్థం జరగబోతోందని విశాల్ తండ్రి వెల్లడించారు. పెళ్లి కూడా ఇక్కడే చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

రిచా గంగోపాధ్యాయ నిశ్చితార్థం


జోయ్, రిచా


లీడర్, మిరపకాయ్, మిర్చి చిత్రాల్లో కథానాయికగా చేసిన రిచా గంగోపాధ్యాయ తర్వాత తెలుగు సినిమాల్లో నటించ లేదు. ఎంబీఏ చదవడం నిమిత్తం విదేశాలకు వెళ్లింది. అక్కడ బిజినెస్ స్కూల్‌లో పరిచయం అయిన జోయ్ లంగేల్లా అనే అతనితో ఆమెకు నిశ్చితార్థం జరిగినట్టుగా రిచా గంగోపాధ్యాయ ట్విట్టర్ ద్వారా గురువారం తెలిపింది. "నాకు నిశ్చితార్థ విషయం మీతో పంచుకోవాలనుకుంటున్నా. నేను, జోయ్ బిజినెస్ స్కూల్‌లో కలుసుకున్నాం. ఈ రెండేళ్ల అద్భుతం. మా జీవితంతో తర్వాత దశలో ఎదురు చూస్తున్నా. అయితే ఇంకా తమ పెళ్లికి ముహూర్తం ఖరారు కాలేదు' అని ట్వీట్ చేస్తూ జోయ్‌తో దిగిన ఫొటోలను షేర్ చేసింది.

బ్రహ్మానందంకు శస్త్రచికిత్స



తెలుగు తెరపై హాస్యనటుడిగా తిరుగులేని ఆధిపత్యాన్ని చూపించి, తనదైన శైలిలో నవ్వులు పూయించిన నటుడు బ్రహ్మానందం. తాజాగా 'ఎన్టీఆర్' బయోపిక్‌లో అలనాటి ప్రముఖ హాస్య నటుడు రేలంగి పాత్రలో నటించి మెప్పించారు. ఆదివారం ముంబై వెళ్లిన బ్రహ్మానందం అనారోగ్యానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. వైద్య పరీక్షలు అనంతరం బ్రహ్మానందం గుండెకు సంబంధించిన సమస్యతో బాధ పడుతున్నారని గుండె సంబంధింత వైద్యనిపుణులు డాక్టర్ రమాకాంత్ పాండా తెలియజేశారు. ఆయన ఆధ్వర్యంలో బ్రహ్మానందానికి సర్జరీ చేశారు. ప్రస్తుతం బ్రహ్మానందం ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన కుటుంబ సభ్యులు ట్విట్లర్ ద్వారా తెలిపారు.

విద్యార్థి నాయకుడు 'జార్జిరెడ్డి' వస్తున్నాడు



జార్జిరెడ్డి.. దశాబ్దాల క్రితం విద్యార్థి విప్లవోద్యమ నాయకుడుగా చరిత్రలో నిలిచిపోయిన పేరు. ధైర్యానికి, సాహసానికి ప్రతీక ఆ పేరు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా సాగిన జార్జిరెడ్డి జీవిత ప్రస్థానం నేటికీ ఎన్నో విద్యార్థి ఉద్యమాలకు ఆదర్శంగా నిలుస్తోంది. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో చదువుతూ.. విద్యార్థి ఉద్యమాల్లో తిరుగు లేని నాయకుడిగా ఎదిగిన జార్జిరెడ్డిని చాలా చిన్న వయసులోనే కొందరు ప్రత్యర్థులు క్యాంపస్‌లోనే హత్య చేశారు. ఆయన మరణించినా ఆయన ఆశయం బతికే ఉంది. ఆయన కోరుకున్న సమాజం కోసం నేటికీ ఎందరో పోరాటాలు చేస్తూనే ఉన్నారు. అలాంటి ఆదర్శనీయమైన విద్యార్థి నేత జీవితం వెండితెరపై ఆవిష్కృతం కాబోతోంది. గతంలో 'దళం' సినిమాతో ఆకట్టుకున్న జీవన్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా ఈ మూవీ ప్రీలుక్ పోస్టర్ విడుదలైంది. జార్జిరెడ్డి అనగానే విపరీతమైన పఠనాసక్తి కలిగిన వాడు అని ఆయన మిత్రులు నేటికీ చెబుతుంటారు. ఆ విషయాన్నే ప్రతిబింబిస్తూ చేతిలో పుస్తకాలతో నాటి కాలపు వేషధారణతో కాలేజ్‌కు నడిచి వెళుతోన్న లుక్‌ను విడుదల చేశారు. త్వరలో ఫస్ట్‌లుక్ పోస్టర్‌తో పాటు నటీనటుల వివరాలు తెలియజేస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు. 'మీట్ ది ఫర్‌గెటన్ లీడర్ సూన్' అనే టైటిల్‌తో ఈ చిత్రం రూపొందుతోంది

1970 దశకం బాక్ డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని మైక్ మూవీస్ అధినేత అప్పిరెడ్డి త్రీ లైన్స్ సినిమా బ్యానర్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మరాఠీలో సెన్సేషన్ క్రియేట్ చేసిన 'సైరత్' సినిమాకు సినిమాటోగ్రఫీ అందించి ఇటీవల 'నాన్' అనే సినిమాతో దర్శకుడిగా కూడా మారిన సుధాకర్ రెడ్డి యెక్కంటి ఈ చిత్రానికి కెమెరామెన్ కావటం విశేషం. చిత్రీకరణ పూర్తి చేసుకుంది. వేసవిలో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

ప్రతి సంక్రాంతి ఇక్కడే


అల్లు అర్జున్ కుటుంబం

సంక్రాంతి వచ్చిందంటే చాలు పుట్టిన ఊరుకి వెళ్లాల్సిందే. అది చిన్న స్థాయి ఉద్యోగైనా, పెద్ద స్టార్ అయినా. నిజమే దానికి సాక్ష్యం ఇదే. అందరిలాగే అల్లు అర్జున్ కూడా తన కుటుంబంతో పండక్కి తన సొంత గ్రామం అయిన పాలుకొల్లు వెళ్లారు. అక్కడ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. క్షీర రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు అనంతరం ఆయన మాట్లాడుతూ 'మా తాతగారు పాలకొల్లులో పుట్టారు. నాన్నగారూ ఇక్కడే పుట్టారు. నేను మద్రాసులో పుట్టాను. ఆ తరువాత హైదరాబాద్‌లో పెరిగాను. 'మీ ఊరు ఏది' అని నన్ను ఎవరైనా అడిగితే మాత్రం పాలకొల్లు అని మాత్రమే చెబుతా. పెళ్లయ్యాక మా ఆవిడ అడిగింది 'మీ పాలకొల్లు తీసుకెళ్లవా? అని.. అలాగే మా అబ్బాయిని అడిగా 'నీ ఊరు ఏది' అని.. దానికి వాడు పాలకొల్లు అని చెప్పాను. అందరూ హైదరాబాద్ నుంచి వాళ్ల ఊళ్లు వెళుతున్నారు. నగరంలో రోడ్లు అన్నీ ఖాళీ అవుతున్నాయి. కానీ నేను మాత్రం ఇక్కడే ఉన్నానని అని ఆలోచి ఈ సారి పాలకొల్లులోనే సంక్రాంతి చేసుకోవాలనే ఇక్కడకు వచ్చేశా. ఇక్కడికి రావటానికి ప్రధాన కారణం మాత్రం నా కుటుం. ఈ ఊరు నాకు చాలా ఇచ్చింది. అలాంటి నా ఊరుకు ఏమైనా ఇవ్వాలి. కాదు ఇస్తూనే ఉండాలి. అందుకే ఈ సంక్రాంతి నుండి ప్రారంభిస్తున్నా. పెద్ద గుడిలో కల్యాణ మండపం కట్టిస్తా... దానికి రూ.10 లక్షలు విరాళం ఇస్తున్నా. ప్రతి సంక్రాంతి ఇక్కడే జరుపుకునే ప్రయత్నం చేస్తా' అని తెలిపారు.


ఐదు పాత్రల కథ


సాయి ధరమ్ తేజ్

సాయిధరమ్ తేజ్ హీరోగా 'నేను శైలజ' ఫేమ్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'చిత్రలహరి'. మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌లో తెరకెక్కుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటోంది. కల్యాణి ప్రియదర్శన్, నివేదా పేతురాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి సినిమాను ఏప్రిల్ 12న విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ 'కిషోర్ తిరుమల సినిమా అంటే కూల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంటూనే ఎమోషన్లు క్యారీ అవుతుంటాయి. అలాంటి మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ సబ్జెక్ట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రీకరణ అనుకున్న ప్రకారం జరుగుతోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. సాయిధరమ్ తేజ్‌ను సరికొత్త యాంగిల్‌లో కిషోర్ తిరుమల ప్రెజెంట్ చేస్తున్నారు. దర్శకుడు కిషోర్ తిరుమల మాట్లాడుతూ 'మంచి ఎమోషనల్ ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. టైటిల్‌లో ఐదు అక్షరాలు ఉన్నట్లు సినిమాలో ఐదు క్యారెక్టర్స్‌కు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటాయి. సినిమా ఈ పాత్రల చుట్టూ ఎక్కువగా తిరుగుతుంది' అని తెలిపారు.


'భారతీయుడు 2' 18 నుంచి షూటింగ్


'భారతీయుడు2' కమల్

కమల్‌హాసన్ నటిస్తున్న చిత్రం 'భారతీయడు 2'. 1996లో విజయం సాధించిన 'భారతీయుడు'కు సీక్వెల్‌గా వస్తోన్న చిత్రమిది. శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో కాజల్ నటిస్తున్నారు. అనిరుధ్ బాణీలు అందిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను శంకర్ విడుదల చేశారు. ఇందులో కమల్ తన వర్మ కళను ప్రదర్శిస్తూ కనిపించారు. జనవరి 18 నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం పేర్కొంది.

తొలుత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను డిసెంబరు 14న హైదరాబాద్‌లో ప్రారంభించనున్నట్లు వార్తలు వచ్చాయి. రెండో షెడ్యూల్ చెన్నైలో జరగనుందని వెల్లడించారు. శంకర్ '2.ఓ' బ్లాక్‌బస్టర్ తర్వాత తెరకెక్కిస్తున్న చిత్రమిది. కమల్ మరోపక్క 'శభాష్ నాయుడు' సినిమాలో నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో రూపుదిద్దుకుంటోన్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతల్ని కమలే చూసుకుంటున్నారు. రమ్యకృష్ణ, బ్రహ్మానందం, శ్రుతిహాసన్ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం షూటింగ్ వాయిదా పడుతూ వచ్చింది.

దీపికా కోసం ఎంత దూరమైనా వెళ్లాలనుకున్నా


రణవీర్ సింగ్, దీపికా పదుకొనే

రణవీర్ సింగ్, దీపికా పదుకొనే చాలా కాలం పాటు ప్రేమ ఉన్నాక వివాహం చేసుకున్నారు. సుమారుగా నాలుగైదేళ్ల ఈ ప్రేమ వ్యవహారం నడిచింది. ఈ సమయంలో అంటే పెళ్లికి ముందు చాలా అనుభవాలు ఎదురయ్యాయి. వాటిని తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా దీపిక పదుకొణెనే పెళ్లిచేసుకోవాలని ఫిక్సయ్యానని చెప్పారు. ఎప్పుడైనా దీపికను వదులుకోవాల్సి వస్తుందేమో.. అని అనిపించిందా అన్నదానికి సమాధానం ఇస్తూ.. 'నాకు అలా ఎప్పుడూ అనిపించలేదు. మా ప్రేమ విషయంలో ఎన్నో ఒడుదొడుకులు వచ్చాయి. కానీ దీపికనే పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కాబట్టి ఆమె కోసం ఎంత దూరమైనా వెళ్లాలనుకున్నాను. ఓసారి చిత్రీకరణ నిమిత్తం వేరే ప్రదేశంలో ఉన్నాను. దీపికను చూడాలనిపించి వెంటనే ఆమె వద్దకు వెళ్లిపోయాను. అలాగని గంటల పాటు ఆమెతో సమయం గడపలేదు. కేవలం కొన్ని నిమిషాలు దీపికతో ఉండాలనిపించి అప్పటికప్పుడు టికెట్ బుక్ చేసుకుని దీపిక వద్దకు వెళ్లిపోయా' అని చెప్పారు.

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

సినిమా

కులవివక్షను ప్రశ్నించిన పరియేరుమ్ పెరుమాళ్



సినిమా అంటేనే.. వినోదం. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. అలాగని.. సందేశం ఇచ్చిన సినిమాలు లేవనికావు. కానీ.. ఆ సందేశాత్మక చిత్రాల్లోనూ.. ప్రేక్షకాకర్షణ కోసం మెలోడ్రామాను అంతో ఇంతో నింపేయడం వల్ల.. చాలా సినిమాలు వినోదంతోకూడిన సందేశాత్మక చిత్రాలుగానే సినిమా చరిత్రలో మిగిలిపోయాయి. కానీ, ఇటీవలి కాలంలో సినిమాలు 'వెండితెర' సరిహద్దు గీతలను దాటుకుంటూ వాస్తవ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాయి.. ప్రశ్నిస్తున్నాయి.. గర్జిస్తున్నాయి.. ప్రేక్షకుడ్నీ అంతే స్థాయిలో ఆలోచించేలా వెంటాడుతున్నాయి. అలాంటి సినిమానే 'పరియేరుమ్ పెరుమాళ్' అనే తమిళచిత్రం. మన కళ్ళ ముందు కనిపించే ఓ సామాజిక వివక్షకు వాస్తవ రూపమే ఈ సినిమా కథ.

2018 మార్చి. గుజరాత్‌లోని తింబి గ్రామంలో ప్రదీప్ రాథోడ్ అనే ఇరవై ఒక్క ఏళ్ల దళిత యువకుడ్ని అగ్రకులస్తులు ఘోరంగా హత్య చేశారు. గుర్రాన్ని పెంచుకోవడం అతడు చేసిన నేరం. 2018 ఏప్రిల్. రాజస్థాన్ భిల్వారా జిల్లాలో దళితుల పెళ్లి సందర్భంగా పెళ్లికొడుకు గుర్రం ఎక్కాడని అతనిపై ఘాతుకంగా దాడి చేశారు కుల దురహంకారులు. అంతకు మూడేళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లోని రత్లాంలో కూడా ఇటువంటి సంఘటనే జరిగింది. చెప్పుకుంటూ పోతే దళితులపై అకృత్యాలు జరగని రోజంటూ లేదు. 'పరియేరుమ్ పెరుమాళ్' తమిళచిత్రం చూసిన తర్వాత చిత్రంగా ఈ గుర్రం ఉదాహరణలే గుర్తొస్తున్నాయి. గుర్రం అధికారానికి, సంపదకి చిహ్నం. అది అగ్రకులం సొత్తు మాత్రమే కావాలి. దళిత 'కుక్క' గుర్రమెక్కే ఊహ కూడా మానుకోవాలి. అదీ అగ్రవర్ణ ఆదేశం. కానీ మన సినిమాలో దళిత కథానాయకుడు మాత్రం తను 'గుర్రమెక్కి వచ్చిన దేవుడిని' అంటూ 'పరియేరుమ్ పెరుమాళ్' అన్న తన పేరుకి అర్థం చెబుతాడు క్లాసులో లెక్చరర్‌తో. బిఎ, బిఎల్ కంటిన్యూయింగ్ అని కూడా చెబుతాడు అప్పర్ లైనింగ్‌తో. (లైనింగ్‌లో కూడా నిమ్నస్థానం వద్దనేమో!)

ఇటీవలి కాలంలో మరాఠీలో నాగరాజ్ మంజులే, తమిళంలో పా.రంజిత్ వంటి నవతరం దర్శకులు భారతీయ సినిమాలో దళిత కేతనాన్ని ఎగరేస్తున్నారు. సినిమాలో అంబేద్కరిజాన్ని సెలబ్రేట్ చేస్తున్న 'మద్రాస్-కబాలి-కాలా' ఫేం పా.రంజిత్ తన 'నీలం ప్రొడక్షన్' సొంత బ్యానర్‌పై నిర్మించిన మొదటి సినిమా ఇది. దర్శకుడు మారి సెల్వరాజ్ కూడా తన ఈ మొదటి సినిమాతోనే అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు. ఈ సినిమా మణిరత్నం సినిమాతో సహా రిలీజ్ కావడంతో ప్రదర్శనకు తగినన్ని హాళ్ళు కూడా దొరకలేదు. కానీ ఆ నోటా ఈ నోటా సినిమా ప్రచారం కావడంతో, అవతలి సినిమా చప్పబడిపోవడంతో థియేటర్ యజమానులు ఈ సినిమాకు ఎక్కువ షోలు కేటాయించక తప్పలేదు. ఈ దేశంలో చిన్న, పెద్ద కులాల వివక్ష, సినిమాల వివక్ష ప్రతి శుక్రవారమూ సినిమాల విడుదల సమయంలో కనిపిస్తున్నదే!

కుక్కలా అవమానించబడుతున్న వాడు తన పేరుకు తగ్గట్టు గుర్రమెక్కే ఆత్మగౌరవాన్ని ప్రదర్శించడమే సినిమా ఇతివృత్తం. 'కులం, మతం మానవత్వానికి కంటకాలు' అని ఆరంభంలో చూపినపుడే ఈ సినిమా ఎలా సాగబోతుందో మనకు అర్థమవుతుంది.

కథాకాలం 2005. 'కరుపి' (నల్ల కుక్క) చావుతో మొదలౌతుంది సినిమా. ఊరి బయటి నీటి కుంటలో కొందరు నిమ్న కులస్తులు పాటలు పాడుకుంటూ పెంపుడు కుక్కలను ఆ నీటిలో స్నానం చేయిస్తుంటారు. అక్కడికి కథానాయకుడు 'పెరియన్' వస్తాడు తన ప్రాణానికి ప్రాణమైన కరుపితో. వారు బయల్దేరేసరికి అగ్రకులాల బ్యాచి అటువైపు వస్తుంది. తర్వాతి రోజే లా కాలేజీలో అడ్మిషన్ గనుక తను గొడవకు పోనంటాడు పెరియన్. 'ఎంతకాలం అణిగిమణిగి ఉండాలి?' అని వాళ్లలో ఒకడంటే 'మన పెద్దవాళ్ళు వీళ్ళ పొలాల్లో పని చేస్తున్నంత కాలం మన బతుకులు ఇంతే!' అని జవాబిస్తాడు మరో కుర్రాడు. మరోవైపు, 'వీళ్ళకి ఈ రోజు బుద్ధి చెప్పాల్సిందే!' అని అంటాడు పెద్దకులానికి చెందిన ఒక కుర్రాడు. మరొకడు 'అపవిత్రమైపోయిన' ఆ నీటి కుంటలో ఉచ్చ పోస్తాడు. ఇంటికి వెనుదిరిగిన పెరియన్‌కి కరుపి కనిపించడంలేదని తెలుస్తుంది. మనసు శంకించినట్టే పెత్తందారుల ఆగ్రహానికి ఆ మూగజీవి బలైపోతుంది. రైల్వేలైనుకు కట్టేయగా వాయువేగంతో వస్తున్న ట్రైను కిందపడి, తునాతునకలౌతుంది. 'మనుషులంతా ఒక్కలాంటి వాళ్ళని ఎలా నమ్మేశావమ్మా? ఎవరు పిలిచినా వెళ్లిపోతావా?' అంటూ ఊరిజనం 'కరుపి' కోసం విలపిస్తూ గౌరవంగా అంత్యక్రియలు జరుపుతారు.

తిరునెల్వేలి లా కాలేజీలో చేరుతాడు పెరియన్. 'లా చదివి ఏమవ్వాలనుకుంటున్నావ్?' అని ప్రిన్సిపాల్ అడిగితే 'డాక్టర్ అంటే డాక్టర్ అంబేద్కర్ అవుదామని అనుకుంటున్నాను' అని చెప్పి అక్కడే ఐడెంటిపై అయిపోతాడు. పెద్దకులపు 'లా కాలేజి' ప్రిన్సిపాల్‌కి రాజ్యాంగ నిర్మాత పేరు కూడా సందేహాస్పదమనిపిస్తుంది. ప్రిజుడిస్‌తో ఉన్న అతడు అడ్మిషన్ ఫారం వెనుక ఆ సంగతి రాయమంటాడు తన గుమస్తాతో. అంబేద్కర్ పేరెత్తే వారు త్వరలోనే ఏదో రాజకీయపు గొడవ చేస్తారన్నది అతడి 'ప్రగాఢ' విశ్వాసం! ఆయన టేబుల్‌పై గాంధీజీ పటం ఉంటుంది. నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టాల్సిన విద్యాసంస్థలు కులవ్యవస్థ కేంద్రాలుగా మారాయని రుజువు చేస్తాయి కాలేజీలోని పరిస్థితులు. ఇంగ్లీషు సరిగ్గా రాకపోవడంతో లెక్చరర్ల హేళన ఎదుర్కొంటాడు పెరియన్. నుదుట తిలకం పెట్టుకున్న ఇంగ్లీష్ అధ్యాపకుడు 'రిజర్వేషన్‌తో వచ్చిన కోటా కోడివి, కనుక గుడ్లు పెట్టడానికే పనికొస్తావ్!' అని అవమానంగా మాట్లాడతాడు. కానీ, విద్యావ్యవస్థ లోపం వల్లనే పల్లెటూరి విద్యార్థులకి ఇంగ్లీషు సరిగా రావడం లేదన్నది అసలు నిజం! పెరియన్ అమాయకత్వాన్ని మెచ్చి, అతడికి ఇంగ్లీషు విషయంలో సహకరించడానికి ముందుకొస్తుంది జో లేక జ్యోతి మహాలక్ష్మి. వారి స్నేహం అదే క్లాసులో ఉన్న జో అన్నయ్య శంకరలింగంకు నచ్చదు. కాలేజీ మొత్తానికి పెరియన్ ఒక్కడినే తన అక్కయ్య పెళ్ళికి ఆహ్వానిస్తుంది జో. ఆహ్వానం అందుకుని వెళ్లిన పెరియన్‌ను జో తండ్రి ఓ గదిలోకి తీసుకుపోతాడు. అతడి ఊరిపేరు 'పులియాంకులం' ద్వారా కులాన్ని కనిపెడతాడు. ఆ గదిలో శంకరలింగం మనుషులు అతడిని చావబాది, అతడిపై ఉచ్చపోస్తారు. 'నా కూతురి నుంచి దూరం కాకపోతే.. నిన్నూ, మా అమ్మాయినీ నా కులపోళ్లు చంపేస్తారని' బెదిరిస్తాడు జో తండ్రి. ఈ సంగతి తెలీని జో పెరియాన్ తనకెందుకు దూరంగా ఉన్నాడో, హఠాత్తుగా ఈ మార్పేమిటో అని జో బాధపడుతుంది.



తనను అమితంగా ప్రేమిస్తున్న జోకి నిజం చెప్పలేక, పుట్టుక కారణంగా తనెందుకు అస్పృశ్యుడయ్యాడో అర్థంకాక, 'నేనెవర్ని?' అన్న ప్రశ్నకు జవాబు దొరక్క, తాగిన మైకంలో క్లాసులో కొచ్చి, వార్నింగులు పొంది స్వవినాశక పతనదిశలో సాగుతాడు పెరియన్. 'హ్యూమిలియేషన్' అన్న మాటకు 'అవమానం' అన్న మామూలు అనువాదం సరిపోదేమో! అటువంటి 'హ్యూమిలియేషన్'కు గురై, ఎంతో పెద్ద 'ఏంబిషన్'తో వచ్చిన రోహిత్ వేముల వంటి బ్రైట్ విద్యార్థి కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ, మన పెరియన్ అలా కాకుండా తన ఆత్మగౌరవాన్ని కూడగొట్టుకుని ఎదురు నిలవాలనుకుంటాడు. కానీ, అతడ్ని ప్రతిసారీ మరింత అపనిందల పాలు చేస్తుంటారు శంకరలింగం అండ్ కో. పేరెంట్ కాల్‌పై కొత్త ప్రిన్సిపాల్‌తో కలవడానికి వచ్చిన అతడి తండ్రినీ బట్టలూడదీసి అవమానిస్తారు ఈ పెత్తందారీ మూక.

అనుమానం రాకుండా పగడ్బందీగా హత్యలు చేసే ఒక ముసలాడి పాత్ర ఈ సినిమాలో ఉంది. కులహంకారం వంటబట్టించుకున్న ఇతడు 'తను చేసే హత్యలు కులదేవతకు నైవేద్యం' లాంటివని చెప్పుకుంటాడు. ఇతడికి కులపిచ్చి ఎంతెక్కువంటే ఊరి చెరువులో స్నానమాడినందుకు ఒకడ్ని చంపుతాడు. కులం తక్కువవాడ్ని ప్రేమించిన అమ్మాయి ఇంకా బతికుందని తెలిసినా చంపేస్తాడు. నిమ్నజాతి వాడి పక్కన బస్సులో కూర్చోడు. కులం హత్యల్ని, పరువు హత్యల్ని ఆక్సిడెంట్లుగా, ఆత్మహత్యలుగా చలామణి చేయగలడు. ఇతన్నే పెరియన్ హత్య కోసం నియమిస్తారు. పెరియన్ మంచి వాడని తెలిసినా 'కులం' కోసం ఒప్పుకుంటాడు. అయితే, అతడు పెరియన్ హత్యను ప్రమాదంగా చూపే యత్నంలో విఫలుడై తను ఓడినందుకు అవే పట్టాలపై ఆత్మహత్య చేసుకుంటాడు ఆ ముసలాడు.

కరుపి సినిమా మొదట్లోనే చనిపోయినా, దాని నీడ సినిమా మొత్తం ఉంటుంది. అది అవమానపు 'నలుపు' నుంచి ఉద్యమించే 'నీలం'లోకి మారుతుంది. చాలా ప్రతీకాత్మకంగా సినిమా ఆఖర్లో కథానాయకుణ్ణి కాపాడుతుంది. 'నాన్ యార్?' (నేనెవర్ని?) పాట నిండా ఎన్నో ప్రతీకలు. పురాణాల నుంచి, సైకో ఎనాలిసిస్ నుంచి, వార్తల నుంచి, ఇళవరాసన్, రోహిత్ వేముల ఇలా ఎన్నెన్నో! 'చావు తర్వాత నీలం రంగులోకి మారే నేనెవర్ని?' అన్న పాటలోని వాక్యం శరీరతత్వాన్ని, పోరాటతత్వాన్ని బోధిస్తున్నట్టు ఉంటుంది. ఒకచోట బస్టాండ్లో పూర్వ రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ మృతికి సంబంధించిన పోస్టర్ ఒకటి ఉంటుంది. తర్వాతర్వాత దళితుల (ఆత్మ)హత్యల పోస్టర్లతో ఆ గోడ కప్పబడిపోతుంది. దళితుడు దేశాధ్యక్షుడైనా, దళితులపై అమానుషత్వం ఏమాత్రం తగ్గలేదు అని చెప్పకనే చెబుతాడు దర్శకుడు.

కథానాయకుడి అడ్మిషన్ నాటి అగ్రవర్ణ ప్రిన్సిపాల్ దృక్కోణానికీ, తర్వాత వచ్చిన దళిత ప్రిన్సిపాల్ దృష్టికీ తేడా ఉన్నట్టు చూపుతాడు దర్శకుడు. 'నేను చెప్పులు కుట్టేవాడి కొడుకునని నన్ను అవమానించినవారే.. నేడు ఈ స్థితికి వచ్చిన తర్వాత చేతులెత్తి నమస్కరిస్తున్నారు. కాబట్టి కష్టపడి పైకి రా! నీకు జరిగిన అవమానాన్ని, నీ కోపాన్ని కసిగా నీ చదువు మీద చూపించు. నువ్వు అనుకున్నది సాధించు. అప్పుడే నిన్ను సమాజం గుర్తిస్తుంది!!' అని ఆయన పెరియన్‌కి ధైర్యం చెబుతాడు.

కదిర్ అమాయకమైన మొహం కథానాయకుడి పాత్రకు తగ్గట్టు సరిపోయింది. జో (ఆనంది) పాత్ర చిత్రణలో కొంత లోపం ఉందనిపించింది. కానీ, సంగీతం పెద్ద హైలైట్. పారంజిత్ కోసం సంతోష్ నారాయణన్ ప్రత్యేకంగా కంపోజ్ చేస్తాడేమో! అన్ని పాటలతో సహా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా అమోఘం. ఫోటోగ్రఫీ, ఎడిటింగ్‌లకీ వంద శాతం మార్కులు దక్కాలి. కథలో ఎన్నెన్నో అంశాలతో పాటు జెండర్ అంశం పెరియన్ తండ్రి పాత్ర ద్వారా చెప్పడం బావుంది. చాలా వివాదాస్పదమైన సబ్జెక్టు అయినప్పటికీ ఉపన్యాసధోరణి లేక ప్రచారధోరణి రానివ్వకుండా కథాకథనంలోనే తన సందేశాన్ని ఎంతో సున్నితంగా చెబుతాడు దర్శకుడు. కాదు, మనల్ని ఆలోచించమని అభ్యర్థిస్తాడు. ఇంత సున్నితంగా మాట్లాడిన సినిమాను కూడా 'కులాల మధ్య చిచ్చుపెట్టే సినిమా' అని తీర్మానించేవాడు తప్పకుండా అతి పెద్ద కులదురహంకారి అయ్యుండాలి.

- బాలాజీ (కోల్‌కతా)

జానపదం

జనం మెచ్చిన జానపదం ఒగ్గు కథ



ఒగ్గు కథ...ఈ పదం వినని తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో...అంతగా తెలుగు ప్రజలు ముఖ్యంగా తెలంగాణ ప్రాంతీయుల జీవితాలతో పెనవేసుకుపోయిన జానపద కళారూపం ఒగ్గు కథ.

'ఒగ్గు' అనేది అచ్చమైన దేశీపదం. ఈ పదానికి 'జెగ్గు','జగ్గు' అని నామాంతరాలున్నాయి. శివుని చేతిలోని ప్రత్యేక వాయిద్యం ఢమరుకం. దానినే కళాసాధనంగా వ్యక్తీకరించడాన్ని 'ఒగ్గు' అంటారు.

'ఒగ్గు కథ' కేవలం కథ మాత్రమే కాదు. గానం, నృత్యం, నాటకాల సమ్మేళనం - గొల్ల, కురుమలు తమ కుల పురుషుడు బీరప్ప కథ చెప్పేందుకు ఎంచుకున్న రూపమే 'ఒగ్గు' కథ. ఈ కథా ప్రక్రియకు, చదువు అవసరం లేదు. డోలు, తాళం, కంజీర వాయిద్యాలతో, తెలంగాణ భాషలో గంటల కొద్దీ ఎన్నయినా కథలు చెబుతారు. పాటలు జోడించి, కథను పండిస్తారు. పురాణాల మీద పట్టుతో ఆశువుగా కథ అలా చెప్పేస్తారు. నెత్తిన బోనం ఉంచుకుని కథ చెబుతూనే నేలను తలతో ముద్దాడతారు. ఈ కథాగాన కళా ప్రదర్శనంలో ఒకరు ప్రధాన కథకులు, అయితే ఇద్దరూ ముగ్గురూ లేక అంతకు ఎక్కువ మంది సహా కళాకారులుంటారు 'ఒగ్గు' కథలో. 'ఒగ్గు' కథలను చెప్పే కళాకారులను ఒగ్గు గొల్లలు అంటారు.

ఒగ్గు దీక్ష తర్వాతే వీరు బీరన్న, మల్లన్న కథలు చెప్పేందుకు అర్హత సంపాదించుకొన్నట్లు అవుతుంది. కురుమలు బీరప్ప దీక్ష తీసుకున్న వాళ్లు బీరప్పలవుతారు. వీరు నెత్తి విరబోసుకోని, నుదుటిన పసుపు రాసుకొని, కళ్లకి కాటుక రాసుకొని, ఎర్రని పొట్టి చేతుల చొక్కా, మువ్వల లాగు ధరించి, కాళ్లకి గజ్జెలు కట్టుకొని, నాట్యం చేస్తూ శైవగీతాలు పాడతారు.

ఈ కథల ఇతివృత్తాల్లో శివుడు కథానాయకుడిగా ఉంటాడు. లేదా శివుని అంశతో జన్మించిన వారు నాయకులుగా ఉంటారు. ఉదాహరణకు శివుని తొలి చెమట నుండి బీరప్ప, మలి చెమట నుంచి మల్లన్న పుట్టారని, ఎల్లమ్మ శివుని కూతురని ఆయా కథల్లో వివరిస్తుంటారు. 'ఒగ్గు' కథల్ని తెలంగాణ ప్రాంతంలోని గొల్ల, కుర్మలు తమ కుల పురాణంగా భావిస్తారు. కుర్మలు ఈ కథల్ని ఎక్కువ ప్రచారం చేశారు. తరువాతి కాలంలో ఇతర కులాల వాళ్లు ఈ కళారూపాన్ని నేర్చుకొని, ప్రచారం చేశారు. ఇటువంటి వారి సంఖ్య చాలా తక్కువ. బీరప్ప, మల్లయ్య కథలు మొదటి నుంచి ఉన్నాయి. ఆ తరువాత ఇతర కథలు పుట్టుకొచ్చాయి.

కళారూపం

ఒగ్గు కళారూపం చూస్తుంటే ఒక నాటకం చూసిన అనుభూతి.. ఒక నాట్యకళని వీక్షించినంత ఆనందం.. ఒక ప్రవచనం విన్నంత సంతృప్తి.. ఒక సంగీత కచేరీలో దొరికేంత రసాస్వాదన లభిస్తుంది. అదొక సముద్రం. విభిన్నమైన కథా గాన కళా రూపాలలో 'ఒగ్గు' కథ ఒక్క తెలంగాణా ప్రాంతంలో తప్ప మరో ప్రాంతంలో లేదు. అందులోనూ వరంగల్, నల్లగొండ హైదరాబాదు జిల్లాలలో బహుళ ప్రచారంలో ఉంది. ఈ మూడు జిల్లాలలోనూ సుమారు 50 'ఒగ్గు' కథా బృందాలు కథలు చెపుతూ ఉన్నాయి.

కథా వాయిద్యాలు

'ఒగ్గు' కథలో తప్పకుండా ఉండేది 'ఒగ్గు'. దీన్ని పలు సన్నివేశాల్లో తాళానికి అనుగుణంగా, సంఘటనలకి అనుకూలంగా వాయిస్తూంటారు. ఒక్కోసారి ఈ వాయిద్యాన్ని ఆయా పాత్రలుగా ఊహింపజేస్తారు. ఉదాహరణకి చిన్నపిల్లాడిని లాలించే సందర్భం వచ్చినప్పుడు ఒగ్గుని ఆ చిన్నపిల్లాడిలా ఊహింపజేసి, ప్రేక్షకులని ఆ సంఘటనలో లీనం చేస్తారు. కథా నడకలో 'ఒగ్గు' కొంచెం డోలుకన్న తక్కువ ప్రాధాన్యతని కలిగుంటుంది. జానెడు పొడవుతో మధ్యభాగం ఇత్తడి లేదా చెక్కతో ఉండి, ఇరువైపులా మేక చర్మాన్ని బిగించి.. ఈ 'ఒగ్గు'ని తయారుచేసుకుంటారు.

డోలు

అన్ని వాయిద్యాల్లోకెల్లా పెద్దది, ముఖ్యమైనది డోలు. డోలు మోతతోనే కథ ప్రారంభమవుతుంది. సుమారు ఒక మీటరు పొడవుండీ డ్రమ్ము ఆకారంలో ఇత్తడితో కానీ, చెక్కతో కానీ నిర్మాణమై ఉంటుంది. ఇరువైపులా మేక చర్మాన్ని అమర్చి, తాళ్ళతో బిగిస్తారు. గంభీరమైన ధ్వని చేస్తూ ప్రతి సన్నివేశంలో తప్పక మోగే వాయిద్యం డోలు. కథాగమనంలో కొన్ని సన్నివేశాల్లో ఉద్రేకం కలిగించడానికి డోలుని మెళ్ళో వేసుకుని, నాట్యం చేస్తారు. పళ్ళతో బిగించి పట్టుకుని తాండవం చేస్తారు. గుండ్రంగా ఆవేశంతో తిరుగుతారు. వీపుకు తగిలించుకుని, విన్యాసంగా వాయిస్తారు. ఇలా చిత్రవిచిత్ర చేష్టలతో జనాలకి విసుగు రాకుండా, రాత్రుళ్లు నిద్రపోకుండా ఆసక్తిగా కథని నడిపిస్తారు.

తాళాలు

అరచేతికి రెండింతలు పెద్దగా ఉండి ప్రతి రాగానికీ లయని అందిస్తూ, శ్రావ్యంగా మోగే వాయిద్యమే 'ఒగ్గు'లో ఉపయోగించే తాళాలు. వీటికి తోడుగా చిన్నతాళాలనీ ఉపయోగిస్తారు. మెండు తాళం, దుయ్యర, మెండు దుయ్యర, ఆదితాళం, మెండు భైరవి, వలపోత బీగడ వంటి వివిధ రకాల తాళగతులను ఉపయోగిస్తారు.

నపీర

నపీర ఇత్తడి లోహంతో తయారవుతుంది. అర్ధచంద్రాకారంలో ఉంటుంది. ఒక చివర సన్నగా ఉండి, మరోవైపు కొంచెం వెడల్పుగా ఉంటుంది. నోటితో గట్టిగా ఊదితే భీకరమైన ధ్వని వినిపిస్తుంది. ఇంకా కాళ్ళకు గజ్జెలు, భుజంపై రుమాలు, చేతిలో చిన్న కర్రని కథా నడకకి ఉపయోగించుకుంటారు.

కథా నడక

ఇతివృత్తం దగ్గర నుంచి కథనం వరకు ప్రత్యేకమైన శైలిలో నిర్మాణం పొందిన ప్రక్రియ 'ఒగ్గు'కథ. జీవిత చరిత్రల్ని ఇతిహాసాలుగా మలిచే పద్ధతి 'ఒగ్గు' కథని చూసి నేర్చుకోవచ్చు. ఒక ప్రధాన కథకుడు, ఒక సహాయకుడు ముగ్గురు వంతగాళ్ళూ ఉంటే చాలు.. ఒగ్గు కథ అలవోకగా సాగిపోతుంది. ఒగ్గు కళాకారులకి ముఖ్యంగా నాలుగు విషయాలపై పట్టుంటుంది. వీరు ప్రదర్శించే ఈ అంశాల్లోని నైపుణ్యమే ఒగ్గుకథని జానపదుల హృదయ స్పందనల్లో ఎప్పటికీ మర్చిపోలేని రీతిలో నిలబెట్టింది.

సంగీతం, ఉచ్చారణలో నైపుణ్యం

'ఒగ్గు' కథా నిర్వహణలో శబ్దం పాత్ర కీలకమైంది. సంభాషణలు, ధ్వన్యనుకరణలు, రాగాలు అన్నీ శబ్దంపైనే ఆధారపడి ఉంటాయి. 'ఒగ్గు' కళాకారులు ఆశురచనా నైపుణ్యం కూడా కలిగి ఉంటారు. యతిప్రాసలు తప్పకుండా మాత్రా చందస్సులో కథా సందర్భానికి తగిన విధంగా పాటలు అల్లుతారు. మూలకథకి ఏమాత్రం భంగం కలగకుండా వీటిని జొప్పిస్తారు. అప్పుడప్పుడు హాస్యపు సంఘటనల్నీ శ్రోతల్లో ఉత్సాహం కలిగించడం కోసం సృష్టిస్తుంటారు. కథచెబుతూ వెంటనే పాత్రదారునిగా మారటం, అందులో పూర్తిగా లీనమై వెనువెంటనే కథకుడిగా మారటం సంయమనం ఉన్న కళాకారుడు తప్ప ఇతరులకి అసాధ్యం. 'ఒగ్గు' కళారూపంలో ఇలాంటి ప్రత్యేకతలెన్నో. అరుదైన కళల జాబితాలోకి వెళ్ళే ప్రమాదంలో పడిన 'ఒగ్గు' కథనూ సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.



సైనా, శ్రీకాంత్ శుభారంభం

మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



హైదరాబాద్ : మలేషియాలో జరుగుతున్న బిడబ్ల్యుఎఫ్ సూపర్ సిరీస్-500 టోర్నీలో భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్‌లు రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోరులో శ్రీకాంత్ 21-17, 21-11 పాయింట్ల తేడాతో లాంగ్‌అంగస్(హాంకాంగ్)ను చిత్తుచేశాడు. మరో మ్యాచ్‌లో పారుపల్లి కశ్యప్ 19-21, 21-19, 21-10 పాయింట్ల తేడాతో రస్మస్(డెన్మార్క్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ 14-21, 21-18, 21-18తో జోయ్ డెంగ్(హాంకాంగ్)పై చెమటోడ్చి నెగ్గింది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 21-16, 22-20తో హాంకాంగ్ జోడీపై గెలిచి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. రెండోరౌండ్‌లో సైనా హాంకాంగ్‌కు చెందిన ఇన్-ఇప్‌తో, 8వ సీడ్ శ్రీకాంత్ హాంకాంగ్‌కే చెందిన వాంగ్-వింగ్‌తో తలపడనున్నాడు.



మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఫెదరర్ భార్య, పిల్లలు

మూడో రౌండ్‌కు నదాల్, ఫెదరర్

- అండర్సన్, బెర్టెన్స్ ఓటమి
- భారత పురుషుల డబుల్స్ జోడీలు పరాజయం

మెల్‌బోర్న్ : తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి నదాల్, ఫెదరర్ ప్రవేశించారు. భారత పురుషుల డబుల్స్ జోడీలు లియాండర్ పేస్, బొప్పన్న, నెడుంఛెజియన్ జోడీలు తొలిరౌండ్‌లోనే ఓడి ఇంటిముఖం పట్టాయి. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీల్లో రెండోసీడ్ నదాల్ 6-3, 6-2, 6-2 ఎబ్డెన్(ఆస్ట్రేలియా)ను, మూడోసీడ్ రోజర్ ఫెదరర్ 7-6(7-5), 7-6(7-3), 6-3 సెట్ల తేడాతో ఎవాన్స్(బ్రిటన్)పై గెలిచారు. ఇతర పోటీల్లో 18వ సీడ్ స్వార్ట్జ్‌మన్(అర్జెంటీనా) 6-4, 7-5, 3-6, 6-7(6-8), 6-4తో కుడ్లా(అమెరికా)పై, 19వ సీడ్ బసిలాష్విల్ 3-6, 6-3, 3-6, 6-4, 6-3తో ట్రవాగ్లియా(ఇటలీ)పై చెమటోడ్చి నెగ్గి మూడోరౌండ్‌లోకి ప్రవేశించారు. ఐదోసీడ్ కోరె అండర్సన్ 6-4, 4-6, 4-6, 5-7 సెట్ల తేడాతో ట్రాఫియో(అమెరికా) చేతిలో అనూహ్యంగా ఓడి టోర్నీనుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్ రెండోరౌండ్ పోటీల్లో రెండోసీడ్ కెర్బర్(జర్మనీ) 6-2, 6-3 మైనా(బ్రెజిల్)పై, రష్యాకు చెందిన షరపోవా 6-2, 6-1 సెట్ల తేడాతో పెటెర్సన్(స్వీడన్)పై గెలిచి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇతర పోటీల్లో మూడోసీడ్ వాజ్నియాకీ 6-1, 6-3తో లార్సన్(స్వీడన్)ను, ఐదోసీడ్ స్టెఫెన్స్(అమెరికా) 6-3, 6-1తో బాబోస్(హంగరీ)పై విజయాలను నమోదు చేసుకున్నారు.

భారత పురుషుల జోడీలు పరాజయం

ఇక భారత్‌కు చెందిన లియాండర్‌పేస్, బొప్పన్న, నెడుంఛెజియన్ జోడీలు తొలిరౌండ్‌లోనే ఓడి ఇంటిముఖం పట్టాయి. లియాండర్-రెయాస్ జోడీ 5-7, 6-7(4-7)తో అమెరికా-ఆస్ట్రియా జోడీ చేతిలో, 15వ సీడ్ బొప్పన్న-షరన్ జోడీ 1-6, 6-4, 5-7 సెట్ల తేడాతో స్పెయిన్‌కు చెందిన బూస్టా-లోపెజ్ జోడీ చేతిలో ఓడింది. ఇండో-అమెరికన్ జోడీ నెడుంఛెజియన్-మొన్రో జోడీ 4-6, 7-6(10-8), 5-7 సెట్ల తేడాతో క్రొయోషియా-జర్మనీ జోడీ చేతిలో ఓడి నిరాశపర్చారు.

పాండ్యా, రాహుల్‌పై విచారణ షురూ



న్యూఢిల్లీ: యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లు మంగళవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) సిఇఓ రాహుల్ జోహ్రికి వివరణ ఇచ్చారు. బిసిసిఐ వీరిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాండ్యా బేషరతుగా క్షమాపణలు తెలియజేసిన సంగతి తెలిసిందే. వారిద్దరి నుంచి వివరణ అనంతరం బుధవారం నివేదికను క్రికెట్ పాలకుల కమిటీకి అప్పగించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం వీరిద్దరిపై విచారణ పూర్తయిందని, తర్వాతి దశ అంబుడ్స్‌మన్ నియామకంతో మొదలవుతుందని వెల్లడించారు. సుప్రీం కోర్టు అంబుడ్స్‌మన్‌ను నియమించాల్సి ఉంది. యువ క్రికెటర్ల కెరీర్ ముగిసేలా చర్యలు తీసుకోవద్దని సీఓఏ అధినేత వినోద్ రాయ్ సూచిస్తున్నారు. కేవలం రెండు మ్యాచ్‌ల నిషేధం సరిపోతుందని తెలుపగా, మరో సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం వ్యవహారాన్ని బిసిసిఐ న్యాయశాఖ వద్దకు తీసుకెళ్లాలని పట్టుబడుతున్నారు. విచారణ పేరుతో సమయం గడపొద్దని త్వరగా తేల్చేయాలని రాయ్ కోరుతున్నారు.

కేరళకు ఆధిక్యం

కేరళ : రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్స్ పోటీలు మంగళవారం నుండి ప్రారంభమయ్యాయి. కేరళజట్టు పోటీల్లో కేరళజట్టు తొలి ఇన్నింగ్స్ 171 పరుగులు చేయగా, గుజరాత్ 162 పరుగులకే పరిమితమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కేరళ జట్టు బుధవారం రెండోరోజు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసి గుజరాత్‌పై 194 పరుగుల ఆధిక్యతను సంపాదించింది. సౌరాష్ట్ర తరపున బరిలోకి దిగిన పుజారా నిరాశపర్చడం, యుపి బౌలర్ శివమ్ మావి ఐదు వికెట్లతో సత్తా చాటడంతో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే పరిమితమైంది.

కోహ్లి సెంచరీ.. ధోని ఫినిషింగ్ టచ్



రెండో వన్డేలో భారత్ ఘనవిజయం



అడిలైడ్ : ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డేలో కెప్టెన్ విరాట్ కోహ్లి సెంచరీతో చెలరేగడంతో భారత్ ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో ధోని ఫినిషింగ్ టచ్‌తో టీమిండియాకు విజయాన్ని ఖాయం చేశాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్.. షాన్ మార్ష్ (131) అద్భుత సెంచరీకి తోడు మాక్స్‌వెల్(48)లు చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లకు 9 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ వన్డేల్లో అరంగేట్రం చేసిన హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భువనేశ్వర్‌కు నాలుగు, షమికి మూడు, జడేజా ఒక వికెట్ లభించాయి. అనంతరం 299 పరుగుల భారీ లక్ష్య చేధనకు దిగిన భారత్‌కు ఓపెనర్లు శిఖర్ ధావన్ (32), రోహిత్ శర్మ(43)లు తొలి వికెట్‌కు 7.4 ఓవర్లలో 47 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించారు. రెండో వికెట్‌కు కోహ్లి-రోహిత్ 54 పరుగులు జోడించిన అనంతరం రోహిత్ క్యాచ్‌ఔట్‌గా వెనుదిరిగాడు. రాయుడు(24) నిరాశపర్చినా మూడో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించాడు. ఇక ధోనీ రాకతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. కోహ్లి 105 బంతుల్లో 5 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో కెరీర్‌లో 39వ వన్డే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరికి రిచర్డ్సన్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మ్యాక్స్‌వెల్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. చివర్లో ధోనీ పూర్వపు ఫామ్‌ను అందుకొని ఆఖరి ఓవర్‌లో ఏడు పరుగులు చేయాల్సిన దశలో బెహ్రన్‌డార్ఫ్ వేసిన తొలిబంతిని ఎంఎస్ సిక్సర్‌గా మలిచి టీమిండియాకు విజయాన్ని ఖాయం చేశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కోహ్లికి దక్కింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. నిర్ణయాత్మక ఆఖరి వన్డే శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరగనుంది.

వంద సెంచరీలు కొడతాడు

- టీమిండియా మాజీ సారథి అజారుద్దీన్
- కోహ్లి ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడమే ముఖ్యం



న్యూఢిల్లీ : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి వంద సెంచరీలు సాధిస్తాడని మాజీ సారథి మహ్మద్ అజారుద్దీన్ జోస్యం చెప్పాడు. కానీ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడమే అతని ముందున్న ప్రధాన బలహీనతని తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో విరాట్ మరే ఆటగాడికి అందనంత ఎత్తులో సెంచరీలు సాధిస్తున్నాడని, ఇప్పటికే వన్డేలు, టెస్టులో కలిపి 64 సెంచరీలు పూర్తి చేసి సచిన్, పాంటింగ్ తర్వాతి స్థానంలో ఉన్నాడన్నాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లో వంద సెంచరీలు చేసిన ఆటగాళ్లలో సచిన్ టెండూల్కర్, 71 సెంచరీలతో రికీ పాంటింగ్ రెండోస్థానంలో కొనసాగు తున్నాడు. వీరిద్దరూ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పిన నేపథ్యంలో వీరి రికార్డును బద్దలు కొట్టగల సత్తా ఉన్న ఏకైక ఆటగాడు ఒక్క విరాట్ మాత్రమే అని కొనియాడాడు. అంతేగాక విరాట్ ఫామ్ చూస్తుంటే ఆ ఫీట్‌ను త్వరగా బ్రేక్ చేయగల సత్తా ఉన్న విరాట్‌కు ఉందని మహ్మద్ అజారుద్దీన్ అభిప్రాయపడ్డాడు. ఆడిలైడ్‌లో ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. ఈ వన్డేలో విరాట్ సెంచరీని పూర్తి చేయడంతో ద్వారా అంతర్జాతీయంగా వన్డేల్లో 39వ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టెస్టులు, వన్డేల్లో కలిపి విరాట్ ఇప్పటివరకు 64 సెంచరీలు పూర్తి చేసినట్లైంది. 'విరాట్ కోహ్లి నిలకడగా బాగా ఆడుతున్నాడు. ఫిట్‌గా ఉంటే 100 సెంచరీల మార్క్‌ను కచ్చితంగా చేరుకుంటాడు. కోహ్లి సెంచరీ చేసిన చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే టీమిండియా ఓడిపోయింద'ని అజారుద్దీన్ పేర్కొన్నాడు. అర్ధ సెంచరీతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిపై కూడా అజర్ ప్రశంసలు కురిపించాడు. ఆస్ట్రేలియాతో రెండో వన్డే సందర్భంగా ధోని బాగా బ్యాటింగ్ చేశాడని, చివరివరకు వికెట్ కాపాడుకుని విన్నింగ్ షాట్ కొట్టడం అతడికే చెల్లిందని మెచ్చుకున్నాడు.

పిన్న వయసు గ్రాండ్‌మాస్టర్‌గా
గూకేశ్ రికార్డ్



చెన్నై: తమిళనాడుకు చెందిన డి. గూకేశ్ దేశంలోనే అత్యంత చిన్న వయస్కుడైన గ్రాండ్ మాస్టర్‌గా అవతరించాడు. 12 సంవత్సరాల 7నెలల 17 రోజుల వయసులో గ్రాండ్ మాస్టర్(జీఎం) హోదాకు కావాల్సిన అన్ని నిబంధనలను పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. న్యూఢిల్లీ ఇంటర్నేషనల్ ఓపెన్ గ్రాండ్ మాస్టర్ చెస్ టోర్నమెంటులో 9వ రౌండ్‌లో దీపక్ శర్మను ఓడించి అతడు తన ఫైనల్ జీఎం నార్మ్‌ను పూర్తి చేశారు. అయితే రష్యాకు చెందిన సెర్జె కర్జాకిన్ పేరు మీద 2002 నుంచి ఉన్న రికార్డును బద్దలు కొట్టాలన్న అతడి ప్రయత్నం మాత్రం ఫలించలేదు. కర్జాకిన్ 12 సంవత్సరాల 7 నెలలకు జీఎం హోదాను పొందాడు. అయితే అదే రాష్ట్రానికి చెందిన ఆర్. ప్రజ్ఞానంద(12 ఏళ్ల 10 నెలల 13 రోజులు) పేరు మీద గత సంవత్సరం జూన్ నుంచి ఉన్న రికార్డును బద్దలు కొట్టి దేశంలోనే అత్యంత చిన్న వయస్కుడైన జీఎంగా నిలిచాడు. దాంతో గూకేశ్ దేశంలో ఈ హోదాను సాధించిన 59వ చెస్ ఆటగాడిగా నిలిచాడు.

నాగభూషణ శర్మ మరణం పట్ల సిఎం సంతాపం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ప్రముఖ నాటకర్త, రచయిత, పరిశోధకులు ఆచార్య మొదలి నాగభూషణ శర్మ అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలుగు జానపద కళలు, పాశ్చాత్య నాటక రంగాల్లో ఆయన చేసిన సేవ ఎంతో గొప్పదన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు. ఆయన రచనలు ప్రజలను ఆలోచింపజేసేవిగా ఉండేవని, చదువుకునే రోజుల్లోనే రచనలు చేసేవారని పేర్కొన్నారు. భారతీయ నృత్య సంప్రదాయల్ని గుర్తించిన ఏకైక త్రైమాసిక పత్రిక "నర్తమ్"కు వ్యవస్థాపక సంపాదకులుగా ఆయన వ్యవహరించారని తెలిపారు. నాగభూషణ శర్మ చేసిన కృషికి కేంద్ర సంగీత నాటక అకాడమీ "టాగోర్ రత్న", రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ అవార్డు వంటివి బహూకరించాయని తెలిపారు.

ఎన్టీఆర్ వర్ధంతి నాడు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా ఈనెల 18న పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాల్ని నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర పార్టీ కార్యాలయం కార్యదర్శి ఎవి రమణ, జాతీయ మీడియా కమిటీ కన్వీనర్ ఎల్‌విఎస్‌ఆర్‌కె ప్రసాద్ బుధవారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో నిపుణులైన వైద్య బృందంచే ఉచిత పరీక్షలు, ఇసిజి, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వరంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

ఎపి బిజెపి మ్యానిఫెస్టో కమిటీ నియామకం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఆంధ్రప్రదేశ్ బిజెపి మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, సభ్యుల కమిటీ జాబితాను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం విడుదల చేశారు. చైర్‌పర్సన్‌గా డి.పురంధరేశ్వరి, కన్వీనర్‌గా ఐవైఆర్ కృష్ణారావు, సభ్యులుగా పి విజయబాబు, పివిఎన్ మాధవ్, డి శ్రీనివాసులు, షేక్ మస్తాన్, పి సత్యనారాయణ, కె కపిలేశ్వరయ్య, పి సన్యాసి రాజు మురళి, సుధీష్ రాంబొట్ల, డిఎఆర్ సుబ్రమణ్యంలను నియమించినట్లు తెలిపారు.

మైనార్టీలపై చిన్నచూపు!

- బడ్జెట్ కేటాయింపు తక్కువ
- ఖర్చు చేసిందీ స్వల్పమే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలపట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. వారి అభివృద్ధికి నిధులు తక్కువగా కేటాయించడమేగాక వాటిని ఖర్చు చేసే విషయంలోనూ నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రచారం కొండంత- చేసింది గోరంత అన్న చందంగా వుందీ సర్కారు నిర్వాకం. గత ఐదు సంవత్సరాల్లో బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు చేసిన విధానం ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. బడ్జెట్ అంచనాలకు,

సంవత్సరం	బడ్జెట్ అంచనాలు	మంజూరు	ఖర్చు (కోట్లల్లో)
2014-15	575.20	409.30	384.65
2015-16	468.32	346.63	335.31
2016-17	795.61	788.61	635.85
2017-18	849.03	766.27	651.75
2018-19	1101.90	716.21	600.30
మొత్తం	**3830.06**	**3027.02**	**2607.86**

మంజూరు చేస్తున్న నిధులకు పొంతన ఉండటం లేదు. తొలుత బడ్జెట్ అంచనాలు ఎక్కువ చూపుతున్న ప్రభుత్వం మంజూరుకొచ్చేసరికి బాగా తగిస్తోంది. వాటిని కూడా పూర్తిగా చేయని దుస్థితి నెలకొంది. ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఐదేళ్లలో బడ్జెట్ అంచనా రూ.3,830.06 కోట్లు చూపి, మంజూరు చేసింది రూ.3,027.02 కోట్లు కాగా వాస్తవంగా ఖర్చు చేసింది కేవలం రూ.2607.86 కోట్లు మాత్రమే! ఈ ఏడాది ఇంకా నడుస్తోంది కనుక దాన్ని మినహాయించినా నాలుగేళ్ల కేటాయింపుల్లో ఖర్చు చేసింది 73.58 శాతం కావడం గమనార్హం. అంటే మైనార్టీల సంక్షేమానికి రూపాయి వెచ్చిస్తానని చెప్పిన ప్రభుత్వం ముప్పావలా కూడా ఖర్చు చేయడం లేదన్నమాట.



రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వనందున మైనార్టీలకు అందవలసిన అనేక పథకాలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. మైనారిటీ విద్యార్థులకు విద్య పర మైన ప్రోత్సాహం నామమాత్రంగానే ఉంది. గత నాలుగు సంవత్సరాల్లో ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం బడ్జెట్ కేటా యింపులు, విద్యార్థులకు అందించిన వివరాలు ఒక సారి పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. 2014-15లో 1,07,914 మంది విద్యార్థులకు రూ. 150 కోట్లు రీయిం బర్స్‌మెంట్ ఇవ్వాల్సి వుండగా రూ. 147 కోట్లు 1,06,436 మందికి రీయంబర్స్ చేశారు. 2016-17లో 1,16,347 మంది విద్యార్థులకు రూ. 235.56 కోట్లు ఇవ్వాల్సివుండగా రూ. 203.44 కోట్లతో 1,07,531 మందికి మాత్రమే ఇచ్చారు. గత విద్యా సంవ త్సరంలో 1,27,912 మందికి రూ. 225 కోట్లతో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వాల్సి ఉండగా రూ. 196 కోట్లు 1,16,755 మందికి ఇచ్చారు. చంద్రన్న పెళ్లి కానుక కూడా సరిగా అందడం లేదు. ఈ పథకం కింద మొత్తం 9308 మంది దరఖాస్తులు చేసుకుంటే ఇప్పటి వరకు కేవలం రూ. 15.17 కోట్లను 3034 మందికి పంపిణీ చేశారు.

మెగా రుణ మేళాల్లో మైనారిటీ, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన రుణాల వివరాలు

	లక్ష్యం		ఇచ్చింది	
	ముస్లిం	క్రిస్టియన్	ముస్లిం	క్రిస్టియన్
మొదటి ఎంజిఎం	5535	214	936	52
రెండో ఎంజిఎం	8157	261	113	05
మూడో ఎంజిఎం	6531	521	30	02

ఇక ముస్లిం, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్లు అందించే రుణాల పరిస్థితి అంతంత మాత్రమే. 20,223 మంది ముస్లిం మైనారిటీలకు, 996 మంది క్రిస్టియన్లకు రుణాలు అందించాలన్న లక్ష్యానికిగానూ కేవలం 1079 మంది ముస్లిం, 59 మంది క్రిస్టియన్ మైనారిటీలకు మాత్రమే రుణాలు అందించారు.పరిస్థితి ఎంత అధ్వానంగా వుందీ ఈ వివరాలే తెలియజేస్తున్నాయి.

ఫిబ్రవరి 15 నుంచి దేశవ్యాప్త ఉద్యమం

వ్యకాస ప్రధాన కార్యదర్శి రాఘవన్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఉపాధి హామీ పరిరక్షణ, సామాజిక భద్రత కోసం ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ విజయ రాఘవన్ పిలుపునిచ్చారు. బుధవారం కలకత్తాలో జరిగిన వ్యకాస జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీకి ఏటా నిధులు కత్తిరించి, పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కనీసం రూ.1.60 లక్షల కోట్లు కేటా యించాల్సి ఉండగా, 2017-18లో రూ.61,426 కోట్లు, 2018-19 నాటికి రూ.54,781 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. కేటాయించిన నిధులు సైతం రాష్ట్రాలకు విడుదల చేయకపోవడంతో నెలల తరబడి వేతన బకాయిలున్నాయని, అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని విమర్శించారు. సామాజిక భద్రత పథకాలకు రూ.2,43 లక్షల కోట్లు కేటాయించినప్పటికీ కేవలం 48 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని రాఘవన్ గుర్తుచేశారు. దీన్ని బట్టి సామాజిక భద్రతా పథకాలు, పెన్షన్లు, ఇళ్లు, బీమా పట్ల మోడీ ప్రభుత్వ వైఖరి వెల్లడవుతోందన్నారు. ఆహారభద్రత, సామాజిక భద్రత, ఉపాధి హామీ పథకాల పరిరక్షణకు దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు ఆందోళన, పోరాటాలు నిర్వహించాలని కౌన్సిల్ సమావేశాలు తీర్మానాన్ని ఆమోదించాయన్నారు. మతోన్మాద ఎజెండా స్థానంలో, వ్యవసాయరంగ పరిరక్షణే ఎజెండాగా రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమాలు ప్రభుత్వాల్ని కుదిపేశాయని, రానున్న కాలంలో ప్రభుత్వాన్ని కదిలించేలా ఉద్యమాల్ని మరింత ఉధృతం చేయాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా అన్నారు. వివిధ రాష్ట్రాల కౌన్సిల్ సభ్యులతో పాటు రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వరులు, దడాల సుబ్బారావు, బి.వెంకట్, రవి, రాజు, కళ్యాణ్, అప్పారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కన్నయ్యపై కుట్రకేసు దారుణం

సంగమం కన్వీనర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థి సంఘ నాయకుడు కన్నయ్య కుమార్‌లో పాటు పలువురిపై రాజద్రోహం కేసు మోపి ఛార్జ్‌షీటు దాఖలు చేయడాన్ని సంగమం కన్వీనర్ సి ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా వారిపై చేసిన ఆరోపణలు కుట్ర పూరితమైనవంటూ ప్రగతిశీల శక్తులన్నీ భావిస్తున్నాయని తెలిపారు. కుట్రపూరిత కేసుల్ని మోపడం బిజెపి, సంఘ్ పరివార్ తరహా మితవాద అణచివేత స్వభావమున్న శక్తులకు అలవాటయ్యిందని పేర్కొ న్నారు. భిన్నాభిప్రాయాలున్న వారిని, మతోన్మాద విధానాల్ని ప్రశ్నించిన వారిని అణచివేసే ఇలాంటి కేసుల్ని ఎదుర్కొంటూనే, ప్రభుత్వ అణచివేత స్వభావాన్ని ప్రజారంగంలో ఎండగట్టాల్సిన అవసరముందని తెలిపారు. ప్రముఖ కవి వరవ రరావు తదితరులపై మోపిన భీమా కోరేగావ్ కేసు కూడా ఇలాంటిదేనని, లౌకిక, ప్రజాస్వామ్య వాదులు, వామపక్ష ప్రజా దృక్పథం ఉన్న మేధావులు, స్వేచ్ఛ కోసం పోరాడేవారందరూ ఈ తరహా అణచివేత చర్యల్ని తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

సంక్రాంతి ఛాంపియన్ గుంటూరు

ద్వితీయ స్థానంలో దక్షిణ మధ్య రైల్వే



గుంటూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంతర్రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సంక్రాంతి కప్-2019 ఛాంపియన్ గుంటూరు (పురుషుల, మహిళల)జట్టు నిలిచింది. ఫైనల్‌లో గుంటూరు జట్టు సౌత్ సెంట్రల్ రైల్వే (సికింద్రాబాద్)పై 31 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టి గుంటూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఆ జట్టులో మహేష్‌కుమార్ 67(42 బంతుల్లో; 4 ఫోర్లు, 3 సిక్సులు)పరుగులు, కెడి సాయి రాహుల్ 35(15 బంతుల్లో; 2 ఫోర్లు, 3 సిక్సులు)పరుగులతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించారు. సికింద్రాబాద్ బౌలర్ కార్తీక్ రామన్ 37 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 190 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కి దిగిన దక్షిణ మధ్య రైల్వే జట్టు 18.2 ఓవర్లలో 158 పరుగులకే కుప్పకూలింది. ఈ జట్టులో విశ్వనాథ్ 40(21 బంతుల్లో), చిరంజీవి 40(25 బంతుల్లో) పరుగులు చేసినా వీరికి సహకరించే వారు లేకపోవటంతో రైల్వేస్ జట్టుకి పరాజయం తప్పలేదు. గుంటూరు బౌలర్లలో స్వరూప్ 23 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సాధించాడు. ఈ టోర్నమెంట్‌లో మద్రాస్ రాయల్ సిసి జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ట్రోఫీలు బహూకరించారు. గుంటూరు జట్టుకి మొదటి బహుమతి రూ.లక్ష, సికింద్రాబాద్ జట్టుకి ద్వితీయ బహుమతి రూ.50 వేలు, మద్రాస్ జట్టుకి తృతీయ బహుమతి రూ.30 వేలు అందజేశారు. ప్రకాశం జిల్లా కోరిపాడు మండలం రావినూతల గ్రామంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఆర్ఎస్‌సిఎ) ఆధ్వర్యంలో 28వ అంతర్రాష్ట్ర టి-20 క్రికెట్ టోర్నమెంట్ సంక్రాంతి కప్-2019 ఈనెల 9వ తేదీ నుండి జరుగుతున్న సంగతి తెలిసిందే. కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు గిరిబాబు, యువ దర్శకులు అనిల్ రావిపూడి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ రఘుబాబు, ఆర్ఎస్‌సిఏ నాయకులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ విజేత ఎఓసి సికింద్రాబాద్

మహిళా విజేత సెయింటాన్స్

ప్రజాశక్తి-నూజివీడు



ట్రోఫిని అందుకుంటున్న సెయింటాన్స్ జట్టు

కళా ప్రపూర్ణ శ్రీరాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ మెమోరియల్ 43వ పోటీలు బాస్కెట్‌బాల్ మంగళవారంతో ముగిశాయి. కృష్ణాజిల్లా నూజివీడు ధర్మ అప్పారావు కళాశాలలో నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో పురుషుల విభాగంలో ఎఓసి సికింద్రాబాద్ జట్టు ట్రోఫీని కైవసం చేసుకోగా, మహిళా విభాగంలో సెయింటాన్స్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో సెయింటాన్స్ జట్టు జిఎస్సీ గుంటూరు జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండో స్థానంలో జిఎస్సీ గుంటూరు జట్టు నిలిచింది. పురుషుల విభాగం ఫైనల్లో ఎఓసి సికింద్రాబాద్ జట్టు సిఎంపిఎస్ హైదరాబాద్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. అనంతరం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విజేతలకు బహుమతులు అందించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68